

సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ నేతృత్వంలో కూటమి ప్రభుత్వం ఏడాదిలోనే 90% హామీలు నెరవేర్చి పింఛన్లు, తల్లికి వందనం, దీపం-2, అన్నా క్యాంటీన్లు, ఉపాధ్యాయ నియామకాలతో పాటు అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రైతులను ఆదుకుంటోంది.

ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్సీ



శనివారం 18.10.2025

INK OF TRUTH

# జర్నలిస్ట్ ఫైల్


తెలుగు దినపత్రిక

సంపుటి - 33 సంచిక - 182 www.journalistfile.com పేజీలు 8 వెల : రూ.5.00


## మైనింగ్ లీజుల్లో వడ్డెర్లకు 15% రిజర్వేషన్ !



- రాష్ట్రంలో ఖనిజాల విలువపై సమగ్ర అధ్యయనం
- మైనింగ్ లో శాటిలైట్, డ్రోన్ చిత్రాల ద్వారా విశ్లేషణ
- గనులు, ఉచిత ఇసుక విధానంపై సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలు



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** రాష్ట్రంలో లభ్యం అవుతున్న ఖనిజాల విలువపై సమగ్ర అధ్యయనం చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గనుల శాఖ ఉన్నతాధికారులను ఆదేశించారు. ఖనిజాలకు విలువ జోడింపుతోనే అదనపు ఆదాయం వస్తుందని సీఎం సూచించారు. శుక్రవారం రాష్ట్ర సచివాలయంలో గనుల శాఖ, ఉచిత ఇసుక విధానంపై ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. మేజర్, మైనర్ మినరల్స్ ద్వారా 2025-26 ఆర్థిక సంవత్సరానికి రూ.3320 కోట్ల ఆదాయార్జనను లక్ష్యంగా పెట్టుకున్నట్టు అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. గతంతో పోలిస్తే 34 శాతం మేర అదనంగా గనుల శాఖ నుంచి ఆదాయం వచ్చే అవకాశం ఉందని తెలిపారు. మాంగనీస్ లాంటి మేజర్ ఖనిజాల ఉత్పత్తిలో 72 శాతానికి పైగా ఆదాయం వస్తోందని వివరించారు. దీనిపై స్పందించిన సీఎం ఏపీలో ఉన్న మినరల్ వెల్త్ విలువను అంచనా వేయాలని సూచించారు. ఒడిశా లాంటి రాష్ట్రాల్లో వాల్యూ ఎడిషన్ ద్వారా ఎక్కువగా ఆదాయాన్ని పొందుతున్నారని.. రూ.50 వేల కోట్ల ఆదాయం ఖనిజాల నుంచే వస్తోందని సీఎం తెలిపారు. ఏపీలోనూ అందుకు తగిన విజన్ ప్లాన్ తయారు చేసి విలువ జోడిస్తే రూ.20-30 వేల కోట్ల ఆదాయాన్ని ఆర్జించే అవకాశం ఉంటుందని ముఖ్యమంత్రి అన్నారు. పెండింగ్ లో ఉన్న 6500 దరఖాస్తులకు అనుమతులు మంజూరు చేయాలని ఆదేశించారు.

**వడ్డెర్లకు మైనింగ్ లీజులు కేటాయింపుపై మార్గదర్శకాలు రూపొందించండి :**

వడ్డెర్లకు మైనింగ్ లీజుల కేటాయింపు అంశంపై విధానాన్ని తయారు చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. వడ్డెర్లు, సొసైటీలకు 15 శాతం మేర గనుల్లో రిజర్వేషన్ కల్పించే అంశాన్ని వచ్చే కేబినెట్ లో చర్చించేలా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. వెనుకబడిన వర్గాలైన వడ్డెర్లకు ఆర్థిక ప్రయోజనాలు కలిగేలా లీజు కేటాయింపు విధానాన్ని రూపొందించాలని సీఎం స్పష్టం చేశారు. సీనరేజి, ప్రీమియం మొత్తాల్లో 50 శాతం రాయితీ ఇవ్వాలని ఆదేశించారు. మైనింగ్ లీజుల కేటాయింపుతో పాటు వారు ఎంఎస్ఎంఈలుగా ఎదిగేందుకు కూడా ప్రస్తుతం ఉన్న పాలసీని అనుసంధానించాలని అన్నారు. రాష్ట్రంలో గనుల తవ్వకాలకు సంబంధించి శాటిలైట్ చిత్రాలు, డ్రోన్ ఆధారిత టెక్నాలజీతో విశ్లేషించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. ఇచ్చిన పర్మిట్లు, జరిగిన తవ్వకాలు ఎంత అనేది ఎప్పటికప్పుడు విశ్లేషించాలన్నారు. అనలటిక్స్ ను వినియోగించుకుని జరిగిన తవ్వకాలను అంచనా వేయాలన్నారు. బీచ్ శాండ్ మినరల్స్ లాంటి భార ఖనిజాల మైనింగ్ తో పాటు విలువ జోడింపు ద్వారా అధిక ఆదాయం సాధించేందుకు ఆస్కారం ఉంటుందని అన్నారు. అలాగే కడపలో నిర్మించనున్న స్టీల్ ప్లాంట్ కు మిగతా 2లో...

## భవిష్యత్తును మార్చేది సంస్కరణలే



- సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్ క్యాంపైన్ కాంపిటిషన్లో గెలుపొందిన విద్యార్థులను కలిసిన ముఖ్యమంత్రి
- విజేతలకు సర్టిఫికెట్లు అందచేసిన సీఎం

**అమరావతి ( జర్నలిస్ట్ ఫైల్ ):** భవిష్యత్తును మార్చేది సంస్కరణలేనని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా.. సంస్కరణలు తీసుకురావాల్సిన అవసరం ఉందని చెప్పారు. జీఎస్టీ సంస్కరణలపై రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్ ప్రచారంలో భాగంగా విద్యార్థులకు నిర్వహించిన పోటీల్లోని విజేతలు శుక్రవారం ముఖ్యమంత్రిని రాష్ట్ర సచివాలయంలో కలిశారు. 13 ఉమ్మడి జిల్లాలకు చెందిన 17 మంది విద్యార్థినీ విద్యార్థులు విజేతలుగా నిలిచారు. ఈ సందర్భంగా విజేతలకు సీఎం చంద్రబాబు సర్టిఫికెట్లను అందించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చిన్నారులతో కాసేపు ముచ్చటించారు. కేంద్ర ప్రభుత్వం తెచ్చిన జీఎస్టీ సంస్కరణల వల్ల కలిగే ప్రయోజనాలను అర్థం చేసుకున్నారా..? అని వారిని సీఎం అడిగారు. నిత్యావసరాల్లోని చాలా వస్తువులు సున్నా శాతం, 5 శాతం స్లాబ్ పరిధిలోకి వస్తున్నాయని.. దీని వల్ల చాలా వరకు ధరలు తగ్గుతాయని విద్యార్థులు చెప్పారు. నాటిన కొంత కాలానికి చెట్టు ఫలాలు ఇస్తున్నట్టు... సంస్కరణలను ఇప్పుడు అమలు చేస్తే కొన్ని రోజుల తర్వాత ఆ ఫలితాలు ప్రజలకు అందుతాయని సీఎం వివరించారు. జీఎస్టీ వంటి సంస్కరణలను అర్థం చేసుకుని వాటిపై ఎస్సే రైటింగ్ కాంపిటీషన్లు, పెయింటింగ్, ఉపన్యాస పోటీల్లో పాల్గొనడం... వాటిల్లో విజేతలుగా నిలవడం అభినందించదగ్గ విషయమని ముఖ్యమంత్రి అన్నారు. ఈ కార్యక్రమంలో విద్యా శాఖకు చెందిన ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## శనగ రైతులకు అండగా ఉంటాం



- రైతు ప్రయోజనాలే కూటమి ప్రభుత్వానికి ప్రాధాన్యం
- రబీ సీజన్ లో సబ్సీడీపై శనగ విత్తనాలు అందచేసేందుకు చర్యలు తీసుకుంటాం

**అమరావతి ( జర్నలిస్ట్ ఫైల్ ):** రబీ సీజన్లో రాష్ట్రవ్యాప్తంగా శనగ పంట సాగు చేసే రైతులకు సబ్సిడీపై విత్తనాలు అందుబాటులోకి తీసుకురావడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఓ ప్రకటనలో తెలిపారు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మంత్రి అచ్చెన్నాయుడు భరోసా ఇచ్చారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు ఎంత కఠినంగా ఉన్నా రైతుల పట్ల కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉంది. రైతు అభ్యున్నతే మా లక్ష్యం. ప్రతి రైతు అవసరాలను గుర్తించి, వారికి అవసరమైన విత్తనాలు సమయానికి అందేలా చర్యలు తీసుకుంటున్నామని మంత్రి అన్నారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించేందుకు వ్యవసాయ శాఖ ఇప్పటికే జిల్లాల వారీగా అంచనా వేస్తోందని, ప్రతి రైతు అవసరాలకు సరిపడే విత్తనాలు అందుబాటులో ఉండేలా అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు ఆయన తెలిపారు. రైతు కష్టపడి పండించే ప్రతి గింజ రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు బలమవుతుంది. అందుకే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం రైతు సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతోందని అన్నారు. రైతు కోసం కొత్త ఆలోచనలు, సాంకేతికతను ఉపయోగించి వ్యవసాయం లాభదాయకంగా మారాలనే ఉద్దేశ్యంతో సీఎం చంద్రబాబు ప్రత్యేక దిశానిర్దేశాలు ఇచ్చారు. రైతు ఆదాయాన్ని పెంచే ప్రతి కార్యక్రమానికి ప్రభుత్వం అండగా ఉంటుంది అని మంత్రి పేర్కొన్నారు.

## పీహెచ్సీ వైద్యులు వెంటనే విధుల్లో చేరాలి



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** ప్రజారోగ్యం దృష్ట్యా వెంటనే విధుల్లో చేరాలని పీహెచ్సీ వైద్యులకు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ కార్యదర్శి సౌరభ్ గౌర్ విజ్ఞప్తిచేశారు. పీజీ మెడికల్ ఇన్-సర్వీసు కోటాలో ఈఏడాదికి 20% సీట్లను అన్ని స్పెషాల్టీ కోర్సుల్లో కలిపి కేటాయిస్తామని గతంలో ఇచ్చిన హామీపై జీఓ విడుదలకు సిద్ధంగా ఉన్నామని వెల్లడించారు. రాష్ట్ర సచివాలయంలో శుక్రవారం రాత్రి సుమారు గంటపాటు పీహెచ్సీ వైద్యుల సంఘం నేతలతో ఆయన చర్చించారు. ఈ సందర్భంగా సౌరభ్ గౌర్ మాట్లాడుతూ వైద్యులు పీహెచ్సీ విధులకు దూరంగా ఉండడం మంచిది కాదని హితవు పలికారు. వైద్యుల ట్రైబల్ అలవెన్సు, నోషనల్ ఇంక్రిమెంట్లు, ఇతర ఆర్థిక ప్రయోజనాలు, సర్వీసు వ్యవహారాలకు సంబంధించిన డిమాండ్ల పరిష్కారానికి ప్రభుత్వం సానుకూలంగా ఉందని తెలిపారు. విధులకు వైద్యుల హాజరుపై వివరాలు సేకరిస్తున్నామన్నారు.

అయితే 2026-27 నుంచి కనీసం మూడేళ్ల పాటు 15% సీట్లను పీజీ ఇన్-సర్వీసు కోటాలో అన్ని స్పెషాల్టీ కోర్సుల్లో కేటాయించాలని సంఘం నేతలు సౌరభ్ గౌర్ ను కోరారు. పలువురు మాత్రం రెండేళ్లపాటు కొనసాగించాలని విజ్ఞప్తి చేశారు.

దీనిపై ఆయన స్పందిస్తూ భవిష్యత్తులో ఇన్-సర్వీసు కోటా ఎంతవరకు ఉండాలన్న దానిపై నవంబరులోగా ప్రభుత్వం విధానపరమైన నిర్ణయాన్ని తీసుకుంటుందని చెప్పారు. పాలసీ రూపకల్పనలో సంఘం ప్రతినిధులకు కూడా భాగస్వామ్యం కల్పిస్తామని చెప్పారు.

## విద్యార్థులను కన్నబిడ్డల్లా చూసుకోండి...



**అమరావతి ( జర్నలిస్ట్ ఫైల్ ):** బీసీ హాస్టళ్లు, ఎంజేపీ స్కూళ్లలో చదివే విద్యార్థులకు కంటికి రెప్పల్లా, సొంత బిడ్డల్లా చూసుకోవాలని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత స్పష్టంచేశారు. రోజూ కురుస్తున్న వర్షాలు, మారుతున్న వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని, వారానికోసారి సమీపంలో ఉన్న పీహెచ్సీ వైద్యులతో పిల్లలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలని ఆదేశించారు. డీబీసీడబ్ల్యూవోలు, ఏబీసీడబ్ల్యూవోలు ప్రతి రోజూ హాస్టళ్లను సందర్శించాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న బీసీ హాస్టళ్ల వార్డెన్లు, ఎంజేపీ స్కూళ్ల ప్రిన్సిపాళ్లతో మంత్రి సవిత శుక్రవారం అమరావతిలోని రాష్ట్ర సచివాలయం నుంచి జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. హాస్టళ్లలో పారిశుధ్యంపై తీసుకుంటున్న చర్యలు గురించి అడిగి తెలుసుకున్నారు. హాస్టళ్ల నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విద్యార్థులకు వేడి చల్లార్చిన నీరు, తాజా ఆహారం మాత్రమే ఇవ్వాలన్నారు. వసతి గృహాల పరిసరాలను, మరుగుదొడ్లు, మిగతా 2లో...

## బెంగళూరుతో విశాఖకు పోలిక అవసరం లేదు



**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్) :** ఒక ప్రాంతంలో పరిశ్రమలు రావడానికి కావాల్సిన ఎకో సిస్టమ్ అభివృద్ధి చేసేందుకు అనేక రాయితీలు ఇవ్వాల్సిన అవసరముందని కేంద్ర కమ్యూనికేషన్, గ్రామీణ అభివృద్ధి సహాయ.మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. విశాఖలో గూగుల్ ఏర్పాటు నేపథ్యంలో పలు రాష్ట్రాల నుంచి వస్తున్న వ్యాఖ్యలపై శుక్రవారం ఆయన స్పందించారు.

ఒకసారి ఎకో సిస్టమ్ ఏర్పాటైన తర్వాత రాయితీలు ఇవ్వాల్సిన అవసరముండదు. ప్రస్తుతం గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటు తర్వాత విశాఖలో చాలా సంస్థలు పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపిస్తున్నాయి. బెంగళూరు లాంటి ప్రాంతాల్లో ఒక ఎకో సిస్టమ్ ఏర్పాటైంది. ఆ ప్రాంతంతో విశాఖకు పోలిక అవసరం లేదు. పోస్టల్, బీఎస్ఎన్ఎల్ సంస్థలను కామన్ మ్యాన్‌కి ఉపయోగపడేలా చర్యలు తీసుకుంటున్నాం. ఖర్చులు ఎక్కువగా ఉండి ఆదాయం తక్కువగా ఉండే పోస్టల్ డిపార్ట్‌మెంట్ బలోపేతానికి చర్యలు చేపడుతున్నాం. రూ. 5వేల కోట్లతో పోస్టల్ శాఖ నిలదొక్కుకునేలా కార్యాచరణ ప్రారంభించాం. రాబోయే కాలంలో ఆదాయం అందించే సంస్థగా దీన్ని తీర్చిదిద్దుతాం. దేశంలో ప్రతి మారుమూల గ్రామానికి భారత్ నెట్ సేవలు అందించేలా చర్యలు తీసుకుంటున్నాం. బీఎస్ఎన్ఎల్ సేవలను మెరుగు పరచడానికి దాదాపు 20వేల కొత్త సెల్ టవర్లు ఏర్పాటు చేస్తున్నాం'అని పెమ్మసాని వివరించారు.



## పీఎం మోడీకి ఏపీ అంటే అమిత ప్రేమ

- అందుకే 16 నెలల్లో 5 సార్లు రాష్ట్రంలో పర్యటన
- రూ.లక్షల కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం
- వికసిత భారత్‌లో ఏపీని కీలకంగా మార్చాలన్నదే పీఎం ఆశయం
- ఇందుకు అనుగుణంగా రాష్ట్రప్రభుత్వం పనిచేస్తోంది
- పీఎంకి ధన్యవాదాలు

**వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్**

**అమరావతి ( జర్నలిస్ట్ ఫైల్ ):** ప్రధాన మంత్రి నరేంద్రమోదీకి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రమన్నా, ప్రజలన్నా అమితమైన ప్రేమ ఉందని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. కర్నూలులో జరిగిన పర్యటన సందర్భంగా ప్రధాని ఈ విషయాన్ని మరోమారు చాటిచెప్పారని తెలిపారు. ప్రధాని నరేంద్రమోదీ కర్నూలు పర్యటన విజయవంతమైందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొని ఏపీ అభివృద్ధి పథంలో భాగమైనందుకు ప్రధాని మోదీకి సత్య కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు. దేశంలోని మిగిలిన రాష్ట్రాలన్నిటికంటే కూడా ప్రధాని మోదీ హృదయంలో ఏపీకి ప్రత్యేక స్థానముందన్నారు. మిగతా 2లో...

## మత్స్యకారుల జీవితాల్లో మెరుగైన మార్పులు



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** మత్స్యకారుల ఆందోళన నేపథ్యంలో సొంత నియోజకవర్గమైన పిఠాపురంలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పర్యటించిన విషయం తెలిసిందే. ఆ సమయంలో కాకినాడ కలెక్టరేట్‌లో ఉప్పాడ తీర ప్రాంత గ్రామాల, మత్స్యకార సంఘాల ప్రతినిధులతో సమావేశం నిర్వహించి వారి సమస్యల గురించి తెలుసుకున్నారు. ఈ క్రమంలో ఉప్పాడ తీర ప్రాంత గ్రామాల మత్స్యకారుల జీవితాల్లో మెరుగైన మార్పులు తీసుకువచ్చేందుకు పవన్ కల్యాణ్ అధికార యంత్రాంగం, శాస్త్రవేత్తలతో చర్చించారు. క్యాంపు కార్యాలయంలో 100 రోజుల ప్రణాళిక అమలు పై పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి, మత్స్యశాఖ ఉన్నతాధికారులతో పాటు సెంట్రల్ మెరైన్ ఫిషరీస్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్, విశాఖ శాస్త్రవేత్తలతో సమీక్ష నిర్వహించారు. మిగతా 2లో...

## రహదారుల అభివృద్ధిపై సీఎం ప్రత్యేక దృష్టి



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్రంలో రహదారుల అభివృద్ధి, ప్రజలకు సమర్థవంతమైన రహదారులు కల్పించడంలో ముఖ్యమైన ఆవశ్యకత ఉందని రోడ్లు, భవనాలు, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి తెలిపారు. ప్రత్యేకంగా దీర్ఘకాల నిర్లక్ష్యానికి గురైన రహదారులకు ప్రాధాన్యత కల్పిస్తూ ప్రభుత్వం వేగవంతమైన అభివృద్ధి పనులు చేపడుతోందని మంత్రి చెప్పారు.

నేడు విజయవాడలోని ఈఎన్సీ కార్యాలయంలో ఎన్‌డీబి రహదారుల పనులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్&బీ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఎం.టి. కృష్ణబాబు, చీఫ్ ఇంజనీర్లు శేషు కుమార్, విజయశ్రీ మరియు ఎన్‌డీబి, సీఆర్ఐఎఫ్ కాంట్రాక్టర్లు కూడా పాల్గొన్నారు.

మంత్రికి తెలిపిన వివరాల ప్రకారం, కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాకతో పాటు గత ప్రభుత్వ నిర్లక్ష్య కారణంగా నిలిచిన ఎన్‌డీబి, సీఆర్ఐఎఫ్ రోడ్ల పనులను పట్టాలెక్కించి, కాంట్రాక్టర్లకు పెండింగ్ బిల్లులు దాదాపు రూ. 239 కోట్లు చెల్లించడం జరిగింది. మిగతా 2లో...

# మైనింగ్ లీజుల్లో వడ్డెర్లకు 15 శాతం రిజర్వేషన్ !



(మొదటి పేజీ తరువాయి)

ముడి ఇనుము ఖనిజం సరఫరా పై కూడా అధ్యయనం చేయాలని సూచించారు.

**ఉచిత ఇసుకతో ప్రజలకే ప్రయోజనం దక్కాలి :**

ప్రభుత్వం అమలు చేస్తున్న ఉచిత ఇసుక విధానం ద్వారా ప్రజలందరికీ ప్రయోజనం కలగాలని సీఎం స్పష్టం చేశారు. దీనికి అనుగుణంగా ఉచిత ఇసుక సరఫరాను సమర్థవంతంగా అమలు చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. వ్యవస్థలో ఉన్న లోపాలను వినియోగించుకుని దుర్వినియోగం చేసే అవకాశం లేకుండా నిబంధనలు కఠినంగా అమలు చేయాలని సీఎం స్పష్టం చేశారు. ఈ సీజన్ కోసం 66.5 లక్షల మెట్రిక్ టన్నుల ఇసుకను నిల్వ చేశామని.. ప్రస్తుతం అన్ని స్టాక్ పాయింట్లలోనూ 43 లక్షల మెట్రిక్ టన్నుల ఇసుక అందుబాటులో ఉందని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. దీనిపై సీఎం స్పందిస్తూ చిట్టచివరి వ్యక్తికీ ప్రయోజనం దక్కేలా ఇసుక లభ్యత జరగాలని అన్నారు. ఇసుక లోడింగ్ తో పాటు రవాణాకు అతితక్కువ వ్యయం అయ్యేలా చూడాలని సీఎం సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా ఉచిత ఇసుక లభ్యతపై ఎప్పటికప్పుడు తనిఖీలు చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. అంతర్రాష్ట్ర సరిహద్దుల్లోని అన్ని రూట్లలో పెట్టిన సీసీ కెమెరాల నిఘాను మరింత పటిష్టం చేయాలని సీఎం సూచించారు.

ఆర్టీజీఎస్ ద్వారా ఉచిత పంపిణీ విధానంపై పర్యవేక్షించాలని సీఎం అన్నారు. ఈ సమీక్షకు గనులు, భూగర్భ వనరుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర, ఆ శాఖ ఉన్నతాధికారులు ముఖేష్ కుమార్ మీనా, ప్రవీణ్ కుమార్, ఆర్టీజీఎస్ అధికారులు హాజరయ్యారు.

# పీఎం మోడీకి ఏపీ అంటే అమిత ప్రేమ



(మొదటి పేజీ తరువాయి)

మోదీ మూడో పర్యాయం ప్రధాని మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఒక్క ఏపీలో మాత్రమే అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొనడానికి 5 సార్లు పర్యటించారని, మరే ఇతర రాష్ట్రంలోనూ ఆయన ఇన్ని సార్లు పర్యటించలేదని తెలిపారు. తాను ప్రధాని కార్యాలయంలో ఈ విషయం గురించి స్వయంగా అడిగి తెలుసుకున్నానని చెప్పారు.

**ప్రతి పర్యటనకు ఓ విశేషం :** మోదీ మూడో పర్యాయం ప్రధాని అయ్యాక 2024 జూన్ 12న తొలిసారిగా ఏపీలో కూటమి ప్రభుత్వ ప్రమాణ స్వీకారోత్సవానికి వచ్చారని, రెండోసారి ఈ ఏడాది జనవరి 8వ తేదీ విశాఖపట్నం నగరానికి వచ్చారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో రూ. 2.10లక్షల కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారని తెలిపారు. మే నెల 1, 2వ తేదీల్లో అమరావతిలో పర్యటించి రూ. 58 వేల కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారన్నారు. తదుపరి నాలుగో పర్యాయం జూన్ 21వ తేదీన విశాఖపట్నంలో అంతర్జాతీయ యోగా దినోత్సవంలో పాల్గొన్నారు. లక్షలాది మందితో ఒకేసారి 3 లక్షల మందితో యోగాసనాలు వేయడం ద్వారా ఏపీ గిన్నెస్ రికార్డు నమోదు చేసిన ఈ కార్యక్రమంలో మోదీ స్వయంగా పాల్గొనడంతో ప్రపంచం మొత్తం ఏపీవైపు చూసేలా చేశారన్నారు. ఇప్పుడు ఐదో సారి కర్నూలులో పర్యటించి రూ. 13,430 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారని తెలిపారు.

**ఏపీనే కీలకం :** 2047 వికసిత భారత్ లో ఆంధ్రప్రదేశ్‌ను కీలకంగా మార్చాలన్నదే ప్రధాని మోదీ ఆశయమన్నారు. మోదీ ఆశయ సాధనకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌లు శక్తి వంచన లేకుండా కృషి చేస్తున్నారని తెలిపారు. మోదీ సహకారంతో దేశంలో అత్యంత అభివృద్ధి చెందిన రాష్ట్రంగా ఏపీ అవతరిస్తుందనడంలో ఎలాంటి సందేహం లేదని మంత్రి సత్యకుమార్ తెలిపారు.

# రహదారుల అభివృద్ధిపై సీఎం ప్రత్యేక దృష్టి

(మొదటి పేజీ తరువాయి)

ఎన్‌డీబి రహదారుల 85 రోడ్లను 682 కి.మీ పరిధిలో కుదించడం కోసం రూ. 1680.97 కోట్లతో పనులు ప్రారంభించగా, ఇప్పటివరకు 546 కి.మీ పనులు ప్రారంభం అయ్యి, 236 కి.మీ పనులు పూర్తయ్యాయని తెలిపారు. మొత్తం ఖర్చు రూ. 932.99 కోట్లు అయ్యాయి.

ఫేజ్ 1 కింద దాదాపు 747.98 కోట్ల పనులు పూర్తి చేసి, రూ. 434 కోట్ల నిధులు కాంట్రాక్టర్లకు చెల్లించబడ్డాయి. ఇంకా రూ. 151 కోట్లు చెల్లింపుకు మిగిలినవి. మొత్తం 44.49 శాతం పనులు పూర్తయిన స్థితి ఉంది. అయితే 6 జిల్లాల్లో పనులు 50 శాతం కంటే తక్కువగా ఉండటంతో, ఆ జిల్లాల్లో అధికారులు పనులను వేగవంతం చేయాలని మంత్రి సూచించారు.

ఎన్‌డీబి, సీఆర్ఐఎఫ్ పనుల్లో జాప్యం కారణంగా ప్రజలు, వాహనదారులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను అధికారం గమనించి, మిగిలిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కాంట్రాక్టర్లకు మంత్రి ఆదేశించారు. కాంట్రాక్టర్లు మార్చి 2026 లోపు పెండింగ్ పనులను పూర్తిచేస్తామని హామీ ఇచ్చారు. అదే సమయంలో పెండింగ్ బిల్లులు త్వరితగతిన చెల్లించాలన్న వినతిని మంత్రి స్వీకరించారు.

భవిష్యత్తులో రహదారుల అభివృద్ధిలో నాణ్యతా ప్రమాణాలను కాపాడుతూ, వంతెనలు, కల్వర్టులు మినహాయించి రహదారుల నిర్మాణంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులకు ఆదేశించారు. గతంలో ఎన్‌డీబి %డ% సీఆర్ఐఎఫ్ కింద రద్దయిన 650 కి.మీ రోడ్లకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చి, వర్షాకాలం ముగిసిన తర్వాత రహదారుల మరమ్మత్తులు, అభివృద్ధి పనులను వేగవంతం చేయాల్సిన అవసరం ఉందని మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి సూచించారు.

# పశువులకు వైద్య శిభిరం



కాకుమాను, (జర్నలిస్ట్ ఫైల్):మండల పరిధిలోని వల్లూరు గ్రామంలో పశు వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమం లో భాగంగా ముఖ్య అతిథిగా తెనాలి డివిజన్ ఉపసంచాలకులు డా. పద్మావతి పాల్గొని మాట్లాడుతూ

రాష్ట్ర ప్రభుత్వ పశుసంవర్ధక శాఖ పశు గణాభివృద్ధి సంస్థ సంయుక్తంగా రాష్ట్రీయ గోకుల్ మిషన్ ద్వారా పశువులకు ఉచిత గర్భ కోశ వ్యాధుల శిభిరం నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమం లో నిడుబ్రోలు ప్రాంతీయ పశు వైద్య శాల సహాయ సంచాలకులు డా. కేశవరావు, డా. శైలజ, డా. యస్మిన్, డా. శ్రీనివాసరావు, డా. సౌమ్య, డా. చలపతిరావు, డా. హరీష్, డా. శేఖర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# చక చకా సాగుతున్న అమరావతి రాజధాని పనులు

- **రూ.51 వేల కోట్లతో తొలిదశ పనులుప్రారంభం**
- **మూడేళ్లలో రాజధాని తొలి దశ పనులు పూర్తి**
- **ఒక లక్ష్యంతో అడుగులు**



**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్) :** అమరావతిలో రాజధాని నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఈ ఏడాది మే నెలలో ప్రధాని మోదీ చేతుల మీదుగా పనుల పునఃప్రారంభోత్సవం జరిగింది. రాష్ట్రానికి ఆర్థిక చుక్కానిలా నిలిచే అమరావతి నిర్మాణంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. సుమారు రూ. 51 వేల కోట్ల పనులు జరుగుతున్నాయి. ఇక్కడ బిహార్, ఒడిశా, పశ్చిమ బెంగాల్, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన 11 వేల మంది కార్మికులు పని చేస్తున్నారు. మూడేళ్లలో రాజధాని తొలి దశ పనులు పూర్తి చేయాలని కూటమి ప్రభుత్వం లక్ష్యం నిర్దేశించుకుంద

ఈ నేపథ్యంలో భవన నిర్మాణ పనుల్లో పురోగతి కనిపిస్తోంది. అయితే రెండు నెలలుగా వదలకుండా కురుస్తున్న వర్షాలతో కొన్ని పనులకు మాత్రం ఆటంకం ఏర్పడుతోంది. ఎల్పీఎస్ జోన్లలో మౌలిక వసతుల కల్పన పనుల్లో ప్రతిష్టంభన నెలకొంది. రహదారుల నిర్మాణ పనులకూ అవరోధాలు ఎదురవుతున్నాయి. రహదారుల పక్కన మురుగు, తాగునీటి పైప్‌లైన్లు వేసేందుకు అవసరమైన సామగ్రి ఇప్పటికే రాజధానికి చేరుకొంది. పనుల కోసం తవ్విన గుంతల్లోకి వాన నీరు చేరుతోంది. వర్షాలు ఆగితే పనులు మరింత ముమ్మరం కానున్నాయి.

రాజధానిలో సీఆర్డీఏ ప్రధాన కార్యాలయం నిర్మాణం పూర్తి చేసుకుంది. ఈ భవనాన్ని ఈ నెల 13న ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రారంభించనున్నారు. జీ+7 అంతస్తుల్లో నిర్మించారు. దీని బిల్టప్ ఏరియా 2.42 లక్షల చదరపు అడుగులు. ఇప్పటి వరకు విజయవాడ నుంచి సీఆర్డీఏ, ఏడీసీఎల్ కార్యకలాపాలు సాగాయి.

పరిపాలనలో కీలకమైన సీనియర్ అఖిల భారత సర్వీసు అధికారుల వసతి కోసం జీ+1లో బంగ్లాలు నిర్మిస్తున్నారు. వీటిని కార్యదర్శులు, ముఖ్యకార్యదర్శుల కోసం ఉపయోగిస్తారు. వీటి నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి. ఇప్పటికే కొన్ని భవనాల నిర్మాణం పూర్తయింది.

హైకోర్టు న్యాయమూర్తులు నివాసం ఉండేందుకు సువిశాలమైన బంగ్లాలను కడుతున్నారు. ప్రతి బంగ్లాకు సెక్యూరిటీ పోస్టు, సిబ్బందికి గది, ప్రహరీతో ప్రత్యేక ఛాంబర్, తదితర వసతులు సమకూరుస్తున్నారు. శాశ్వత హైకోర్టుకు సమీపంలో వీటిని నిర్మిస్తున్నారు. కొన్ని బంగ్లాలు తుది రూపునకు వచ్చాయి

పురపాలకశాఖకు చెందిన అన్ని విభాగాలను ఒకే చోటుకు తెచ్చేందుకు సీఆర్డీఏ కార్యాలయం ఎదుట నాలుగు భవనాలు నిర్మిస్తున్నారు. మూడు భవనాల పనులు తుది దశకు చేరుకున్నాయి. స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్, మెప్మా, టిడ్కో తదితర విభాగాలు ఇందులోకి రానున్నాయి.

రాజధానిలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఇంటి నిర్మాణానికి ఈ ఏడాది ఏప్రిల్ 9న శంకుస్థాపన చేశారు. ఇంటిని 1,455 చదరపు గజాల విస్తీర్ణంలో జీ+1లో నిర్మించనున్నారు. ప్రస్తుతం స్లాబ్ కాంక్రీట్ పనులు జరుగుతున్నాయి. ఇంటి ఎదుట సమావేశ మందిరం, సెక్యూరిటీ సిబ్బంది కోసం గదుల నిర్మాణ పనులు చివరి దశలో ఉన్నాయి.

అడుగడుగునా ఆధునిక నిర్మాణ శైలి, కళ్లు చెదిరే ఇంటీరియర్స్, సిబ్బంది కోసం వర్క్ స్టేషన్లతో కార్పొరేట్‌కు ఏమాత్రం తీసిపోని రీతిలో సీఆర్‌డీఏ ప్రధాన కార్యాలయం రాజధాని అమరావతిలో సకల హంగులతో సిద్ధమైంది. సీడ్ యాక్సెస్ రోడ్డు పక్కన రాయపూడి సమీపంలో నిర్మించిన ఈ భవనం ఎన్నో ప్రత్యేకతలను సంతరించుకుంది. కూటమి ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత ప్రారంభించనున్న తొలి పూర్తి స్థాయి భవనం ఇదే.

ఈ భవనాన్ని ఈ నెల 13న ప్రారంభించనున్నారు. రాజధాని ప్రాంత ప్రాధికార సంస్థ కార్యకలాపాలు ఇక విజయవాడ నుంచి అమరావతికి మారనున్నాయి. పెద్దఎత్తున సాగుతున్న రాజధాని పనుల పర్యవేక్షణకు కమాండ్ కంట్రోల్ రూమ్‌ను సీఆర్?డీఏ ఏర్పాటు చేసింది. పనులు సరైన సమయంలో పూర్తయ్యేలా చూసేందుకు సీఆర్‌డీఏ ప్రధాన కార్యాలయం నుంచి నిరంతరం పర్యవేక్షిస్తారు.

# విద్యార్థులను కన్నబిడ్డల్లా చూసుకోండి...

(మొదటి పేజీ తరువాయి)



బాత్ రూమ్ లను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలన్నారు. హాస్టళ్ల పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని, దోమలు వ్యాప్తి చెందకుండా స్థానిక సంస్థల సాయంతో ఫాగింగ్ చేయించాలని మంత్రి సవిత ఆదేశించారు.

**దురదృష్టకర ఘటనలకు తావివ్వొద్దు :** ప్రస్తుతం రాష్ట్రంలో కొన్న సంక్షేమ హాస్టళ్లలో దురదృష్టకర సంఘటనలు చోటుచేసుకుంటున్న నేపథ్యంలో వార్డెన్లు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని మంత్రి సవిత దిశా నిర్దేశం చేశారు. విద్యార్థులను కన్న బిడ్డల్లా, కంటికి రెప్పలా కాపాడుకోవాలన్నారు. వారానికోసారి హాస్టళ్లకు సమీపంలో ఉన్న పీహెచ్సీ వైద్య సిబ్బందితో విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు చేయించాలన్నారు. ఎవరికైనా అనారోగ్య లక్షణాలు కనిపిస్తే తక్షణమే వైద్యాధికారితో వైద్యమందించాలని, అవసరమైతే మెరుగైన వైద్యం కోసం జిల్లా ఆసుపత్రులకు తరలించాలని స్పష్టంచేశారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు, మారుతున్న వాతావరణ పరిస్థితులతో మరింత అప్రమత్తంగా ఉండాలన్నారు. హాస్టళ్లలో విపత్కర పరిస్థితులు తలెత్తగానే తక్షణమే ఉన్నతాధికారులకు సమాచారమివ్వాలన్నారు. అన్నవరం బీసీ హాస్టల్ వంటి ఘటనలు పునరావృతం కానివ్వొద్దన్నారు.

**రోజూ తనిఖీ ఫొటోలు పంపండి... :** డీబీసీడబ్ల్యూవోలు, ఏబీసీడబ్ల్యూవోలు, కో ఆర్డినేటర్లు రోజూ తమ పరిధిలో ఉన్న బీసీ హాస్టళ్లను, ఎంజేపీ స్కూళ్లను సందర్శించాలని మంత్రి సవిత స్పష్టంచేశారు. సందర్శించిన కో ఆర్డినేట్ ఫొటోలతో తనిఖీ నివేదికలను వాట్సాప్ గ్రూప్ లో పొందుపర్చాలన్నారు. హాస్టళ్ల నిర్వహణలో వార్డెన్లు, డీబీసీడబ్ల్యూవోలు, ఏబీసీడబ్ల్యూవోలు, కో ఆర్డినేటర్లు సమన్వయంతో పనిచేయాలన్నారు. విద్యార్థులకు ఆరోగ్య భద్రతతో కూడిన విద్య అందించడమే ప్రభుత్వ లక్ష్యమని, ఆ లక్ష్యసాధనలో అందరూ భాగస్వాములు కావాలని మంత్రి సవిత పిలుపునిచ్చారు.

**వంద శాతం ఫలితాలే లక్ష్యం :** రాబోయే టెన్త్, ఇంటర్ పరీక్షల్లో వంద శాతం ఫలితాలు రావాలని, ఇందుకోసం ఇప్పటి నుంచే ప్రణాళికలు రూపొందించుకోవాలని మంత్రి సవిత స్పష్టంచేశారు. ముఖ్యంగా వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. వారి కోసం ప్రత్యేక తరగతులు నిర్వహించాలన్నారు. విద్యార్థులతో ప్రేమ పూర్వకంగా మెలుగుతూ, విద్యపై ఆసక్తి కలిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. విద్యార్థుల మధ్య స్నేహపూర్వక వాతావరణం పెంపొందించేలా చూడాలన్నారు. ఈ జూమ్ కాన్ఫరెన్స్ లో బీసీ సంక్షేమ శాఖ కార్యదర్శి ఎస్.సత్యనారాయణ, డైరెక్టర్ మల్లికార్జున, ఎంజేపీ కార్యదర్శి మాధవీలత, వివిధ జిల్లాలకు డీబీసీడబ్ల్యూవోలు, ఏబీసీడబ్ల్యూవోలు, హాస్టల్ వార్డెన్లు కో ఆర్డినేటర్లు, ప్రిన్సిపాళ్లు పాల్గొన్నారు.

# మత్స్యకారుల జీవితాల్లో మెరుగైన మార్పులు

(మొదటి పేజీ తరువాయి)

మత్స్యకారులలో చేపల వేట సామర్థ్యాన్ని మరింత పెంపొందించేందుకు ఉన్న అవకాశాలు, మత్స్యకారులకు అదనపు ఆదాయం సముపార్జనకు తీసుకోవాల్సిన చర్యలపై అధికారులతో పవన్ కల్యాణ్ సుదీర్ఘంగా చర్చించారు. కాకినాడ పర్యటన సందర్భంగా పిఠాపురం నియోజకవర్గం పరిధిలోని ఉప్పాడ తీర ప్రాంత గ్రామాల మత్స్యకారులు లేవనెత్తిన సమస్యల పరిష్కారానికి 100 రోజుల ప్రణాళికలో భాగంగా ఇప్పటి వరకు తీసుకున్న చర్యలు, తీసుకోవాల్సిన చర్యలపై ఈ సమీక్షలో చర్చించారు. ఉప్పాడ తీర ప్రాంత మత్స్యకార గ్రామాల్లో సదుపాయాలు కల్పించడంతోపాటు వారి జీవనోపాధిని మెరుగుపర్చేందుకు ఉన్న అవకాశాలు అన్వేషించాలని సూచించారు. ముఖ్యంగా చేపల వేటలో మెలకువలు నేర్పడం, నైపుణ్యం పెంచడంతోపాటు తగిన సౌకర్యాల కల్పనపైనా దృష్టి సారించాలని తెలిపారు. వీటితోపాటు మత్స్య సంపదను పెంపొందించడం తదితర అంశాలపై విశాఖ సీఎంఎఫ్ఆర్ఐ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ జోయ్ కె. కిజాకుడాన్ సలహాలు, సూచనలు తీసుకున్నారు. ఆయన సూచనలను అమలు చేసేందుకు ఉన్న అవకాశాలను పరిశీలించాలని కాకినాడ జిల్లా కలెక్టర్?కు సూచించారు. ఈ సమీక్ష సమావేశంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ మైలవరపు కృష్ణ తేజ, మత్స్య శాఖ కమిషనర్ రామశంకర్ నాయక్, కాకినాడ జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి, ఎస్పీ బిందు మాధవ్, పడా ప్రాజెక్ట్ డైరెక్టర్ చైత్ర వర్షిణి తదితరులు పాల్గొన్నారు. 100 రోజుల సమయం ఇవ్వాలి: ఇటీవల ఉప్పాడలో పర్యటించిన పవన్ కల్యాణ్ ఉప్పాడ సీ ప్రొటెక్షన్ వాల్‌ను కచ్చితంగా నిర్మిస్తామని హామీ ఇచ్చారు. ఇందుకు కేంద్రం సానుకూలంగా ఉందన్న పవన్ నిధుల విషయమై చర్చిస్తున్నట్లు తెలిపారు. సముద్రంలో మత్స్య సంపదకు విఘాతం కలిగిస్తున్న పరిశ్రమల వ్యర్థాలు, కాలుష్య నివారణకు ఓ ప్రణాళికతో వస్తానన్న ఆయన అందుకు తనకు 100 రోజుల సమయం ఇవ్వాలని కోరారు. అదే సమయంలో పారిశ్రామికవేత్తలపైకి ఎగదోసే రాజకీయ నేతల వలలో పడొద్దని మత్స్యకారులకు పవన్ కల్యాణ్ సూచించారు.

# ఏటా గతి తప్పుతున్న రుతువులు...!



**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్):** ఈసారి నైరుతి రుతుపవనాలు కాస్త ముందే వచ్చినా, ఆ తరవాత వాటి కదలికలు కొంత కాలంపాటు మందగించాయి. ఇప్పుడు వర్ష రుతువు చివరి రోజుల్లోనూ వాయుగుండాలూ భారీ వర్షాలూ వచ్చిపడుతున్నాయి. హైదరాబాద్, ముంబయి, దిల్లీ వంటి మహానగరాలను కుండపోత వానలు ముంచెత్తడం చూస్తూనే ఉన్నాం. కర్బన ఉద్గారాల వల్ల భూఉష్ణోగ్రత పెరగడమే ఈ వాతావరణ మార్పులకు కారణం. దీనిపై చేపట్టిన అధ్యయనాలు ఎన్నో సంచలనాత్మక విషయాలను వెల్లడిస్తున్నాయి. భవిష్యత్తులో భారత్‌పై రుతుపవనాల ప్రభావంలో చాలా మార్పులు రానున్నాయి.

వేసవిలో భరత భూమి సహజంగానే వేడెక్కుతుంది. ఇటీవలి దశాబ్దాలలో వాతావరణ మార్పుల వల్ల హిమాలయాల్లోని మంచు వేగంగా కరగడం వేసవి ఉష్ణోగ్రతలను మరింత పెంచేస్తోంది. ఇలా వేడెక్కే భారతదేశానికి హిందూ మహాసముద్రం నుంచి వచ్చే చల్లని గాలులు నైరుతి రుతుపవనాలను తీసుకొస్తాయి. అయితే నేడు హిమాలయాలతోపాటు ఉత్తర, దక్షిణ ధ్రువాల్లోని మంచు కరిగిపోతూ భారతదేశ వర్షపాతాన్ని శాసించడం మొదలైంది.

**వానల రాకపోకల్లో మార్పులు**

హిమాలయాల మాదిరిగానే ఆర్కిటిక్‌లోని మంచు విస్తీర్ణం కుదించుకుపోతున్నందున అక్కడి నుంచి చల్లని గాలులు భూమధ్య రేఖ వెంబడి ఉన్న ఇండియా వంటి ఉష్ణమండల దేశాలకు చేరుతున్నాయని భారత్, దక్షిణ కొరియా పరిశోధకుల అధ్యయనం వెల్లడించింది. దీనివల్ల నైరుతి రుతుపవనాల్లో మార్పులు వచ్చి దక్షిణ, పశ్చిమ భారతాల్లో జూన్-సెప్టెంబరు ఖరీఫ్ కాలంలో వర్షపాతం తగ్గుతుందని అంచనా. ఇదే సమయంలో వాయవ్య భారతంలోని రాజస్థాన్, పంజాబ్‌బీ ఉత్తర భారతంలోని ఉత్తర్‌ప్రదేశ్, బిహార్ వంటి రాష్ట్రాల్లో వర్షపాతం పెరుగుతుందని శాస్త్రజ్ఞులు తెలిపారు. ఆర్కిటిక్‌లో మంచు కరుగుతున్నందున వాతావరణ ఎగువ పొరల్లో మార్పులు వచ్చి భారత్‌లో వర్షపాతాన్ని ప్రభావితం చేస్తున్నాయి. భూతాపం అరేబియా సముద్రాన్ని వేడెక్కించడంతో అక్కడి నుంచి వీచే తేమ గాలులు రాజస్థాన్, గుజరాత్ వంటి వాయవ్య భారత రాష్ట్రాల్లో వర్షపాతం పెరగడానికి కారణమవుతున్నాయి. మరోవైపు బంగాళాఖాతం వాయుగుండాలను పుట్టిస్తూ దక్షిణ భారతంలో భారీ వర్షాలను కురిపిస్తోంది.

ఆర్కిటిక్‌తోపాటు దక్షిణ ధ్రువంలోని అంటార్కిటికాలోనూ మంచు కరిగిపోతోంది. అంటార్కిటికాకూ ఈశాన్య భారతానికీ మధ్యనున్న సంబంధాన్ని భారతీయ పరిశోధకులు తాజాగా నిర్ధారించారు. 3.4 కోట్ల సంవత్సరాలకు ముందు అంటార్కిటికా ఏర్పడిందనీ, దానిపై పేరుకున్న మంచు క్రమంగా భూగోళంపై గాలుల చలనాన్నీ, తద్వారా రుతుపవనాలను శాసించసాగిందని వారు వివరించారు. ఇటీవల నాగాలాండ్‌లో కనుగొన్న శిలాజ పత్రాలతో ఈ విషయం వెలుగుచూసింది. అంటార్కిటికా ఏర్పడకముందు నాగాలాండ్‌లో మరింత వేడి వాతావరణం ఉండేది. అంటార్కిటికా ఏర్పడిన తరవాత అక్కడి మంచు ఈశాన్య రుతుపవనాలకు ఊపునిస్తోంది. కానీ, ఇప్పుడు అదారితప్పుతున్న రుతుపవనాలు ఈసారి నైరుతి రుతుపవనాలు కాస్త ముందే వచ్చినా, ఆ తరవాత వాటి కదలికలు కొంత కాలంపాటు మందగించాయి. ఇప్పుడు వర్ష రుతువు చివరి రోజుల్లోనూ వాయుగుండాలూ భారీ వర్షాలూ వచ్చిపడుతున్నాయి. హైదరాబాద్, ముంబయి, దిల్లీ వంటి మహానగరాలను కుండపోత వానలు ముంచెత్తడం చూస్తూనే ఉన్నాం. కర్బన ఉద్గారాల వల్ల భూఉష్ణోగ్రత పెరగడమే ఈ వాతావరణ మార్పులకు కారణం. దీనిపై చేపట్టిన అధ్యయనాలు ఎన్నో సంచలనాత్మక విషయాలను వెల్లడిస్తున్నాయి. భవిష్యత్తులో భారత్‌పై రుతుపవనాల ప్రభావంలో చాలా మార్పులు రానున్నాయి.

వేసవిలో భరత భూమి సహజంగానే వేడెక్కుతుంది. ఇటీవలి దశాబ్దాలలో వాతావరణ మార్పుల వల్ల హిమాలయాల్లోని మంచు వేగంగా కరగడం వేసవి ఉష్ణోగ్రతలను మరింత పెంచేస్తోంది. ఇలా వేడెక్కే భారతదేశానికి హిందూ మహాసముద్రం నుంచి వచ్చే చల్లని గాలులు నైరుతి రుతుపవనాలను తీసుకొస్తాయి. అయితే నేడు హిమాలయాలతోపాటు ఉత్తర, దక్షిణ ధ్రువాల్లోని మంచు కరిగిపోతూ భారతదేశ వర్షపాతాన్ని శాసించడం మొదలైంది.

**వర్షాలు వర్షించటంలో మార్పులు :** హిమాలయాల మాదిరిగానే ఆర్కిటిక్‌లోని మంచు విస్తీర్ణం కుదించుకుపోతున్నందున అక్కడి నుంచి చల్లని గాలులు భూమధ్య రేఖ వెంబడి ఉన్న ఇండియా వంటి ఉష్ణమండల దేశాలకు చేరుతున్నాయని భారత్, దక్షిణ కొరియా పరిశోధకుల అధ్యయనం వెల్లడించింది. దీనివల్ల నైరుతి రుతుపవనాల్లో మార్పులు వచ్చి దక్షిణ, పశ్చిమ భారతాల్లో జూన్-సెప్టెంబరు ఖరీఫ్ కాలంలో వర్షపాతం తగ్గుతుందని అంచనా. ఇదే సమయంలో వాయవ్య భారతంలోని రాజస్థాన్, పంజాబ్‌బీ ఉత్తర భారతంలోని ఉత్తర్‌ప్రదేశ్, బిహార్ వంటి రాష్ట్రాల్లో వర్షపాతం పెరుగుతుందని శాస్త్రజ్ఞులు తెలిపారు. ఆర్కిటిక్‌లో మంచు కరుగుతున్నందున వాతావరణ ఎగువ పొరల్లో మార్పులు వచ్చి భారత్‌లో వం-షపాతాన్ని ప్రభావితం చేస్తున్నాయి. భూతాపం అరేబియా సముద్రాన్ని వేడెక్కించడంతో అక్కడి నుంచి వీచే తేమ గాలులు రాజస్థాన్, గుజరాత్ వంటి వాయవ్య భారత రాష్ట్రాల్లో వర్షపాతం పెరగడానికి కారణమవుతున్నాయి. మరోవైపు బంగాళాఖాతం వాయుగుండాలను పుట్టిస్తూ దక్షిణ భారతంలో భారీ వర్షాలను కురిపిస్తోంది.

ఆర్కిటిక్‌తోపాటు దక్షిణ ధ్రువంలోని అంటార్కిటికాలోనూ మంచు కరిగిపోతోంది. అంటార్కిటికాకూ ఈశాన్య భారతానికీ మధ్యనున్న సంబంధాన్ని భారతీయ పరిశోధకులు తాజాగా నిర్ధారించారు. 3.4 కోట్ల సంవత్సరాలకు ముందు అంటార్కిటికా ఏర్పడిందనీ, దానిపై పేరుకున్న మంచు క్రమంగా భూగోళంపై గాలుల చలనాన్నీ, తద్వారా రుతుపవనాలను శాసించసాగిందని వారు వివరించారు. ఇటీవల నాగాలాండ్‌లో కనుగొన్న శిలాజ పత్రాలతో ఈ విషయం వెలుగుచూసింది. అంటార్కిటికా ఏర్పడకముందు నాగాలాండ్‌లో మరింత వేడి వాతావరణం ఉండేది. అంటార్కిటికా ఏర్పడిన తరవాత అక్కడి మంచు ఈశాన్య రుతుపవనాలకు ఊపునిస్తోంది. కానీ, ఇప్పుడు అంటార్కిటికా మంచు కరిగిపోతున్నందున రుతుపవనాల పుట్టుక, చలనాల్లో మార్పులు రావచ్చంటున్నారు పరిశోధకులు.

**తెలంగాణ, ఆంధ్రపై విశేష ప్రభావం :** భూతాపం వల్ల ఇప్పటికే రుతుపవనాలు తూర్పు భారతం నుంచి పశ్చిమ, వాయవ్య భారతాలవైపు కదులుతున్నాయి. అందుకే రాజస్థాన్, పంజాబ్, గుజరాత్ వంటి రాష్ట్రాల్లో వర్షపాతం 50శాతం పెరిగింది. ఈ శతాబ్దం చివరినాటికి అది 150-200శాతం వరకు పెరుగుతుందని శాస్త్రజ్ఞుల అంచనా. దీని ప్రభావం వల్ల ఇప్పటికే థార్ ఎడారి పూవై పూస్తోంది. 2001-23 మధ్యకాలంలో అక్కడ వర్షపాతం 45శాతం, భూగర్భ జలాలు 55శాతం పెరిగి పైర్లు పచ్చగా పెరుగుతున్నాయని ఐఐటీ-గాంధీనగర్ అధ్యయనం తేల్చింది. ఈ శతాబ్దం చివరికి థార్ ఎడారి కనుమరుగై పచ్చని అడవులు, పైరు పంటలు కళకళలాడుతూ దర్శనమిస్తాయని తెలిపింది. వర్షపాతం పెరగడంతో 1985-2020 మధ్య థార్‌లో వ్యవసాయం 300శాతం, పట్టణీకరణ 50-800 శాతం మేర విస్తరించాయి.

రుతుపవనాలు పశ్చిమ దిక్కుకు మారడం తెలుగు రాష్ట్రాల్లో పంటల గతిని ప్రభావితం చేస్తోంది. నైరుతి రుతుపవనాల సీజన్(జూన్-సెప్టెంబరు) ఆరంభ కాలంలో పశ్చిమ, వాయవ్య భారతాల్లో వర్షాలు దండిగా కురుస్తున్నాయి. కానీ ఆంధ్ర, తెలంగాణలలో వర్షాలు తగ్గిపోతున్నాయి! ఈశాన్య రుతుపవన సీజన్(అక్టోబరు-డిసెంబరు) మాత్రం కోస్తాంధ్ర, దక్షిణ తెలంగాణాలకు భారీ వర్షాలను తీసుకొస్తోంది. నైరుతి రుతుపవనాలు తక్కువ వర్షాలను కురిపించడం వల్ల మహబూబ్‌నగర్, నల్గొండ, గద్వాల జిల్లాల్లో వ్యవసాయంపై ప్రతికూల ప్రభావం పడుతోంది. ఈశాన్య రుతుపవనాల వల్ల తెలంగాణలో తరచూ 44శాతం అధిక వర్షపాతం నమోదవుతోంది. కానీ, ఖరీఫ్ సీజన్‌లో వర్షపాతం తక్కువై నాట్లూ కోతలూ ఆలస్యమై వ్యవసాయ దిగుబడులు తగ్గిపోతున్నాయి. రాయలసీమ జిల్లాల్లోనూ ఖరీఫ్‌లో వర్షాలు తక్కువగా కురుస్తున్నాయి. ఫలితంగా జూన్, జులైలో నాట్లు ఆలస్యమవుతున్నాయి.

**పునరుత్పాదక ఇంధనాలతో ఉపశమనం... :** నైరుతి రుతుపవనాల దిశ మారడం తెలుగు రాష్ట్రాల్లో ఖరీఫ్ పంటలను ప్రభావితం చేస్తోంది. అయితే, ఈ పడమటి చలనం బంగాళాఖాతంలో వాయుగుండాలు ఎక్కువగా ఏర్పడటానికి కారణమవుతోంది. దీనివల్ల ఈశాన్య రుతుపవనాలు బాగా బలం పుంజుకుంటున్నాయి. అందుకే కోస్తాంధ్రలో అక్టోబరు-డిసెంబరు కాలంలో 39శాతం ఎక్కువగా వర్షాలు కురుస్తున్నాయి. నైరుతి రుతుపవనాల తిరోగమనం ఆలస్యమవడం కూడా ఈశాన్య రుతుపవన కాలంలో ఎక్కువ వర్షాలకు ఊపునిస్తోంది. ఏతావాతా నైరుతి, ఈశాన్య రుతుపవనాల సయ్యాట థార్ ఎడారి మొదలుకుని దక్షిణ భారతం వరకు వ్యావసాయిక, సామాజిక, ఆర్థిక మార్పులకు దారితీస్తోంది. వాతావరణ మార్పులవల్ల రుతుపవన కాలంలో వర్షాలు దంచికొట్టినా వేసవిలో వేడి, ఉక్కపోత పెరిగిపోతున్నాయి. అనేక ప్రాంతాల్లో వానలు లేనప్పుడు భూగర్భ జలాలను అధికంగా తోడేస్తున్నారు. ప్రజలు ఏసీల మీద ఆధారపడటం ఎక్కువవుతోంది. ఇది విద్యుత్తు డిమాండును విపరీతంగా పెంచేస్తోంది. దాన్ని తీర్చడానికి బొగ్గు, చమురు వంటి శిలాజ ఇంధనాలతో విద్యుదుత్పాదన సాగిస్తే వాతావరణం మరింత వేడెక్కిపోతుంది. వాతావరణ మార్పుల నిరోధానికి తక్షణం పునరుత్పాదక ఇంధన వనరులకు మారాలి.

# మళ్లీ తెరపైకి ఎన్టీఆర్ బేబి కిట్ పథకం..!

- ప్రణాళిక రూపొందిస్తున్న సీఎం
- ఈసారి రూ.2వేల విలువైన వస్తువులు ఫ్రీ!
- బాలింతలకు లబ్ధి
- వైసిపి హయాంలో నిలిచిపోయిన పథకం
- రూ.51.14 కోట్ల నిధులు విడుదల

**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్) :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజల ఆదరణ పొందుతోంది అన్ని వర్గాల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్న ఏపీ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తూ ప్రజలకు ఆర్థిక భరోసాను అందిస్తుంది. వారి అభ్యున్నతికి దోహదం చేస్తుంది. ఇక ఇదే సమయంలో తాజాగా రాష్ట్రంలోని గర్భిణీ స్త్రీలకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కొత్త పథకాన్ని పెట్టేందుకు నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. ముఖ్యమంత్రి చంద్రబాబు అతి త్వరలో ఏపీలో ఎన్టీఆర్ బేబీ కిట్ పథకాన్ని ప్రవేశపెట్టనున్నారు.

బాలింతలకు లబ్ధి చేకూర్చడమే లక్ష్యంగా కీలక నిర్ణయం తీసుకున్న కూటమి ప్రభుత్వం మళ్లీ ఏపీలో ఎన్టీఆర్ బేబీ కిట్ పథకాన్ని అమలు చేయాలని భావిస్తుంది. ప్రభుత్వ ఆసుపత్రులలో ప్రసవమైన తల్లులకు ఎన్టీఆర్ బేబీ కిట్ ను



అందించాలని నిర్ణయించింది. 2014లో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఎన్టీఆర్ బేబీ కిట్ పథకాన్ని ప్రారంభించింది. అయితే గత వైసిపి పాలనలో ఈ పథకాన్ని వైసిపి ప్రభుత్వం నిలిపివేసింది.

**వైసీపీ హయాంలో నిలిచిన పథకం పునః ప్రారంభం :** మళ్లీ 2024 లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో నిలిచిపోయిన ఈ పథకాన్ని మళ్లీ ఇప్పుడు పునః ప్రారంభించాలని ఏపీ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఇటీవల ఈ పథకం కోసం రూ. 51.14 కోట్ల ను ప్రభుత్వం విడుదల చేసింది. ఈ పథకం ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ ఆసుపత్రులలో ప్రసవించిన తల్లులకు శిశు ఆరోగ్య సంరక్షణ కోసం కిట్లను అందిస్తారు.

**ఎన్టీఆర్ బేబీ కిట్ లో 13 వస్తువులు:** ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు ఆదేశాలతో గతంలో ఎన్టీఆర్ బేబీ కిట్ లో 11 వస్తువులు ఉండగా ఈసారి 13 వస్తువులను చేర్చారు. గతంలో కూటమి ప్రభుత్వం అందించిన బేబీ కిట్ లో 1410 రూపాయల విలువైన వస్తువులను అందజేసేవారు. అందులో దోమతెర, దుప్పటి, స్లీపింగ్ బెడ్, యాంటీ సెప్టిక్ లోషన్ తో పాటు, నాప్కిన్, డైపర్లు షాంపూ వంటి 11 రకాల సామాను ఉండేది.

**రెండు వేలకు చేరిన ఎన్టీఆర్ బేబీ కిట్ ధర :** ప్రస్తుతం వీటితో పాటు ఫోల్డబుల్ బెడ్, బ్యాగ్ కిట్ కు ప్రభుత్వం యాడ్ చేసింది. దీంతో ఎన్టీఆర్ బేబీ కిట్ లో 13 వస్తువులు చేరాయి. రెండు వస్తువుల అదనంగా చేర్చడంతో 450 భారం పెరిగింది మొత్తం ఈ కిట్ ధర 1954 రూపాయలు అవుతుంది. మొత్తం ప్రతి సంవత్సరం ఈ పథకం ద్వారా సుమారు 3.20 లక్షల మంది తల్లులకు ఎన్టీఆర్ బేబీ కిట్లను అందించాలని ప్రభుత్వం భావిస్తోంది.

**త్వరలోనే ఈ పథకం అమలు :** ఏపీ సీఎం చంద్రబాబు ఇటీవల ఈ కిట్లను పరిశీలించి కొత్త వస్తువులను చేర్చాలని ఆదేశాలు జారీ చేశారు. కొత్త వస్తువుల చేర్పు కారణంగా మళ్ళీ కొత్త టెండర్లు పిలవాలని అధికారులు నిర్ణయం తీసుకున్నారు. ప్రభుత్వ నిధులు అందిన వెంటనే కొత్త టెండర్లను పిలుస్తా.రు టెండర్లు ఖరారు అయిన తర్వాత ఎన్టీఆర్ బేబీ కిట్ ను ప్రభుత్వం అందించనుంది.

# వ్యాపార రంగంలో రాణించాలంటే నైతిక విలువలు అవసరం



**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్) :** విజ్ఞాన్ వర్సిటీలో ఘనంగా ప్రారంభమైన నేషనల్ సెమినార్ విద్య అనేది కేవలం జ్ఞాన సంపాదనకే పరిమితం కాకుండా, విలువల ఆధారంగా నాయకత్వాన్ని పెంపొందించుకోవాలని ఐసీఎస్ఎస్ఆర్–ఎస్ఆర్సీ హానరరీ డైరెక్టర్ ప్రొఫెసర్ బీ. సుధాకర్ రెడ్డి అన్నారు. చేబ్రోలు మండలం వడ్లమూడిలోని విజ్ఞాన్ యూనివర్సిటీలో, ఐసీఎస్ఎస్ఆర్–ఎస్ఆర్సీ ఆర్థిక సౌజన్యంతో స్కూల్ ఆఫ్ లా అండ్ మేనేజ్మెంట్ స్టడీస్ పరిధిలోని డిపార్ట్మెంట్ ఆఫ్ మేనేజ్మెంట్ స్టడీస్ ఆధ్వర్యంలో "కల్టివేటింగ్ ఎథికల్ బిజినెస్ లీడర్స్" అనే అంశంపై రెండు రోజుల పాటు నిర్వహించనున్న జాతీయ సదస్సును శుక్రవారం ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని "ఎంబెడింగ్ ది సినర్జిటిక్ విజన్ ఆఫ్ ఎస్డీజీఎస్ అండ్ ఇండియన్ నాలెడ్జ్ సిస్టమ్స్ ఇన్ మేనేజ్మెంట్ ఎడ్యుకేషన్ అలైన్డ్ విత్ ఎన్ఈపీ 2020" అనే ఇతివృత్తంతో నిర్వహిస్తున్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రొఫెసర్ బీ. సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ నేటి యువత వ్యాపార రంగంలోకి అడుగుపెడుతున్నప్పుడు సామాజిక బాధ్యతతో కూడిన నైతిక విలువలే వారికి మార్గదర్శకాలు కావాలని సూచించారు. ఆధునిక మేనేజ్మెంట్ విద్యలో భారతీయ విలువలు, సాంప్రదాయ జ్ఞానం, నైతిక దృక్పథం, సుస్థిరతలను సమన్వయ పరచాల్సిన అవసరాన్ని వివరించారు. భారతీయ జ్ఞాన వ్యవస్థల ఆధారంగా మేనేజ్మెంట్ విద్యలో కొత్త దిశను సృష్టించే ప్రయత్నం జరుగుతోందని, దీని ద్వారా విద్యార్థుల్లో నైతిక వ్యాపార దృక్పథం, సామాజిక బాధ్యత, సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై అవగాహన పెరుగుతుందని తెలిపారు.

కార్యక్రమంలో ఉస్మానియా యూనివర్సిటీ మాజీ డీన్ ప్రొఫెసర్ ఏ. సూర్యనారాయణ మాట్లాడుతూ ఆధునిక సంస్థల్లో ఎదురయ్యే నైతిక సమస్యలను ఆచరణాత్మక కోణంలో విశ్లేషించారు. పుదుచ్చేరి యూనివర్సిటీ మేనేజ్మెంట్ స్కూల్కు చెందిన ప్రొఫెసర్ యార్లగడ్డ శ్రీనివాసులు భారతీయ తత్వశాస్త్ర సంప్రదాయాల ప్రాధాన్యతను నైతిక నాయకత్వ అభివృద్ధితో అనుసంధానించి వివరించారు.

ఐఐటీ హైదరాబాద్ మేనేజ్మెంట్ విభాగాధిపతి డాక్టర్ ఎం. పి. గణేష్ ఆధునిక అభివృద్ధి తత్త్వాలతో పాటు ప్రాచీన భారతీయ జ్ఞానాన్ని సమన్వయం చేయడం ఎంత అవసరమో వివరించారు. భారతీయ జ్ఞాన సంప్రదాయాల శాశ్వత విలువలను నేటి గ్లోబలైజ్డ్ వ్యాపార ప్రపంచానికి అన్వయించాల్సిన అవసరాన్ని స్పష్టం చేశారు.

కార్యక్రమానికి దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వందకుపైగా ప్రతినిధులు హాజరై తమ పరిశోధన పత్రాలను సమర్పించగా, అనేక ఇంటరాక్టివ్ సెషన్లు నిర్వహించబడ్డాయి. ఈ సదస్సు మేనేజ్మెంట్ విద్యార్థులకు మాత్రమే కాకుండా పరిశ్రమ నిపుణులు, యువ పరిశోధకులు, సమాజానికి కూడా మేలుచేసే విలువైన వేదికగా నిలిచింది. కార్యక్రమంలో విజ్ఞాన్ వర్సిటీ వైస్ చాన్సలర్ కల్నల్, ప్రొఫెసర్ పీ. నాగభూషణ్, రిజిస్ట్రార్ డాక్టర్ పీఎంవీ రావు, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఆహార సరఫరా పక్కాగా ఉండాలి

**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్) :** పాఠశాలలు, వసతి గృహాలు, అంగన్వాడీ కేంద్రాలలో పంపిణీ చేసే ఆహారం పక్కాగా ఉండాలని జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా అన్నారు. పి.యం.పోషన్ – డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజనం కార్యక్రమంపై జిల్లా సమన్వయ కమిటీ సమావేశం శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఆహార నాణ్యతలో ఎటువంటి లోపాలు ఉండరాదని చెప్పారు. వంట సామగ్రి భద్రపరచడం నుండే సరైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎలుకలు, కీటకాలు వంటివి ఆహార పదార్థాలుపై ప్రాకకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు ఉండాలని ఆదేశించారు. శుభ్రమైన నీటిని ఉపయోగించాలని, నీటిని పశువులు, ఇతర జంతువులు తాగకుండా చర్యలు తీసుకోవాలని, దుమ్ము ధూళి పడకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వంట ఏజెన్సీలు, వంట వారు ఆహార పదార్థాలు తయారీ సమయంలో పూర్తి అప్రమత్తంగా ఉండాలని అన్నారు. ఆహార పదార్థాలు, తాగునీటి వలన అటువంటి సమస్యలు ఎక్కడా ఉత్పన్నం కారాదని స్పష్టం చేశారు. నిర్లక్ష్యం వహించే వారిపై కఠిన చర్యలు ఉంటాయని అన్నారు. మధ్యాహ్న భోజన పథకం, సంక్షేమ శాఖల అధికారులు, అంగన్వాడీ పర్యవేక్షకులు పూర్తి అప్రమత్తంగా ఉండాలని చెప్పారు.

జిల్లా విద్యా శాఖ అధికారి రేణుక పి. యం. పోషన్ – డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజనం కార్యక్రమం వివరాలను తెలిపారు. కార్యక్రమంపై జిల్లాలో నెలకు రూ. 3. 32 కోట్లు ఖర్చు చేయడం జరుగుతుందని చెప్పారు.

ఈ సమావేశంలో జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి వి. జ్యోతి బసు, ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ పి ప్రసూన, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కె విజయ లక్ష్మి, డి. ఆర్. డి. ఏ ప్రాజెక్టు డైరెక్టర్ టి. విజయ లక్ష్మి, జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి యు. చెన్నయ్య, పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ కె. తులసి, జిల్లా బిసి సంక్షేమ శాఖ అధికారి మయూరి, జిల్లా ఇంటర్మీడియట్ విద్యా శాఖ అధికారి జె. పద్మ, ప్రాంతీయ పర్యవేక్షక అధికారి జి. సునీత తదితరులు పాల్గొన్నారు.

# ప్రతినెల వర్కర్స్ గ్రీవెన్స్ నిర్వహణ



**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్) :** నగర పాలక సంస్థలో విధులు నిర్వహించే కార్మికులు , ఉద్యోగుల సమస్యల పరిష్కారానికే ప్రత్యేకంగా గ్రీవెన్స్ నిర్వహిస్తున్నామని, కార్మికులు , ఉద్యోగులు తమ సమస్యలపై నేరుగా తమకు అర్జీలు, ఫిర్యాదులు అందించవచ్చని నగర పాలక సంస్థ అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు తెలిపారు. శుక్రవారం నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశాల మేరకు నగర పాలక సంస్థ కార్మికులు, ఉద్యోగులు సమస్యల పరిష్కారం కొరకు వర్కర్స్ గ్రీవెన్స్ ని కమిషనర్ ఛాంబర్ లో అదనపు కమిషనర్ నిర్వహించారు.

ఈ సందర్భంగా అదనపు కమిషనర్ మాట్లాడుతూ విభాగాల వారీగా కార్మికులు, ఉద్యోగుల సమస్యల పరిష్కారంకు ప్రతి నెల వర్కర్స్ గ్రీవెన్స్ నిర్వహిస్తామని, గ్రీవెన్స్ లో అందే ఆర్జీలను, ఫిర్యాదుల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి సారించాలని విభాగాదిపతులకు స్పష్టం చేశారు. కార్మికులు కూడా తమకు అందే జీతాలు, ఇతర అలవెన్స్ ల సమస్యలపై గ్రీవెన్స్ లో నేరుగా తమ దృష్టికి తేవాలన్నారు.

కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ సిహెచ్. శ్రీనివాస్, ఎంహెచ్ఓ డాక్టర్ లక్ష్మీనారాయణ, ఈఈ కోటేశ్వరరావు, మేనేజర్ బాలాజీ బాషా, విభాగ సూపరింటెంట్లు, కార్మిక సంఘాల నాయకులు మధుబాబు, మాల్యాద్రి, ముత్యాలరావు, శంకర్రావు, రవికుమార్ లు పాల్గొన్నారు.

# పురపాలక పాఠశాలలకు జోస్ అలూక్కాస్ మౌలిక అభివృద్ధి సేవలు ముదావహం

**తెనాలి(జర్నలిస్ట్ ఫైల్):** పురపాలక సంఘ పరిదిలోని పాఠశాలల మౌలిక సదుపాయాల మెరుగుదలకు జోస్ అలుక్కాస్ సంస్థ పెద్ద మనసుతొ అందించే ప్రోత్సాహం స్ఫూర్తిదాయకమని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ జోస్ అలుక్కాస్ నిర్వాహకులను ప్రశంశించారు. స్థానిక కొత్తపేటలోని రావిసాంబయ్య బాలుర ఉన్నత పాఠశాలలో, శుక్రవారం జోస్ అలుక్కాస్ కంపెనీ ప్రతినిదుల ద్వారా పాఠశాలలో, విద్యార్థులు, ఉపాద్యాయుల, మౌలిక అవసరాల వస్తువులు అందజేసె కార్యక్రమంలొ, భాగంగా ఏర్పాటు చేసిన సభలొ, మంత్రి నాదెండ్ల మనోహర్ ముఖ్య అతిధిగా పాల్గొని మాట్లాడుతు పాఠశాలల్లో మౌలిక అవసరాలను గుర్తించి, అందిస్తున్న తోడ్పాటును విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. జోస్ అలుక్కాస్ సంస్థ, పట్టణంలోని




పురపాలక సంఘ పాఠశాలలకు మౌలిక వసతులు కల్పన దిశగా అందించే సేవలు స్ఫూర్తి దాయకమన్నారు. పట్టణంలోని అన్ని పాఠశాలల విద్యార్థులకు ఐడి కార్డులు ఏర్పాటుకు తగు చర్యలు తీసుకోవాలని, మున్సిపల్ కమిషనర్ అప్పలనాయుడుకు సూచించారు. కాగా పట్టణంలోని ఆరు పురపాలక సంఘ పాఠశాలలకు, 11 లక్షల 69 వేల 650 రూపాయల విలువైన మౌలిక వసతుల సామాగ్రిని అందజేశారు. ఈ కార్యక్రమానికి స్కూల్ హెచ్ఎమ్ భారతిస్వాగతం పలుకగా, మున్సిపల్ కమిషనర్ రామ అప్పలనాయుడు, ఎంఈఓ మేకల లక్ష్మీనారాయణ, ఎమ్ఇఒ, టు, జయంత్ బాబు, తహసిల్దార్ కేవీ గోపాలకృష్ణ, జోస్ అలుకాస్ మేనేజర్ వినోద్, పిఆర్ఒ బాబు, స్కూలు ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు, జనసేన పార్టీ నాయకులు పాల్గొన్నారు. తొలుత ఎన్ సిసి క్యాడెట్స్ అతిధులకు స్వాగతం పలికారు.

# డిజిటల్ టెక్నాలజీతో స్వయం ఉపాధి



**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్) :** ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం. ఆధునిక సాంకేతిక నైపుణ్యం పెరిగిన నేటి సమాజంలో డిజిటల్ టెక్నాలజీతో స్వయం ఉపాధిని అభివృద్ధి చేసుకోగలమని ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ డాక్టర్ ఎం. ఎస్. చైతన్య కుమారి తెలిపారు. శుక్రవారం మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో జనచైతన్య వేదిక హాలులో జరిగిన "మహిళా నైపుణ్య అభివృద్ధి శిక్షణ" కార్యక్రమానికి మానవత సెక్రెటరీ కే సతీష్ అధ్యక్షత వహించారు. ప్రొఫెసర్ ఎమ్. ఎస్. చైతన్య కుమారి ప్రసంగిస్తూ టెక్నాలజీ సద్వినియోగం చేసుకోవడం ద్వారా మహిళలు స్వయం ఉపాధి రంగంలో అద్భుతమైన అభివృద్ధి సాధించగలరని వివరించారు.

పి. నాగ సుశీల, వైస్ చైర్మన్, మహిళా సాధికారత విభాగం, జెకెసి కళాశాల, సోక్రటీస్ చెప్పిన విజయ రహస్యం ఉదాహరిస్తూ మనిషి యొక్క శక్తి ఆత్మవిశ్వాసం విజయానికి నాంది అని కవిత ద్వారా వివరించారు.

బి. రాధిక, మేనేజర్, ఏపీ యూత్ సర్వీసెస్ ప్రసంగిస్తూ మహిళలు ఆర్డినరీ నుండి ఎక్స్ట్రాడినరీగా మారడానికి క్రమశిక్షణతో కృషి చేయాలని సూచించారు.

ప్రముఖ బ్యూటీషన్ , ట్రైనర్ పి. స్వప్న పాల్గొన్న 60 మంది మహిళలకు బ్యూటీషన్ కోర్సులో భాగంగా శారీ డ్రాపింగ్ మరియు లేటెస్ట్ హెయిర్ స్టైల్స్ పై ప్రాక్టికల్ శిక్షణ ఇచ్చారు. మహిళల చేత ప్రాక్టికల్ గా చేయించి నేర్పించారు. శిక్షణ పూర్తి చేసిన మహిళలందరికీ సర్టిఫికెట్లు ప్రధానం చేశారు. అతిధులను ఘనంగా శాలువాలతో సన్మానించారు. డైరెక్టర్లు చావా లక్ష్మి సామ్రాజ్యం, ఉప్పల సాంబశివరావు, వైస్ ప్రెసిడెంట్ డా॥ కల్పన, మహిళా విభాగం చైర్మన్ విమల కుమారి, జాయింట్ సెక్రెటరీ ఆనంద్, ఎగ్జిక్యూటివ్ మెంబర్స్ మాధవ్, పావని, పింగళి భాగ్యలక్ష్మి, మేనేజర్ రాధాకృష్ణ, శివాజీ, చావా శివాజీ తదితరులు సమన్వయం చేశారు.

# రక్త హీనత చిన్నారులపై దృష్టి సారించాలి

**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్) :** జిల్లాలో రక్త హీనత చిన్నారులు, గర్భిణీలు, బాలింతలపై దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా అన్నారు. జిల్లా సమన్వయ కమిటీ సమావేశం శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ముఖ్యంగా చిన్నారులు, గర్భిణీలు, బాలింతలలో రక్త హీనత ఉండరాదన్నారు. రక్త హీనత గల వారిని గుర్తించాలని ఆదేశించారు. గ్రామ సచియాలయం స్థాయిలో కమిటీలు ఏర్పాటు చేయాలని, రక్త హీనత గల వారిని పర్యవేక్షణ చేయాలని సూచించారు. రక్త హీనత గల చిన్నారులు, గర్భిణీలు, బాలింతల జాబితా పక్కాగా తయారు చేయాలని చెప్పారు. రక్త హీనత ఉన్నవారికి పౌష్టిక ఆహారం అందాలని అన్నారు. పోషక ఆహారం అందిస్తున్నప్పటికీ రక్త హీనత ఉండటానికి గల కారణాలు విశ్లేషించాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. ఆరోగ్య అలవాట్లు పట్ల అవగాహన కల్పించాలని సూచించారు. ప్రతి వారం పరిశీలన చేసి రక్త హీనత మెరుగుదల గమనించాలని, వాటిని రికార్డుల్లో నమోదు చేయాలని అన్నారు. ప్రతి ఒక్కరి డేటా ఉండాలని చెప్పారు. గ్రామ, మండల స్థాయిలో కూడా కమిటీలు నియమించి పర్యవేక్షణ చేయాలని అన్నారు. ఏ ప్రాంతంలో ఎక్కువ స్థాయిలో రక్త హీనత ఉందో అధ్యయనం చేయాలని, అంగన్వాడీ కేంద్రాలు ద్వారా పౌష్టిక ఆహారాన్ని పక్కాగా పంపిణీ చేయడం జరగాలని ఆదేశించారు. వారికి అందించిన ఆహారం వారే తీసుకునే విధంగా



పర్యవేక్షణ ఉండాల్సిన అవసరాన్ని పేర్కొన్నారు. అంగన్వాడీ కేంద్రాల్లో ఐదు సంవత్సరాల లోపు వయస్సు చిన్నారులు ఉండాలని, వారిలో వయస్సుకు తగిన ఎత్తు, బరువు, మానసిక ఎదుగుదల వంటి అంశాలను గమనించాలని ఆదేశించారు.

**బాల్య వివాహాలు అరికట్టాలి**

బాల్య వివాహాలు జిల్లాలో అరికట్టాల్సిన అవసరం ఉందని జిల్లా కలెక్టర్ అన్నారు. బాల్య వివాహాల పరిస్థితి ఏ గ్రామాల్లో ఉన్నాయో గుర్తించాలని సూచించారు. ఆయా గ్రామాల్లో కమిటీ సభ్యులు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. బాల్య వివాహాలు వలన బాలిక ఆరోగ్యంతో పాటు పుట్టే బిడ్డ ఆరోగ్యం పైనా ప్రభావం ఉంటుందని అన్నారు. విద్యా సంస్థలలో చదువుతున్న బాలికల పట్ల కూడా పర్యవేక్షణ ఉండాలని పేర్కొన్నారు. విద్యా సంస్థలలో బాలికలకు ఆరోగ్యం, ఉన్నత విద్య, ఉద్యోగ అవకాశాలు వంటి అంశాలపై కౌన్సిలింగ్ ఇవ్వాలని తద్వారా ఆలోచనా విధానం మారుతుందని చెప్పారు. పోక్సో కేసులు నిర్దేశిత కాలంలో పరిష్కారం కావాలని పేర్కొన్నారు.

ఈ సమావేశంలో జిల్లా మహిళ శిశు సంక్షేమ అధికారి ప్రసూన, అదనపు పోలీసు సూపరింటెండెంట్ రమణ మూర్తి, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి వి. జ్యోతి బసు, జిల్లా పంచాయతీ అధికారి బి. వి. నాగ సాయి కుమార్, దివ్యాంగుల శాఖ సహాయ సంచాలకులు డి. దుర్గా భాయి, జిల్లా విద్యా శాఖ అధికారి రేణుక, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# కోటి సంతకాల సేకరణ కార్యక్రమం



గుంటూరు రూరల్, (జర్నలిస్ట్ ఫైల్): గుంటూరు రూరల్ మండల పరిధిలోని జొన్నలగడ్డ గ్రామంలో ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటికరణ కు వ్యతిరేకంగా కోటి సంతకాల కార్యక్రమం ను వైఎస్ఆర్సీపీ ప్రత్తిపాడు నియోజకవర్గ ఇన్చార్జి బలసాని. కిరణ్ కుమార్ నేతృత్వంలో కార్యక్రమం ను నిర్వహించారు. ఈ కార్యక్రమం లో షేక్ గులాం రసూల్ తదితరులు పాల్గొన్నారు.

# యూఎస్ డైవర్సిటీ వీసా లాటరీలో2028 వరకు భారతీయులకు నోఛాన్స్

**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్) :** ట్రంప్ రెండోసారి అధికారంలోకి వచ్చినప్పటినుంచి అమెరికా వీసా నిబంధనలను మరింత కఠినతరం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో భారతీయులకు మరో ఎదురుదెబ్బ తగిలింది. యూఎస్ డైవర్సిటీ వీసా లాటరీలో పాల్గొనేందుకు భారతీయులకు 2028 వరకు అవకాశం లభించదని సంబంధిత వర్గాలు పేర్కొంటున్నాయి. గ్రీన్ కార్డ్ లాటరీ కార్యక్రమంలో గత ఐదేళ్లలో అమెరికాకు తక్కువ వలసలు ఉన్న దేశాల దరఖాస్తుదారులను ఎంచుకుంటున్నట్లు తెలిపాయి. ఏటా 50 వేల మంది లోపు అమెరికాకు వలసవచ్చే దేశాలకే అవకాశం ఇస్తున్నట్లు సమాచారం. అమెరికాలో అన్ని దేశాలకు చెందిన వలసదారులకు అవకాశం ఇవ్వాలనే లక్ష్యంతో ఇలాంటి చర్యలు తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. వీసా లాటరీలో పాల్గొనడానికి అనుమతి ఉన్న దేశాలకు తాజా వీసా కేటాయింపులను ప్రకటించారు.

గత కొన్నేళ్లుగా భారత్ నుంచి అమెరికాకు అధికంగా వలసలు ఉండడంతో భారతీయులకు ఈ వీసా కార్యక్రమానికి కావాల్సిన అర్హత పరిమితి మించిపోయిందని.. అందువల్లే ఈ లాటరీ లో పాల్గొనడానికి వారికి అవకాశం ఇవ్వట్లేదని సంబంధిత అధికారులు పేర్కొన్నారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. 2021లో, 93,450 మంది భారతీయులు అమెరికాకు వలస రాగా.. 2022లో ఈ సంఖ్య 1,27,010గా ఉంది. ఇది అమెరికాకు వస్తున్న దక్షిణ అమెరికన్ (99,030), ఆఫ్రికన్ (89,570), యూరోపియన్ (75,610) వలసదారుల సంఖ్య కంటే ఎక్కువ. 2023లో 78,070 మంది భారతీయులు అమెరికాకు వలస వచ్చారు. ఈ రికార్డుల ఆధారంగా 2028 వరకు భారతీయులను యూఎస్ డైవర్సిటీ వీసా లాటరీలకు అనర్హులుగా నిర్ణయించినట్లు తెలిపింది.




ఇప్పటికే ఇమిగ్రేషన్ విధానంలో అమెరికా తీసుకుంటున్న కఠిన చర్యలతో సమస్యలు ఎదుర్కొంటున్న భారతీయులకు ఇది మరో ఎదురుదెబ్బగా మారింది. ఈ లాటరీకి 2026 వరకు అర్హత సాధించని ఇతర దేశాల్లో చైనా, దక్షిణ కొరియా, కెనడా, పాకిస్థాన్ ఉన్నాయి.

**వలసదారుల పెరోల్ ఫీజు 1,000 డాలర్లు..**

పెరోల్ ఫీజు పై అమెరికా సిటిజన్ షిప్ అండ్ ఇమిగ్రేషన్ సర్వీస్ తాజాగా నోటిఫికేషన్ జారీ చేసింది. అందులో కొన్నిరకాల వలసదారులకు అవసరమయ్యే పెరోల్ ఫీజును 1,000 డాలర్లకు పెంచుతున్నట్లు ప్రకటించింది. వీసా లేదా ఇతర అధికారిక పత్రాలు లేకుండా అమెరికా లో ప్రవేశించడానికి, ఉండటానికి పెరోల్ అనేది తాత్కాలిక అనుమతి. కొన్ని అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే దీనిపై విదేశీయులను అమెరికాలోకి అనుమతిస్తారు.

ఇటీవల ట్రంప్ ప్రవేశపెట్టిన బిగ్ బ్యూటిఫుల్ బిల్లులో ఈ పెరోల్ ఫీజును తప్పనిసరి చేశారు. ప్రస్తుతం దీని ఆధారంగా అమెరికాలోకి ప్రవేశించాలంటే విదేశీయులు 1,000 డాలర్ల పెరోల్ రుసుమును చెల్లించాలి. వీటిలో ప్రారంభ పెరోల్, రీ–పెరోల్, పెరోల్ ఇన్ ప్లేస్ లేదా డీహెచ్ఎస్ కస్టడీ నుంచి పెరోల్ వంటివి ఉంటాయి. ఈ రుసుము ఇప్పటికే ఉన్న ఏదైనా ఇతర ఇమిగ్రేషన్ సర్వీస్ ఫైలింగ్ లేదా బయోమెట్రిక్ రుసుముకు అదనంగా చెల్లించాల్సి ఉంటుంది. ఇమిగ్రేషన్ అధికారులు సూచించిన సమయం లోపు ఈ రుసుమును చెల్లిస్తేనే పెరోల్ పొందడానికి అనుమతినిస్తారు

# కాంగ్రెస్ అభ్యర్థి గెలుపుతోనే అభివృద్ధి సాధ్యం

## పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్



పార్టీలో చేరిన ఆదిలక్ష్మికి కండువా కప్పిన మీనాక్షి నటరాజన్, చిత్రంలో నవీన్‌యాదవ్, మహేష్‌గౌడ్, తుమ్మల నాగేశ్వర్‌రావు, అనీల్‌కుమార్ యాదవ్

**హైదరాబాద్ (జూబ్లీహిల్స్), అక్టోబరు 17 (జర్నలిస్ట్‌ఫైల్):** కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గెలుపుతోనే జూబ్లీహిల్స్ నియోజకవర్గ అభివృద్ధి సాధ్యమవుతుందని పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్ అన్నారు. సోమాజీగూడ డివిజన్‌లోని శాలివాహననగర్‌లో గురువారం నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ బూత్ స్థాయి సమా వేశంలో ఆమె ముఖ్యఅతిధిగా పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ.. బీహార్ ఎన్నికలతోపాటు జూబ్లీ హిల్స్ నియోజకవర్గంలో జరుగుతున్న ఉప ఎన్ని కల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపు ఖాయ మన్నారు. వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని, రాహుల్‌గాంధీని ప్రధానిని చేయడమే తమ లక్ష్యమని అన్నారు. బూత్ స్థాయిలో ప్రతి నాయకుడు, కార్యకర్త కష్టపడి పనిచేయాలని, బూత్‌స్థాయిలో నమో దయ్యే ఓట్లను గుర్తిస్తామని ఆయా నాయకులకు తగిన గౌరవం కల్పిస్తామన్నారు. టీపీసీసీ ఛీఫ్ మహేష్ కుమార్‌గౌడ్ మాట్లాడుతూ బీఆర్ఎస్ శకం ముగిసిందన్నారు. జూబ్లీహిల్స్ సీటు కాంగ్రెస్ ఖాతాలో పడటం ఖాయమన్నారు. ప్రజాభిప్రాయం మేరకు నవీన్‌యాదవ్‌ను ఎంపిక చేశామన్నారు. బీఆర్ఎస్ పార్టీ పదేళ్ల విధ్వంసాన్ని ఎవరూ మరిచిపోరని అన్నారు. రాష్ట్రాన్ని మాదకద్రవ్యాల మయంగా చేశారని, జూబ్లీహిల్స్ ఇందుకు అడ్డాగా నిలిచిందని అన్నారు. అనంతరం యూసుఫ్‌గూడలోని మహమూద్ ఫంక్షన్ హాల్‌లో, షేక్‌పేటలోని ఎస్సార్ కన్వెన్షన్ హాల్‌లో బూత్‌స్థాయి సమావేశాలు నిర్వహించారు.

ఈ సందర్భంగా అభ్యర్థి నవీన్‌యాదవ్ మాట్లాడుతూ.. అభివృద్ధి అంశంతోనే తాను ముందుకెళ్తున్నానని, ప్రజలు చేయి గుర్తుకు ఓటువేసి అభివృద్ధిని కొనసాగించేందుకు మద్దతునివ్వాలని కోరారు. కార్యక్రమంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, వివేక్ వెంకటస్వామి, తుమ్మల నాగేశ్వర్‌రావుతోపాటు ఎంపీ అనీల్‌కుమార్ యాదవ్, కాంగ్రెస్ నేతలు అజారుద్దీన్, కార్పొరేటర్ విజయారెడ్డి తదితరులు పాల్గొన్నా రు. కార్యక్రమంలో భాగంగా బీఆర్ఎస్ పార్టీకి చెందిన ఆదిలక్ష్మి, అనిత, జలజ, రేణుక, తేజ కుమారి తదితరులు మీనాక్షి నటరాజన్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు.

# పేదల గురించి ఆలోచించే పార్టీ కాంగ్రెస్

## పిసిసి చీఫ్ మహేష్‌గౌడ్

**హైదరాబాద్ (యూసుఫ్‌గూడ), అక్టోబరు 17 (జర్నలిస్ట్‌ఫైల్):** పేదల గురించి అహర్నిశలు ఆలోచించే పార్టీ కాంగ్రెస్ పార్టీ అని టీపీసీసీ అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్ అన్నారు. గురువారం రహమత్‌నగర్ బూతుస్థాయి సన్నాహక సమావేశంలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ బీఆర్ఎస్ శకం ముగిసిందని జూబ్లీహిల్స్ సీటు కాంగ్రెస్ ఖాతాలో పడటం కాయమని తెలిపారు. ప్రజాభిప్రాయం మేరకే ఉప ఎన్నిక అభ్యర్థిగా నవీన్ యాదవ్‌ను ఎంపిక చేశామని తెలిపారు. కేటీఆర్ పదేళ్ల విధ్వంస పాలనను ప్రజలు మర్చిపోలేదని అన్నారు. 40 లక్షల రేషన్ కార్డులు, సన్న బియ్యం అందివ్వడం జరిగిందని ప్రజల కష్టకాలంలో తోడుగా ఉండే నాయకుడు కావాలని నవీన్ యాదవ్‌ను ప్రకటించడం జరిగిందన్నారు. రాష్ట్రంలో బీఆర్ ఎస్ పని అయిపోయిందని ప్రజ లకు కావల్సింది సెంటిమెంట్ కాదు అభివృద్ధి అని అన్నారు.



బూత్ స్థాయి సన్నాహక సమావేశంలో పాల్గొన్న పిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్, మంత్రులు పొన్నం ప్రభాకర్, వివేక్ వెంకటస్వామి, అభ్యర్థి నవీన్‌యాదవ్.



బోరబండ సారథి కోఆపరేటివ్ సొసైటీలో బిజెపి కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

# ఎంఐఎం కబంధహస్తాల నుంచి హైదరాబాద్‌ను రక్షించుకోవాలి: కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

**హైదరాబాద్ (యూసుఫ్‌గూడ), అక్టోబరు 17 (జర్నలిస్ట్‌ఫైల్):** మజ్లీస్ పార్టీ కబంధహస్తాల నుండి హైదరాబాద్‌ను రక్షించుకోవాలని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. గురువారం సారథినగర్‌లో ఎర్రగడ్డ, బోరబండ బీజేపీ బూత్ అధ్యక్షులు, కార్యకర్తల సమావేశంలో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి జూబ్లీహిల్స్ పార్టీ అభ్యర్థి లంకల దీపక్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ ఎన్నికలు రాష్ట్ర రాజకీయాల్లో మార్పును తెచ్చే ఎన్నికలవుతాయన్నారు. పదేళ్ల పాలించిన బిఆర్ఎస్, పదేళ్లకుపైగా కాంగ్రెస్ పార్టీ ఈ నియోజకవర్గానికి చేసింది ఏమీలేదని పేర్కొన్నారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ జూబ్లీహిల్స్ నియోజకవర్గాన్ని ఏమాత్రం పట్టించుకోవడం లేదన్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ రాష్ట్రాన్ని పాలించడం లేదని మజ్లీస్ పార్టీ పాలిస్తున్నదన్నారు. పాతబస్తీలో మజ్లీస్ గూండాల కారణంగా చాలా ఇళ్లు ఖాళీచేసి వెళ్లిపోయారని తెలిపారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని నిర్ణయించింది గాంధీభవనో, రాహుల్‌గాంధో కాదని మజ్లీస్ పార్టీ అసదుద్దీన్ ఓవైసీ నిర్ణయించారన్నారు. నాడు కేసీఆర్ పాలనలో మజ్లీస్ పార్టీని బుజాలమీద మోశారని ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ కూడా అదే చేస్తుందన్నారు.

ఈ మూడు పార్టీలు ఒకటేనని వీరం దరూ కలిసి బీజేపీ పార్టీని అడ్డుకోవాలని చూస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యా రంటీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. ఓట్ల కోసం వచ్చే నాయకులను నిరుద్యోగ యువకులు మహిళలు నిలదీయాలని సూచించారు. బీఆర్ ఎస్‌కు, కాంగ్రెస్ పార్టీకి ఓటు వేస్తే అది మజ్లీస్ పార్టీకి వేసినట్లే అన్నారు. బిఆర్ఎస్‌కు తెలం గాణలో భవిష్యత్ లేదని తెలిపారు. బీజేపీ అభ్యర్థి దీపక్ రెడ్డి ప్రజల మధ్యలో ఉండే నాయకుడని ఆయన కోసం కష్టపడి ఇష్టపడి పని చేయాలని తెలిపారు. తాను కూడా పూర్తి సమయాన్ని ఇక్కడే కేటాయిస్తానని ఎన్ని తప్పుడు ప్రచారాలు చేసిన ఇక్కడ న్యాయమే గెలుస్తుందన్నారు.

# రూ.290 కోట్ల ఆర్థిక సాయం ఎప్పుడు?

## పరిహారం కోసం రైతుల ఎదురుచూపులు

## దిక్కులేని రూ.10 వేల సర్కార్ ప్రకటన

## వర్షాలతో దెబ్బతిన్న 3 లక్షల ఎకరాలు

**హైదరాబాద్, అక్టోబరు 17(జర్నలిస్ట్‌ఫైల్):** రాష్ట్రంలో ఇటీవల కాలంలో కురిసిన భారీ వర్షాలతో పంట నష్టపోయిన రైతాంగం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రకటించిన సాయం కోసం కళ్లు కాయలు కాచేలా ఎదురు చూస్తున్నారు. ఈ ఏడాది ఏప్రిల్, మే, సెప్టెంబరు నెలల్లో కురిసిన భారీ వర్షాలకు రాష్ట్రంలోని వివిధ 3 లక్షల ఎకరాల్లో వరి, పత్తి, మొక్కజొన్న, సోయాబిన్ తదితర పంటలకు భారీగా నష్టం వాటిల్లింది. కొన్నిచోట్ల పంటలు వరదల్లో కొట్టుకుపోగా, మరికొన్ని చోట్ల నీట మునిగాయి. అంతేకాకుండా పంట పొలాల్లో భారీగా ఇసుక మేటలు వేశాయి. ఈ విధంగా మూడు సార్లు దెబ్బతిన్న పంటలకు గాను నష్ట పరిహారం కింద ఎకరానికి రూ.10 వేలు చొప్పున ఆర్థిక సహాయం అందిస్తామని ప్రభుత్వం ప్రకటించి నెలలు తరబడి అవుతున్నా బాధిత రైతాంగానికి ఇంత వరకూ అది కార్యరూపం దాల్చలేదు. అలాగే ఇటీవలే రాష్ట్రానికి వచ్చిన కేంద్ర బృందం పంట దెబ్బతిన్న ప్రాంతాల్లో పర్యటించి రైతులను ఆదుకుంటామని హామీ ఇచ్చింది. హెక్టారుకు రూ.6 వేల సాయం అందిస్తామని హామీ ఇచ్చి, మిగిలిన పరిహారం రాష్ట్ర ప్రభుత్వం ఇస్తుందని పేర్కొంది. ఈ విధంగా రైతులకు మొత్తం రూ.290 కోట్లు పరిహారంగా చెల్లించాల్సి ఉంది. ఇందులో భాగంగా మే 28న 51,528 ఎకరాల్లో పంటనష్టానికి రూ.51.52 కోట్లు విడుదల చేయనున్నట్లు ప్రకటించినా వాటిని విడుదల చేయలేదు.

మూడు దఫాలుగా కురిసన వర్షాలతో నల్లగొండ, మహబూబ్‌నగర్, నిజామాబాద్, కామారెడ్డి, కరీంనగర్, ఖమ్మం, కొత్తగూడెం, జగిత్యాల, కామారెడ్డి, మంచిర్యాల, ఆదిలాబాద్, వికారాబాద్, మెదక్, జగిత్యాల, సూర్యాపేట, గద్వాల, వనపర్తి, ఆసిఫాబాద్ జిల్లాల్లో పంట నష్టం సంభవించింది. వేసిన పంటలకు సాగు, కూలీ తదితర ఖర్చుల నిమిత్తం అప్పులు చేసి రైతులు భారీగా పెట్టుబడి పెట్టారు. చేలు ఏపుగా పెరడంతో యూరియా, ఇతర రసాయన ఎరువుల కోసం పెద్దమొత్తంలో ఖర్చు పెట్టారు. తీరా పంట చేతికొచ్చే సమయంలో అంతా వర్షం పాలైంది. దీంతో పంటలు దెబ్బతిని, పెట్టుబడులు కోల్పోయి, కనీసం పంటలు వేసుకునేందుకు భూముల్లో ఇసుక మేటలు వేసి కోలుకోలేని స్థితిలో రైతులు కొట్టుమిట్టాడుతున్నారు. పంట సాగు చేసిన వారికి పరిహారం అందించాలని కోరుతున్నారు. అప్పులు తీరే మార్గం కనిపించక, ప్రభుత్వం ప్రకటించిన నష్ట పరిహారం అందక, కనీసం పంటల బీమా కూడా అమలు కాక రైతన్నలు కష్టాల్లో ఎదురీదుతున్నారు. ఈ పరిస్థితుల్లో తమను ప్రభుత్వాలు త్వరిత గతిన ఆదుకోవాలని కోరుతున్నారు.

# పొట్టిశ్రీరాములు తెలుగు వర్సిటీలో త్వరలో అడ్మిషన్లు

## విసిగా ఆచార్య డి.మునిరత్నంనాయుడు నియామకం

## ఘనంగా సత్కరించిన సురవరం తెలుగు వర్సిటీ విసి నిత్యానందరావు

**హైదరాబాద్ (నాంపల్లి), అక్టోబరు 17(జర్నలిస్ట్‌ఫైల్):** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన చట్టం ప్రకారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం రాజమహేంద్రవరములో ఏర్పాటైన పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయానికి ఇన్‌చార్జ్ ఉపాధ్యక్షుడుగా ఆచార్య డి.మునిరత్నం నాయుడును నియమిస్తూ ఏపి ప్రభుత్వం జీఓ విడుదల చేసిన సందర్భంగా ఆయన్ను సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షుడు ఆచార్య వెలుదండ నిత్యానందరావు గురువారం తన కార్యాలయంలో రిజిస్ట్రార్ ఆచార్య కోట్ల హనుమంతరావు, ప్రజాసంబంధాల అధికారి శ్రీనివాస్‌గౌడ్ తదితరులతో కలిసి ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో ప్రారంభించబోయే విద్యాత్మక కోర్సుల ప్రవేశాలలో తమవంతు పూర్తి సహకారం అందిస్తామని చెప్పారు. సమైక్య ఆంధ్రప్రదేశ్‌లో హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన శ్రీపొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం రాష్ట్ర విభజన తర్వాత కూడా ఉభయ రాష్ట్రాల్లో విద్యాసేవలను అందిస్తూ వచ్చింది. విభజన చట్టం ప్రకారం పదేళ్ల పూర్తయిన తర్వాత ఆంధ్రప్రదేశ్‌లో ఈ సేవలు నిలిచిపోయాయి. ఈ పరిస్థితిలో ఏపి విద్యాశాఖ తీసుకున్న నిర్ణయంతో పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఏర్పాటు చేయడానికి మార్గం సుగమం అయ్యింది. రాజమహేంద్రవరం సమీపంలోని బొమ్మూరులో ఈ విశ్వవిద్యాలయం తన కార్యకలాపాలను ఇకనుండి నిర్వహించబోతుంది. ఈ సందర్భంగా నూతనంగా ఇన్‌చార్ ఉపాధ్యక్షుడుగా నియమితులైన ఆచార్య డి.మునిరత్నం నాయుడు మాట్లాడుతూ ఏపిలో ఏర్పడిన పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో విద్యాత్మక కార్యకలాపాలు త్వరలో ప్రారంభించడానికి పూర్తి సన్నాహాలు చేయనున్నట్లు పేర్కొన్నారు. కొంతకాలంగా నిలిచిపోయిన అడ్మిషన్ల ప్రక్రియను వేగవంతం చేస్తామని, విద్యార్థులకు విద్యా సంవత్సరం నష్టపోకుండా చర్యలు చేపడతామని తెలిపారు.



మునిరత్నంనాయుడును సత్కరిస్తున్న నిత్యానందరావు, హనుమంతరావు, శ్రీనివాస్‌గౌడ్ తదితర విశ్వవిద్యాలయ సిబ్బంది



# పోలీస్ కంప్లెయింట్స్ అథారిటీ 'ఎస్‌పిసిఎ'

## ప్రత్యేక వెబ్‌సైట్, లోగో ఆవిష్కరణ

**(జర్నలిస్ట్‌ఫైల్) ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, అక్టోబరు 17:** సచివాలయంలో 'తెలంగాణ స్టేట్ పోలీస్ కంప్లైంట్స్ అథారిటీ (ఎస్‌పిసిఏ)' వెబ్ సైట్, లోగోను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆవిష్కరించారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్య దర్శి రామ కృష్ణా రావు, డీజీపీ శివధర్‌రెడ్డి, హోంశాఖ స్పెషల్ సీఎస్ సీవీ ఆనంద్, సిజిజి డిజి రవిగుప్త, ఇంటలిజెన్స్ ఎడిజి విజయ్‌కుమార్, ఎస్‌పిసిఏ చైర్మన్ రిటైర్డ్ జస్టిస్ శివ శంకర్‌రావు, సభ్యులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# పేట్ బషీరాబాద్ పారిశ్రామికవాడలో భారీ అగ్నిప్రమాదం

**హైదరాబాద్, అక్టోబరు 17(జర్నలిస్ట్‌ఫైల్):** పేట్ బషీరాబాద్ దూలపల్లి పారిశ్రామికవాడలో భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. ప్లాస్టిక్ కవర్ల తయారీ పరిశ్రమలో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. పరిశ్రమ నుంచి పెద్ద ఎత్తున మంటలు ఎగిసిపడి వ్యాప్తి చెందుతున్నాయి. స్థానికులు చూసి అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో హుటాహుటీన సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. రెండు అగ్నిమాపక యంత్రాల సిబ్బంది మంటలను ఆర్పడానికి తీవ్రంగా శ్రమిస్తున్నాయి. అయితే ఈ ప్రమాదానికి షార్ట్‌సర్క్యూట్ కారణమా? ఎవరైన నిప్పుతో ఉన్న సిగరేట్ పడేశారా? అన్న కోణంలో పేట్ బషీరాబాద్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మెత్తటి స్వభావమైన పాలిథిన్ కవర్లు కంపెనీలో అధికంగాఉండడంతో నిప్పుకణం పడిన అంటుకొని మంటలు వ్యాపించి ఎగిసిపడే అవకాశం ఉంది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## ప్రతి జిల్లాలో రైతు విజ్ఞాన కేంద్రం

**హైదరాబాద్, అక్టోబరు 17(జర్నలిస్ట్‌ఫైల్):** రాష్ట్రంలోని రైతులకు పంటల సాగులో ఆధునిక సాంకేతికను అందుబాటులో తెచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా ప్రతి జిల్లాలో రైతు విజ్ఞాన కేంద్రం స్థాపించనుంది. తద్వారా రైతులకు వాతావరణ మార్పులపై అవగాహన కల్పించడం, పంటల మార్పిడి ఆవశ్యకతను వివరించడం, నేరుగా వరి విత్తనం వేయడం, పత్తిలో కలుపు మొక్కల నివారణ వంటి వాటిని ప్రోత్సహించనుంది. అదేవిధంగా డ్రోన్లు, యంత్రాల వినియోగం, కృత్రిమ మేధ, రోబోటిక్స్ వంటి ఆదునిక సాంకేతిక సేవలను అందించనుంది. వీటన్నింటి అమలుకు ప్రత్యేకంగా రైతు విజ్ఞాన కేంద్రాల ఏర్పాటుపై వ్యవసాయ అధికారులు దృష్టి సారించారు. కాగా రాష్ట్ర వ్యాప్తంగా ప్రస్తుతం తొమ్మిది ఏరువాక కేంద్రాలు, ఎనిమిది కృషి విజ్ఞాన కేంద్రాలు పనిచేస్తున్నాయి. కొత్త వాటితో పాటు, ఈ కృషి విజ్ఞా కేంద్రాలను రైతు విజ్ఞాన కేంద్రాలుగా మారుస్తారు. ఈ విధంగా రాష్ట్రంలో మరో 15 జిల్లాల్లో కొత్తగా రైతు విజ్ఞాన కేంద్రాలను ఏర్పాటు చేస్తారు. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో ఆర్‌వీకేలు అందుబాటులోకి వస్తాయి. వీటిని ఏర్పాటు చేయడంతోపాటు ప్రతి కేంద్రంలో ఆరుగురు చొప్పున శాస్త్రవేత్తలను నియమిస్తారు. ఇతర సహాయ సిబ్బంది ఉంటారు. రైతు విజ్ఞాన కేంద్రాల ద్వారా ప్రయోగశాలలు ఏర్పాటు చేస్తారు. వాటికి అనుబంధంగా విత్తన, సాగు క్షేత్రాలు ఉంటాయి. వాటిలో డ్రోన్లు, యంత్రాలపై శిక్షణ ఇస్తారు. నిత్యం రైతు శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తూ రైతులకు అధునాత సాగు విధానాలపై అవగాహన కల్పిస్తారు.

# వరి ఉత్పత్తిలో దేశంలోనే తెలంగాణ అగ్రస్థానం

**హైదరాబాద్, అక్టోబరు 17(జర్నలిస్ట్‌ఫైల్):** దేశంలో రికార్డు స్థాయిలో ధాన్యం ఉత్పత్తిలో తెలంగాణ అగ్రస్థానంలో ఉంది. రాష్ట్రంలో వరి పంట సాగుకు అనుకూల వాతావరణం ఉండటంతో పాటు, ప్రభుత్వ విధానాలతో గతేడాది 2024-25 సంవత్సరంలో తెలంగాణలో రికార్డుస్థాయిలో పంటల సాగు విస్తీర్ణం జరిగింది. దేశంలోనే అత్యధికంగా బియ్యం పండిస్తున్న రాష్ట్రంగా అగ్రస్థానంలో నిలిచిందని అర్థ, గణాంక శాఖ తెలిపింది. రాష్ట్రంలో సాధారణ సాగు విస్తీర్ణానికి మించి వరి పంట వేయడంతో దిగుబడులు రికార్డు స్థాయిలో వచ్చాయి. గత రబీ సీజన్‌లో సాధారణ సాగు విస్తీర్ణం 16 లక్షల హెక్టార్లు కాగా, గతేడాది ఏకంగా 24.04 లక్షల హెక్టార్లలో సాగు చేశారు. 2023-24లో రాష్ట్రంలో 168.75 లక్షల టన్నుల బియ్యం ఉత్పత్తి జరిగింది. తదుపరి ఏడాది 2024-25 అంతకు ముందు ఏడాది వచ్చిన దిగుబడిని అధిగమించి 183.57 లక్షల టన్నులు అదనపు ఉత్పత్తి సాధించిందని తెలిపింది. గత సంవత్సరం ఖరీఫ్, రబీలో మొత్తం 275 లక్షల టన్నులకు పైగా ధాన్యం దిగుబడి వచ్చింది. దీని నుంచి 183 లక్షల టన్నుల బియ్యం ఉత్పత్తయినట్లు నివేదిక తెలిపింది. ధాన్యం ఒకటే కాకుండా, వివిధ రకాలకు చెందిన ఇతర పంటల దిగుబడి సైతం గతంలో కంటే పెరిగినట్లు తెలిపింది. అలాగే తృణ, చిరుధాన్యాలు కలిపి రాష్ట్రంలో 37.19 లక్షల టన్నులు, మినుములు 43,570, పెసలు 24,170, కందులు 1.99 లక్షల టన్నులు, అర్థ గణాంక శాఖ వెల్లడించింది.

# నూతన అమరవీరుల స్తూపం పనులపై డిజిపి శివధర్‌రెడ్డి పరిశీలన



**హైదరాబాద్, అక్టోబరు 17(జర్నలిస్ట్‌ఫైల్):** హైదరాబాద్ గోషామహల్ పోలీస్ మైదానంలో నూతనంగా నిర్మిస్తున్న పోలీస్ అమరవీరుల సంస్మరణ స్థూపం నిర్మాణ పనులను గురువారం డిజిపి బి.శివధర్ రెడ్డి పరిశీలించారు. అక్టోబరు 21న పోలీసు అమర వీరుల సంస్మరణదినం సందర్భంగా ప్రతి సంవత్సరం తెలంగాణ పోలీసు శాఖ ప్రత్యేక కార్యక్రమం గోషామహల్ స్టేడియంలో నిర్వహిస్తున్న విషయం విధితమే. కార్యక్రమంలో భాగంగా స్తూపం నిర్మాణ పనులను ఆయన హైదరాబాద్ పోలీసు అధికారులతో కలిసి పర్యవేక్షి ం చారు. కార్యక్రమములో అదనపు డిజిపి మహేష్ భగవత్, హైదరాబాద్ సి.పి. వి.సి సజ్జనర్, పోలీసు హౌసింగ్ కార్పొరేషన్ ఎం.డి. ఎం.రమేశ్, జాయింట్ సిపి తఫ్సీర్ ఇక్బాల్, జాయింట్ ట్రాఫిక్ సిపి జోయల్ డేవిస్ తదితర అధికారులు ఉన్నారు.

# దేశ సేవకు నిబద్ధత అవసరం

## ఐసిఎఆర్ డైరెక్టర్ జనరల్, డేర్ కార్యదర్శి డాక్టర్ మంగీలాల్ జాట్

## ముగిసిన 114వ ఫౌండేషన్ కోర్సు ఫర్ అగ్రికల్చరల్ రీసెర్చ్ సర్వీస్ కార్యక్రమం

**హైదరాబాద్ (అత్తాపూర్) అక్టోబరు 17(జర్నలిస్ట్‌ఫైల్):** : మార్పును స్వీకరించేటప్పుడు పరి శోధనకు ప్రాధాన్యత ఇవ్వడం చాలాముఖ్యమని ఐసిఎఆర్ డైరెక్టర్ జనరల్ మరియు డేర్ కార్యదర్శి డాక్టర్ మంగీలాల్ జాట్ అన్నారు. గురువారం నారంలో జరిగిన 114వ ఫౌండేషన్ కోర్సు ఫర్ అగ్రికల్చరల్ రీసెర్చ్ సర్వీస్ ముగింపు కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఆలోచనను వాస్తవంలోకి అను వదించడం, పరిమిత వనరులతో పనిచేయడం కెరీర్ పురోగతికి ఈ సమయానికున్న అవసరమని ఆయన అన్నారు. మానవత్వం మరియు జనాభా కోసం దేశానికి సేవ చేయడానికి నిబద్ధత అవసరమని ఆయన నొక్కి చెప్పారు. శాస్త్రవేత్తలు వారి బలహీనతలను తెలుసుకోవాలని మరియు సవాళ్లను అవకాశాలుగా మార్చుకుంటూ వ్యక్తిగతంగా ఎదగడానికి వారిపై పనిచేయాలని ఆయన సూ చించారు. ఫోకర్స్ అనేది వ్యవసాయ పరిశోధన సేవ (ఎఆర్ఎస్) కోసం ప్రధాన సామర్థ్య నిర్మాణ కార్యక్రమం, ఇది ఐసీఎఆర్ 2050 దార్శని కతను సాధించడంలో దోహద పడే ప్రొఫెషనల్ పరిశోధకుల కేడర్‌ను అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పెట్టుకుంది. శిక్షణార్థులు ఏడు రాష్ట్రాలలోని 80 కేవీకే లలో క్షేత్ర అనుభవ శిక్షణ పొందారు. ఈ ఫౌండేషన్ శిక్షణలో తీసుకువచ్చిన ఆవిష్కరణలను నొక్కి చెబుతూ, కోర్సు కోఆర్డినేటర్ డాక్టర్ ఆర్ వెంకట కుమార్ వివరణాత్మక నివేదికను సమర్పించారు. ఈ బ్యాచ్‌లో ఉత్తమ శిక్షణార్థులుగా డాక్టర్ స్మృతి రంజన్‌పధన్, డాక్టర్ రంజిత ఎం ఆర్‌లను డాక్టర్ జాట్ సత్కరించారు. 'వ్యవసాయ పరిశోధన కోసం కాన్సెప్ట్ నోట్ గ్యాలరీ'; 'వెల్త్ ఆఫ్ ఇండిజీనస్ సైన్స్ ఇన్ అగ్రికల్చర్' 'సావనీర్ ఆఫ్ 114వ ఫోకర్స్' అనే మూడు ప్రచురణలను ముఖ్య అతిథి ఈ సందర్భంగా విడుదల చేశారు. ముందుగా,ఐ సిఎ ఆర్‌నారం యాక్టింగ్ డైరెక్టర్ డాక్టర్ గోపాల్ లాల్ సమావేశానికి స్వాగతం పలికారు. వినూత్న పరిశోధనల ద్వారా భారతీయ వ్యవసాయానికి మార్గదర్శకులుగా ఉండాలని ఆయన ప్రొబెషనర్లకు సూచించారు. ఎ ఆర్ ఎస్ యొక్క 41 విభాగాలు, దేశంలోని 21 రాష్ట్రాలకు ప్రాతినిధ్యం వహిస్తున్న 105 మంది సైంటిస్ట్ ప్రొబెషనర్లు 3 నెలల వ్యవధిలో ఫౌండేషన్ శిక్షణ పొందారు. దేశవ్యాప్తంగా వివిధ ఐసీఎఆర్ సంస్థలలో పోస్టింగ్ పొందారు. సహకోర్సు కోఆర్డినేటర్ డాక్టర్ ఉమేష్ హుదేదమణి కృతజ్ఞతలు తెలిపారు. ముగింపు కార్యక్రమంలో అకాడమీ అధ్యాపకులు, శాస్త్రవేత్తలు మరియు సిబ్బంది పాల్గొన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న ఐసిఏఆర్ డైరెక్టర్ జనరల్, డేర్ కార్యదర్శి డాక్టర్ మంగీలాల్ జాట్

# పంటల కొనుగోళ్లు సమర్థవంతంగా జరపాలి

## రైతుల శ్రేయస్సే అత్యంత ప్రాధాన్యత

## వ్యవసాయ శాఖ కార్యదర్శి సురేంద్రమోహన్

**హైదరాబాద్, అక్టోబరు 17(జర్నలిస్ట్‌ఫైల్):** రాష్ట్రంలో పంటల కొనుగోళ్లు పారదర్శకంగా, సమర్థవంతంగా, సమన్వయపూర్వకంగా జరిగేలా చూడాలని వ్యవసాయ శాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్ సూచించారు. రైతుల శ్రేయస్సే ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యత అని స్పష్టం చేశారు. పత్తి, వరి, మొక్కజొన్న తదితర కొనుగోళ్లపై గురువారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతూ రైతులు సకాలంలో న్యాయమైన ధర పొందేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆయా జిల్లాలలో కొనుగోలు కార్యకలాపాలను పర్యవేక్షి స్తూ జిల్లా కలెక్టర్, అధికారులతో సమన్వయం చేసుకుని రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా కొనుగోలు ప్రక్రియ సజావుగా కొనసాగించే బాధ్యత ప్రత్యేక అధికారులపై ఉందని చెప్పారు. అదేవిధంగా రాష్ట్రంలో రైతుల వివరాలు క్రాప్ బుకింగ్ ద్వారా ఇప్పటికే నమోదు చేయబడినందున ఆ డేటా కప్పాస్ కిసాన్ యాప్‌తో సమన్వయం చేయబడుతుందని తెలిపారు. అయితే, క్రాప్ బుకింగ్‌లో నమోదైన రైతుల మొబైల్ నంబర్లు సరిగా ఉన్నాయా లేదా అనేది తప్పనిసరిగా ధృవీకరించాలన్నారు. ఏ రైతు మొబైల్ నంబరు తప్పుగా నమోదు చేసినట్లు ఉంటే, వాటినివ్యవసాయ శాఖ ద్వారా యాప్‌లో సవరించాల్సి ఉంటుందని వెల్లడించారు. ఇక కౌలు రైతులు విషయానికి వస్తే వారు తప్పనిసరిగా ఎఇఒ టిజి ప్రొక్యూర్‌మెంట్ ద్వారా నమోదు కావాలని, ఆ డేటా కపాస్ కిసాన్ యాప్‌కి నేరుగా పంపబడుతుందని తెలిపారు. అప్పుడు మాత్రమే వారు సిసిఐ పత్తి కొనుగోలు కేంద్రాల వద్ద తమ పత్తిని అమ్మగలుగుతారని పేర్కొన్నారరు. మార్కెట్ యార్డులు వద్ద స్లాట్ బుకింగ్ సహాయ కేంద్రాలు ఏర్పటు చేయడం జరుగుతుందని చెప్పారు. రైతుల ఫిర్యాదులు, సందేహాలను పరిష్కరించడానికి టోల్‌ఫ్రీ నెంబరు 1800 599 5779 ద్వారా హెల్ప్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఖరీఫ్ మార్కెటింగ్ సీజన్‌ను సజావుగా కొనసాగించేందుకు, రైతులకు గరిష్ట లాభం చేకూర్చే విధంగా చర్యలు తీసుకోవాలని తెలియచేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ప్రత్యేక అధికారులు, మార్కెటింగ్, వ్యవసాయ, సహకార, కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా అధికార్లు పాల్గొన్నారు.



## జాబ్ మార్కెట్‌కు అనుగుణంగా నైపుణ్యాలు

- కెరీర్ పరంగా ప్రపంచవ్యాప్త అవకాశాలను అందిపుచ్చుకోవచ్చు
- నైపుణ్యాభివృద్ధి సంస్థ సేవలను సద్వినియోగం చేసుకోవాలి: ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

**విజయవాడ, అక్టోబర్ 17(జర్నలిస్ట్‌ఫైల్):**

ప్రస్తుతం జాబ్ మార్కెట్‌కు అనుగుణంగా యువత నైపుణ్యాలు సముపార్జించాలని.. అప్పుడే కెరీర్ పరంగా ప్రపంచ వ్యాప్త అవకాశాలను అందిపుచ్చుకోవచ్చని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. గురువారం జిల్లా నైపుణ్యాభివృద్ధి కార్యాలయం ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన ఇగ్నైట్ సెల్‌ను కలెక్టర్ లక్ష్మీశ సందర్శించారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఏపీ ఎస్ఎస్‌డీసీ) ద్వారా అందిస్తున్న సేవలకు సంబంధించిన వివరాలను, సంస్థ కార్యకలాపాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ ఏపీ ఎస్ఎస్‌డీసీ ద్వారా ఎప్పటికప్పుడు నైపుణ్యాభివృద్ధి శిక్షణ కార్యక్రమాలతో పాటు జాబ్ మేళాలను కూడా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా రష్యా, జర్మన్, ఖతార్ తదితర దేశాల్లో కూడా వివిధ ఉద్యోగావకాశాలు పొందేందుకు ఆయా భాషల్లో శిక్షణతో పాటు ఉద్యోగాలు పొందేందుకు చేయూతనందిస్తోందన్నారు. ఇలాంటి అవకాశాలను యువత సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ లక్ష్మీశ పేర్కొన్నారు. కలెక్టర్ లక్ష్మీశ వెంట జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి వెంట సీపాన శ్రీనివాసరావు, డీఆర్‌డీఏ పీడీ ఏఎన్‌వీ నాంచారరావు తదితరులు ఉన్నారు.

## వి పి ఎస్ పబ్లిక్ స్కూల్‌లో నిప్పు లేకుండా వంట కార్యక్రమం



**విజయవాడ, అక్టోబర్ 17(జర్నలిస్ట్‌ఫైల్):**

మొగల్రాజపురం లోని వీరమాచనేని పద్దయ్య సిద్ధార్థ పబ్లిక్ పాఠశాలలో ప్రపంచ ఆహార దినోత్సవం సందర్భంగా నిప్పు లేకుండా వంట అనే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రెండవ తరగతి చిన్నారులు వారి తల్లులతో కలిసి పోషక విలువలతో కూడిన వివిధ రకాల ఆహార పదార్థాలను తయారు చేశారు. కూరగాయలతో తయారుచేసిన ఆకృతులు చూపరులను ఎంతో ఆకట్టుకున్నాయి. అటుకులు ,కొబ్బరి పాలతో బిర్యానీ , కీరా తో నూడిల్స్ మొలకలతో చాట్ మొదలగు వంటకాలు ఎంతో రుచికరంగా తయారు చేశారు. అంతేకాక డ్రై ఫ్రూట్స్ తో లడ్డు , కిల్లీ , వివిధ రకాల పండ్లతో ఆహార పానీయాలు వంటి శక్తినిచ్చే పదార్థాలు కూడా తయారు చేశారు .ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ మేడా సీతారామయ్య ,వైస్ ప్రిన్సిపల్ రోజ్ మేరీ , ప్రధానోపాధ్యాయురాలు సిహెచ్ జయలక్ష్మి పాల్గొని వంటకాలు అన్నింటిని రుచి చూసి ,ఉత్తమమైన వంటకాన్ని ఎంపిక చేశారు.ఈ కార్యక్రమంతో పాటు త్వరలో రానున్న దీపావళి సందర్భంగా ఐదో తరగతి చిన్నారులకు దియాస్టాండ్ డెకరేషన్ అనే కార్యక్రమాన్ని నిర్వహించి ,అందంగా అలంకరించిన వాటిని ఎంపిక చేశారు.

## జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖలో ఉద్యోగాల భర్తీ

- ఈ నెల 22వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలి
- ఎన్టీఆర్ జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ, సాధికారత అధికారి షేక్ రుక్సానా సుల్తానా బేగం

**విజయవాడ, అక్టోబర్ 17(జర్నలిస్ట్‌ఫైల్):**

ఎన్‌టీఆర్ జిల్లా మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో విజయవాడలో నడుస్తున్న ఇంటిగ్రేటెడ్ చైల్డ్ ప్రొటెక్షన్ స్కీమ్ (ఐసీపీఎస్), ఎస్ఏఏ, చిల్డ్రన్ హోమ్స్‌లో కాంట్రాక్టు లేదా అవుట్ సోర్సింగ్ పద్ధతిపై పనిచేసేందుకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ, సాధికారత అధికారిణి షేక్ రుక్సానా సుల్తానా బేగం గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. అకౌంటెంట్, అసిస్టెంట్ కమ్ డేటా ఎంట్రీ ఆపరేటర్, పార్ట్ టైమ్ డాక్టర్, చౌకీదారు కం నైట్ వాచ్ విమెన్, ఎడ్యుకేటర్ పార్ట్ టైం, ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ మ్యూజిక్ టీచర్ పార్ట్ టైం, పీటీ ఇన్‌స్ట్రక్చర్ కమ్ యోగా టీచర్ పార్ట్ టైం, కుక్, హెల్పర్, హౌస్ కీపర్, హెల్పర్ కమ్ నైట్ వాచ్ విమెన్ పోస్టులకు స్థానిక అర్హులైన 18 - 42 ఏళ్ల వయసున్న మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు అయిదేళ్లు, దివ్యాంగులకు పదేళ్లు వయసు సడలింపు ఉంటుందన్నారు. ntr.ap.gov.in నుండి దరఖాస్తులు డౌన్లోడు చేసుకొని పూర్తిచేసిన అన్ని ధ్రువపత్రాల నకళ్లను గజిటెడ్ అధికారిచే అటెస్ట్ చేయించి దరఖాస్తులను ఈ నెల 22వ తేదీ సాయంత్రం 5 గంటలులోగా జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ మరియు సాధికారత అధికారిణి వారి కార్యాలయం, డోర్ నెంబర్ 6-93, కార్మెల్ చర్చి ఎదురురోడ్, కానూరు, విజయవాడ వారి కార్యాలయానికి అభ్యర్థులు స్వయంగా సమర్పించాలని జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ, సాధికారత అధికారిణి షేక్ రుక్సానా సుల్తానా బేగం తెలిపారు.

## ధన్వంతరి జయంతి కార్యక్రమాన్ని జయప్రదం చేయండి

### బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు కోలా ఆనంద్

**తిరుపతి, అక్టోబర్ 17(జర్నలిస్ట్‌ఫైల్):**



నాయీ బ్రాహ్మణుల కులదైవం ధన్వంతరి జయంతి సందర్భంగా భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో ఆధ్వర్యంలో శనివారం తిరుపతి పట్టణంలోని గాంధీ భవన్ నందు రాష్ట్రంలోని సుమారు వెయ్యి మంది నాయి బ్రాహ్మణులతో నాదస్వరం మరియు డోలు విద్వాంసులతో శోభయాత్ర మరియు కచేరి నిర్వహిస్తున్నటు బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు కోలా ఆనంద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర అధ్యక్షులు పివిఎన్ మాధవ్, తిరుమల దేవస్థానం చైర్మన్ బి రాజగోపాల్ నాయుడు, తిరుపతి శాసనసభ్యులు అరణి శ్రీనివాస మరియు ఇతర నాయకులు పాల్గొంటారు. కావున శ్రీకాళహస్తి పట్టణంలోని నాయీ బ్రాహ్మణ సోదరులందరూ తమ యొక్క నాదస్వరం, డోలు వాయిద్యాలతో మీ యొక్క దైవం ధన్వంతరి జయంతి కార్యక్రమంలో పాల్గొనవలసినదిగా కోరుకుంటున్నామని తెలిపారు.

# బాలికల బంగారు భవితకు బాసటగా నిలుద్దాం



- వివక్ష లేని వాతావరణంలో విద్య, సమాన అవకాశాల కల్పనకు కృషిచేద్దాం
- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

**విజయవాడ, అక్టోబర్ 17(జర్నలిస్ట్‌ఫైల్):**

బాలికలకు సమాన అవకాశాలు, నాణ్యమైన విద్య, ఆరోగ్య సేవలు అందించడంతో పాటు వారు అన్ని విధాలా అభివృద్ధి చెందేందుకు సమష్టిగా కృషిచేద్దామని, వారి బంగారు భవితకు బాసటగా నిలుద్దామని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అధికారులతో అన్నారు. అంతర్జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వం, పెయింటింగ్ తదితర విభాగాల్లో పోటీలు నిర్వహించగా వీటిలో విజేతలుగా నిలిచిన వారికి గురువారం కలెక్టరేట్‌లో జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ లక్ష్మీశ అధికారులతో కలిసి పతకాలు, బహుమతులు ప్రదానం చేశారు. బాలికలకు శుభాకాంక్షలు తెలియజేసి.. బాగా చదువుకొని కెరీర్‌లో ఉన్నతంగా ఎదగాలని సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ ప్రతి బాలికకు సమానత్వం, సరైన అవకాశాలు కల్పించడం ద్వారా ఉన్నత స్థానాలకు ఎదుగుతారన్నారు. అత్యున్నత స్థానంలో ఉన్న గౌరవ రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, వివిధ రంగాల్లో రాణిస్తున్న మహిళామణులను ఉదాహరిస్తూ ఇలాంటి గొప్ప వ్యక్తులను స్ఫూర్తిగా తీసుకొని ప్రభుత్వ కార్యక్రమాలు, పథకాలను సద్వినియోగం చేసుకొని జీవితంలో ఎదగాలని బాలికలకు సూచించారు. అదేవిధంగా వివక్ష, బాల్య వివాహాలు, హింస వంటి వాటికి అడ్డుకట్ట వేసేందుకు సమన్వయ శాఖల అధికారులు, సిబ్బంది కలిసికట్టుగా కృషిచేయాలని కలెక్టర్ లక్ష్మీశ పేర్కొన్నారు. కార్యక్రమంలో డీఎం హెచ్‌వో డా. ఎం.సుహాసిని, జిల్లా శిశు సంక్షేమ, సాధికారత అధికారిణి షేక్ రుక్సానా సుల్తానా బేగం, డీఈవో యూవీ సుబ్బారావు, సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ రజనీ కుమారి, డా. జె.ఇందుమతి, డాక్టర్ మాధవి, గైడ్ టీచర్స్, విద్యార్థులు, తల్లిదండ్రులు, వివిధ శాఖల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ప్రపంచ వేదికపై విశాఖ గూగుల్ ఏఐ హబ్ ఆంధ్రప్రదేశ్‌కు గర్వకారణం

- 10 బిలియన్ పెట్టుబడితో విశాఖలో గూగుల్ డేటా సెంటర్ -సీఎం చంద్రబాబు దూర దృష్టి ఫలితం
- 1.88 లక్షల ఉద్యోగాలతో రాష్ట్ర యువతకు స్వర్ణావకాశం
- భారతదేశాన్ని డిజిటల్ పవర్ హౌస్‌గా మార్చే తొలి అడుగు విశాఖ ఏఐ హబ్
- శ్రీ కాళహస్తి శాసనసభ్యులు బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి

**శ్రీ కాళహస్తి, అక్టోబర్ 17(జర్నలిస్ట్‌ఫైల్):**



"విశాఖలో గూగుల్ ఏఐ హబ్ ఏర్పాటుతో ఆంధ్రప్రదేశ్ మాత్రమే కాదు.. యావత్ భారతదేశం ప్రపంచ వేదికపై సాంకేతిక శక్తిగా నిలుస్తోంది" అని శ్రీ కాళహస్తి శాసనస భ్యులు బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం మీడియా వారికి ఒక ప్రకటన విడుదల చేసి మాట్లాడుతూ... ప్రపంచ వేదికపై విశాఖ గూగుల్ ఏఐ హబ్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి గర్వకారణం అని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మరియు గూగుల్ మధ్య కుదిరిన ఈ అవగాహన ఒప్పందం చరిత్రాత్మక మైందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దూరదృష్టి, మంత్రి నారా లోకేష్ నిరంతర కృషి ఫలితంగా విశాఖ ఇప్పుడు ఏఐ సిటీగా రూపాంతరం చెందుతోందన్నారు. ఇది రాష్ట్రానికి డిజిటల్ విప్లవానికి నాంది అని ఆయన వివరించారు. విశాఖపట్నంలో ఏర్పాటు కానున్న ఒక గిగావాట్ హైపర్‌స్కేల్ డేటా సెంటర్ క్యాంపస్ ద్వారా రాష్ట్రానికి భారీ ఆదాయం, యువతకు సుమారు 1.88 లక్షల ఉద్యోగాలు లభించనున్నట్లు తెలిపారు. కూటమి ప్రభుత్వం చొరవతో $10 బిలియన్ల పెట్టుబడితో ఈ ప్రాజెక్ట్ ప్రారంభం అవుతుండటం విశాఖను ఆసియాలో గూగుల్ చేపట్టిన అతిపెద్ద ప్రాజెక్టులలో ఒకటిగా నిలబెడుతుందని అన్నారు. 2028 నుండి 2032 మధ్య ఈ ప్రాజెక్ట్ ద్వారా రాష్ట్ర జీఎస్డీపీకి సంవత్సరానికి రూ.10,518 కోట్ల వాటా, అలాగే రూ.9,553 కోట్ల అదనపు ఆదాయం సమకూరనుంది. మొత్తం ఐదేళ్లలో రూ.47,720 కోట్ల ఆర్థిక ప్రగతి సాధించగలమని అంచనా. ఇది భారతదేశాన్ని డిజిటల్ పవర్ హౌస్‌గా మార్చే తొలి అడుగు" అని తెలియజేశారు. సీఎం చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ ఇప్పుడు కొత్త సాంకేతికతలను అందిపుచ్చుకునే దిశగా దూసుకెళ్తోందన్నారు. విద్యా రంగం నుండి పారిశ్రామిక రంగం వరకు అన్ని విభాగాలు ఏఐ ఆధారిత మార్పుల దిశగా పయనిస్తున్నాయి. కొత్త టెక్నాలజీలకు అనుగుణంగా రాష్ట్రంలో పాఠ్యాంశాలు కూడా మారనున్నాయి" అని తెలిపారు. విశాఖ ఏఐ హబ్ కేవలం ఆంధ్రప్రదేశ్‌కే కాదు, భారతదేశం మొత్తానికి ఒక మైలురాయి. ఇది గ్రామీణ స్థాయిలో ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేస్తూ, సర్వీసులను విస్తృత స్థాయిలో అందించబోతోంది. చంద్రబాబు నాయకత్వం లో రాష్ట్రం ఒక స్వర్ణధామంగా మారుతోంది" అని అన్నారు. ప్రపంచంలో సురక్షిత నగరంగా పేరు తెచ్చుకున్న గ్రేటర్ విశాఖ ఇప్పుడు ఐటీ, డేటా సిటీగా అభివృద్ధి చెందుతోందని, ఇది భారతదేశ భవిష్యత్తుకు మార్గదర్శక ప్రాజెక్ట్" అని బొజ్జల అన్నారు.

# 'ఎక్స్ రే' కొల్లూరి కన్నుమూత

**అమరావతి, అక్టోబర్ 17(జర్నలిస్ట్‌ఫైల్):**

ప్రముఖ కవి, 'ఎక్స్ రే' సాహిత్య మాసపత్రిక ఎడిటర్, ఎక్స్ రే సాహిత్యసేవా సంస్థ వ్యవస్థాపకులు, మినీ కవితా సారధి కొల్లూరి సత్యనారాయణ అక్టోబర్ 16న రాత్రి 7 గంటల సమయంలో గుండెపోటుతో కన్నుమూశారు. ఆయన వయసు 69. ఆయనకు భార్య, కుమార్తె ఉన్నారు. తాడేపల్లిలోని మణిపాల్ ఆసుపత్రిలో కాలికి చికిత్స నిమిత్తం 15 రోజుల క్రితం చేరిన కిడ్నీ సమస్యలతో డయాలసిస్ తీసుకుంటూ గురువారం రాత్రి గుండెపోటుతో తుదిశ్వాస విడిచారు. ఆంధ్రా బ్యాంకు అధికారిగా జీవితం ఆరంభించిన కొల్లూరి ప్రముఖ సినీ దర్శక, రచయిత విజయ బాపినీడు తెచ్చిన చిరంజీవి పత్రికకు సంపాదక సారథ్యం వహించేందుకు ఆంధ్రాబ్యాంకు ఉద్యోగం వదిలిపెట్టి మద్రాసు వెళ్ళారు. 1993లో విజయవాడకు చేరుకుని కొంతకాలం 'అంజలి' వారపత్రిక నడిపారు. అంతకుముందే ఎక్స్ రే పేరుతో అచ్చంగా కవిత్వం కోసం ఓ పత్రిక నడిపారు. మినీ కవితా సారథిగా పేరు గడించారు. సాంస్కృతిక రాజధానిగా పేరుందిన విజయవాడలో 90 వ దశకంలో ఉన్న పళంగా స్తబ్ధత ఆవరించగానే ఎక్స్ రే పేరుతో సాహిత్య సేవా సంస్థను ఏర్పాటు చేసి నెలనెలా వెన్నెలతో పాటు మరెన్నో పెద్ద కార్యక్రమాలు చేపడుతూ సాహిత్య వాతావరణం ఉట్టిపడేలా చేశారు. దిగంబర కవులు నిఖిలేశ్వర్, జ్వాలాముఖి, నగ్నమునితో పాటు ఇంకా కె. శివారెడ్డి వగైరా ప్రముఖ తెలుగు కవులతో మాంటిస్సోరి కళాశాలలో 24 గంటల కవి సమ్మేళనం నిర్వహించారు కొల్లూరి. ఏటా పది ఉత్తమ కవితలకు ఎక్స్ రే అవార్డులు ఇస్తూ వస్తున్నారు. కమ్యూనిస్టుల కంచుకోట బెజవాడలో మహాకవి శ్రీశ్రీకి విగ్రహం లేకపోవడం



చిన్నతనంగా, అవమానంగా భావించి తుమ్మలపల్లి వారి క్షేత్రయ్య కళాక్షేత్రంలో మహాకవి శ్రీశ్రీ విగ్రహాన్ని ఏర్పాటు చేయడంతో పాటు 2010 లో శ్రీశ్రీ శత జయంతి మహా సభలు ఘనంగా నిర్వహించారు. కరో నా కష్టకాలంలో నిత్యాన్నదానంతో అలుపెరగకుండా శ్రమించారు. వేస వికాలం వచ్చిందంటే చాలు కొన్ని వేల మజ్జిగ ప్యాకెట్లతో పాద చారుల దాహార్తిని తీర్చేవారు. లయన్స్ క్లబ్ ఆఫ్ విజయవాడ అంజలి చార్టర్ అధ్యక్షులుగా సేవలందించారు. వాకర్స్ ఇంటర్నేషనల్ మాజీ గవర్నర్ గా చేశారు. విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ కార్యవర్గ సభ్యుడిగా కూడా చురుగ్గా వ్యవహరించారు. ప్రముఖులు, కవులు, సత్రీ, ఆంజనేయరాజు, కళాసాగర్, అరసవిల్లి కృష్ణ, అశోక్ కుమార్, చలపాక ప్రకాష్ తదితరులు కొల్లూరి భౌతికకాయాన్ని సందర్శించి నివాళులు అర్పించారు.

# కార్మికులకు నూతన వస్త్రాలు పంపిణీ





- కార్మికుల సంక్షేమానికి ప్రాధాన్యత
- 250 మందికి దుస్తువుల అందజేత
- సాయి శానిటేషన్ సోషల్ సర్వీసు ఆర్గనైజేషన్ అధ్యక్షులు పంచానంద్

**విజయవాడ, అక్టోబర్ 17(జర్నలిస్ట్‌ఫైల్):**

కార్మికుల ఆరోగ్య భద్రత,సంక్షేమానికి అధిక ప్రాధా న్యత ఇస్తున్నామని,వారికి నిరంతరం అండగా ఉంటామని సాయి శానిటేషన్ సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ అధ్యక్షులు పంచానంద్ అన్నారు. స్థానిక బస్టాండ్ లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సాయి శానిటేషన్ సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ లో పని చేస్తున్న కార్మికు లకు, ఉద్యోగులకు,పెదలైన వారికి కలిపి సుమారు 250మం దికి పైగా నూతనంగా వస్త్రాలను సంస్థ ప్రతినిధులు అందజేశారు.ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులు మాట్లాడుతూ దీపావళి సందర్భం గా అందరికి మేలు జరగాలని ,ప్రతికుటుం బంలో కాంతులు ప్రతి వెల్లు విరావాలని అకాంక్షిం చారు.అధ్యక్షులు పంచానంద్ మాట్లాడుతూ విజయ వాడలో పని చేస్తున్న వారికే కాకుండా నెల్లూరు, తిరుపతి, విశాఖపట్నం, హైదరాబాదు తదిత ప్రాం తాల్లో పని చేస్తున్న తమ సంస్థ ఉద్యో గులకు నూతన దుస్తులు అందజేస్తునా ్నమని, కార్మికులకు మేలు చేయడంతో వారి సంక్షేమాని అన్ని విధాల కృషి చేస్తు న్నామని వివరించారు.ఈ కార్య్ర ్మంలో సెక్రటరీ మున్నిదేవి,కమీటీ సభ్యులు రేఖ దేవి, నిర్వాహకులు టి.వెంకట శ్రీను,దీపక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఈసారి గోవాలో ప్రధాని దీపావళి వేడుకలు



**పనాజి, అక్టోబరు 17:** ప్రతి సంవత్సరం దీపావళి వేడుకలను ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సరిహద్దుల్లోని జవాన్లతో కలిసి జరుపుకుంటున్న విషయం తెలిసిందే. సైనిక దుస్తులు ధరించి ప్రతి ఏటా ఒక ప్రదేశంలో మోదీ ఈ వేడుకలను జరుపుకుంటూ వస్తున్నారు. జవాన్లకు స్వయంగా స్వీట్లు తినిపించి జాలీగా గుడుపుతుంటారు. అయితే, ఈ సారి గోవాలో దివాళి సెలబ్రేషన్స్ చేసుకోనున్నట్లు తెలిసింది. గోవాలోని నౌకాదళ సిబ్బంది తో ప్రధాని దీపావళి వేడుకలు జరుపుకోనున్నట్లు సంబంధిత వర్గాలు తాజాగా వెల్లడించాయి. పహల్గాం దాడికి ప్రతీకారంగా చేపట్టిన ఆపరేషన్ సిందూర్ లో భారత్ సాధించిన విజయాన్ని నౌకాదళ సిబ్బందితో జరుపుకోనున్నట్లు పేర్కొన్నాయి. 2014లో ప్రధానిక పదవి చేపట్టినప్పటి నుంచి మోదీ సాయుధ దళాల సిబ్బందితో దీపావళిని సెలబ్రేట్ చేసుకుంటున్నారు. 2014లో ఆయన లడఖ్‌లోని సియాచిన్ హిమానీనదానికి వెళ్లి అక్కడ గస్తీలో ఉన్న జవాన్లతో వేడుకలు జరుపుకున్నారు. 2015లో పంజాబ్‌లోని అమృత్‌సర్‌లోని డోగ్రాయ్ యుద్ధ స్మారక చిహ్నాన్ని సందర్శించారు. అక్కడ 1965 ఇండోపాక్ యుద్ధంలో అమరులైన జవాన్లకు నివాళులర్పించారు. 2016లో హిమాచల్ ప్రదేశ్‌లోని సుమ్దోలోగల భారత్‌చైనా సరిహద్దు సమీపంలో భద్రతా దళం, సైనిక సిబ్బందిని కలిశారు. 2017లో జమ్ము కశ్మీర్‌లోని గురెజ్ సెక్టార్‌లో, 2018లో ఉత్తరాఖండ్‌లోని ఇండోటిబెటన్ బోర్డర్ పోలీసు సిబ్బందితోను, 2019లో జమ్ము కశ్మీర్‌లోని రాజౌరిలో గల సైనికులతోను దీపావళి వేడుకలు జరుపుకున్న మోడీ 2020లో రాజస్థాన్‌లోని జైసల్మేర్‌లోను, 2021లో జమ్ము కశ్మీర్‌లోని నౌషెరాలోను, 2022లో కార్గిల్, 2023లో చైనా సరిహద్దులోని లేప్చా (హిమాచల్‌ప్రదేశ్) సైనిక శిబిరంలో వేడుకలు చేసుకున్నారు. 2024లో కచ్‌లోని సర్ క్రీక్ ప్రాంతంలో విధులు నిర్వర్తిస్తున్న సరిహద్దు భద్రతా దళం, ఆర్మీ, నేవీ, వాయుసేన సిబ్బందిని కలిసి వారితో వేడుకలు చేసుకున్నారు.



# గుజరాత్ రాజకీయాల్లో భారీ కుదుపు

## కేబినెట్ మొత్తం రాజీనామా.. ఆమోదించిన గవర్నర్

## నేడు రాజ్‌భవన్‌లో కొత్త మంత్రివర్గం ప్రమాణస్వీకారం

## తాజా కేబినెట్‌లో క్రికెటర్ జడేజా భార్యకు ప్రమోషన్!

**అమ్మాదాబాద్, అక్టోబరు 17:** గుజరాత్ రాష్ట్ర రాజకీయాల్లో అనూహ్యపరిణామాలు. రాష్ట్రంలో కొత్త కేబినెట్ శుక్రవారం కొలువు దీరనుంది. ఈ క్రమంలో గురువారం ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్ మినహా మిగిలిన 16 మంది మంత్రులు తమ పదవులకు రాజీనామా చేశారు. కేబినెట్ పునర్వ్యవస్థీకరణకు మార్గం సులువు చేసేందుకు మంత్రులు రాజీనామాలుచేసారు. గత కొన్ని రోజులుగా కేబినెట్ విస్తరణ ప్రచారం జోరుగా సాగుతోంది. ఈ క్రమంలోనే గురువారం ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్ నివాసంలో మంత్రులు సమావేశం అయ్యారు. బీజేపీ రాష్ట్ర, జాతీయ నాయకత్వం ఆదేశాల మేరకు మంత్రులు తమ పదవులకు రాజీనామా చేశారు. ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్ ఈ రాజీనామాలు అంగీకరించారు. అనంతరం గుజరాత్ గవర్నర్ ఆచార్య దేవవ్రత్‌కు రాజీనామాలు అందజేయగా ఆయన ఆమోదం తెలిపారు. దీంతో శుక్రవారం కొత్త కేబినెట్ కొలువుదీరనుంది . గుజరాత్‌లో కొత్త ప్రభుత్వం కొలువుదీరనుంది. ఈ మేరకు ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్ మినహా మిగిలిన మంత్రులు అంతా తమ పదవులకు రాజీనామా చేశారు. గత కొంతకాలంగా గుజరాత్‌లో కేబినెట్ విస్తరణ ఉంటుంది అని అంతా భావించారు. అయితే దీపావళి పండుగకు ముందే ఈ విస్తరణ ఉంటుందని ఊహించ లేదు. ఈ విస్తరణలో కొత్త ము ఖాలు, యువ నాయకులు, ప్రాంతీయసామాజిక సమతుల్యతకు ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. అలాగే ఓబిసి పాటిదార్ సమతుల్యత, సౌరాష్ట్రఉత్తర గుజరాత్ ప్రాంతాలకు ప్రాధాన్యం ఇచ్చే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. మరోవైపు రవీంద్ర జడేజా భార్య, జామ్‌నగర్ ఎమ్ఎల్‌ఏ రీవా జడేజాకు కేబినెట్ ర్యాంక్ ప్రమోషన్ ఇవ్వనున్నారనే ప్రచారం జరుగుతుంది. అలాగే ప్రస్తుతం రాజీనామా చేసిన మంత్రుల్లో కొందరికి కొత్త కేబినెట్‌లో ఛాన్స్ ఉండే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. 2027 అసెంబ్లీ ఎన్నికలే టార్గెట్‌గా ఈ విస్తరణ జరుగుతోంది. ఎందుకంటే 2027లో గుజరాత్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. మధ్యలో మున్సిపల్ కార్పొరేషన్లు, పంచాయతీ ఎన్నికలు జరగనున్నాయి. ఈ క్రమంలో రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు జగదీష్ విశ్వకర్మ సూచనల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. 2027 అసెంబ్లీ ఎన్నికలు, లోకల్ బాడీ పోల్స్‌కు ముందుగా పార్టీ బలాన్ని పెంచే ఉద్దేశ్యంతో ఈ కేబినెట్ విస్తరణ జరుగుతుంది అని తెలుస్తోంది. ప్రస్తుత మంత్రివర్గం ముఖ్యమంత్రి సహా 17 మందితో ఉన్నారు. గుజరాత్ చరిత్రలో అతి చిన్న మంత్రివర్గం ఇదే కావడం విశేషం. 182 సభ్యుల శాసనసభ పరిధిలో 27 మంది వరకు మంత్రులు ఉండవచ్చు. కానీ 17 మందితోనే మంత్రివర్గం ఏర్పడింది. మంత్రివర్గంలో ఈసారి దాదాపు 10 మంది కొత్త వారికి అవకాశం లభించవచ్చని తెలుస్తోంది. ప్రస్తుతం ఉన్న మంత్రుల్లో దాదాపు సగం మందిని మార్చే అవకాశం ఉందని సమాచారం. ప్రస్తుతం గుజరాత్ మంత్రివర్గంలో ముఖ్యమంత్రితో సహా మొత్తం 17 మంది మంత్రులు ఉన్నారు. వీరిలో ఎనిమిది మంది క్యాబినెట్ ర్యాంకు మంత్రులు కాగా మిగిలిన వారు సహాయ మంత్రులుగా కొనసాగుతున్న సంగతి తెలిసిందే. ఈ సారి 22 నుంచి 27 మందికి మంత్రులకు అవకాశం కల్పించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. రాజ్ భవన్‌లో శుక్రవారం నూతన మంత్రివర్గం ప్రమాణ స్వీకారం చేయనుంది.

ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్ మంత్రివర్గాన్ని శుక్రవారం విస్తరించనున్నారు. మంత్రివర్గ విస్తరణకు అధ్యక్షుడు జెపీ నడ్డా, అమిత్ షా, మాజీ రాష్ట్ర అధ్యక్షుడు సీ.ఆర్. పాటిల్, ప్రధాన కార్యదర్శి సునీల్ బన్సల్ వంటి సీనియర్ నేతలు హాజరవుతారు.

# యెమెన్‌లో నిమిషప్రియ హత్యకేసులో స్టే కొనసాగుతోంది

## సుప్రీంకోర్టుకు నివేదించిన కేంద్రం



**న్యూఢిల్లీ, అక్టోబరు 17:** యెమెన్ మరణశిక్షను ఎదుర్కొంటున్న భారత నర్సు నిమిష ప్రియకు శిక్ష అమలుపై స్టే కొనసాగుతున్నదని గురువారం కేంద్రం సుప్రీంకోర్టుకు నివేదించింది. ఈ కేసులో ఇప్పటివరకు ఎలాంటి తీవ్ర పరి ణామాలు చోటుచేసుకోకపోవడం గమనార్హమని పేర్కొంది. భారతీయ నర్సు నిమిష ప్రియను కాపాడేందుకు కేంద్ర ప్రభుత్వం దౌత్యమార్గాలను ఉపయోగించేలా ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు విచారిస్తోంది. తాజాగా ఆ మరణశిక్ష గురించి ప్రశ్నించింది. ఆమెకు చట్టపరమైన సహకారం అందిస్తున్న 'సేవ్ నిమిషప్రియ ఇంటర్నేషనల్ యాక్షన్ కౌన్సిల్' తరఫు న్యాయవాది స్పందిస్తూ శిక్ష అమలుపై స్టే కొనసాగుతోందని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం తరఫున అటార్నీ జనరల్ వెంకట రమణి మాట్లాడుతూ ప్రస్తుతం ఈ కేసులోకి కొత్త మధ్యవర్తి వచ్చారని, ఇప్పటివరకు ఈ కేసులో తీవ్రమైన పరిణామాలు చోటుచేసుకోక పోవడం మంచి విషయమని అన్నారు. వాదనలు విన్న అత్యున్నత న్యాయస్థానం కేసును జనవరికి వాయిదా వేసింది. అయితే ఏవైనా అత్యవసర పరిస్థితులు ఉంటే ముందస్తు లిస్టింగ్ కోసం దరఖాస్తు చేసుకునే వెసులుబాటు కల్పించింది. కాగా నిమిష ప్రియ నర్సింగ్ కోర్సు పూర్తిచేసిన తర్వాత 2008లో యెమెన్ వెళ్లి అక్కడే ఉద్యోగంలో చేరారు. ఆ దేశ నిబంధనల ప్రకారం స్థానిక వ్యక్తి తలాల్ అదిబ్ మెహది భాగస్వామ్యంతో అల్‌అమన్ మెడికల్ కౌన్సిల్ సెంటర్‌ను ప్రారంభించారు. తర్వాత ఆ వ్యక్తి ప్రియను వేధించి, పాస్‌పోర్ట్, ఇతర పత్రాలను లాక్కొన్నాడన్న ఆరోప ణలు ఉన్నాయి. 20 16లో అతడిపై ప్రియ పోలీసులకు కూడా ఫిర్యాదు చేసింది. వారు ఆమెను పట్టించుకోలేదు. దాంతో 2017లో మెహదికి మత్తుమందు ఇచ్చి అతడి వద్ద ఉన్న తన పాస్‌పోర్టును స్వాధీనం చేసుకోవాలని భావించింది. కానీ ఆ డోస్ ఎక్కువకావడంతో అతడు చనిపోయాడు. ఆ తర్వాత మృతదేహాన్ని ఓ వాటర్ ట్యాంక్‌లో పారేసింది. చివరికి అక్కడినుంచి సౌదీకి వెళ్లిపోతుండగా సరిహద్దుల్లో ఆమెను అరెస్టు చేసి మరణశిక్ష విధించారు. భారత ప్రభుత్వం, మత పెద్దల ప్రయత్నాలతో ప్రస్తుతం ఆమె ఉరిశిక్ష స్టే కొనసాగుతోంది.

## కోర్టు హాలులో ఆన్‌లైన్‌లోనే మహిళకు కిస్ ఇచ్చిన లాయర్!

**న్యూఢిల్లీ, అక్టోబరు 17:** న్యాయస్థానంలో వృత్తిగత హుందాతనాన్ని ప్రదర్శించాల్సిన ఓ న్యాయవాది అనుచితంగా ప్రవర్తించిన ఘటన తీవ్ర వివాదాస్పదంగా మారింది. ఢిల్లీ హైకోర్టులో ఓ కేసు వర్చువల్ విచారణ సందర్భంగా కెమెరా ఆన్‌లో ఉండగానే ఆయన ఓ మహిళను ముద్దుపెట్టుకోవడం కలకలం రేపింది. ఇందుకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో, సదరు లాయర్ తీరుపై సర్వత్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ ఘటన మంగళవారం చోటుచేసుకుంది. ఆన్‌లైన్ విచారణ కోసం అందరూ లాగిన్ అయి న్యాయమూర్తి రాక కోసం ఎదురుచూస్తున్న సమయంలో కోర్టు దుస్తుల్లో ఉన్న ఆ లాయర్, తన కెమెరాకు కొద్దిగా పక్కకు కూర్చుని ఉన్నారు. ఆ సమయంలోముందు నిల్చుని ఉన్న మహిళ చేతిని ముద్దుపెట్టడం వీడియోలో స్పష్టంగా రికార్డయింది.

# మత్తుమందిచ్చి డాక్టర్ భార్యను హత్యచేసిన వైద్యుడు



**బెంగళూరు, అక్టోబరు 17:** వైద్య వృత్తిని అడ్డం పెట్టుకుని, కట్టుకున్న భార్యను హతమార్చిన ఓ వైద్యుడి కిరాతకం బెంగళూరులో వెలుగులోకి వచ్చింది. అనారోగ్యంతో చనిపోయిందని అందరినీ నమ్మించినా, ఆరు నెలల తర్వాత ఫోరెన్సిక్ నివేదిక అసలు నిజాన్ని బయటపెట్టడంతో నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. బెంగళూరులోని విక్టోరియా ఆస్పత్రిలో జనరల్ సర్జన్‌గా పనిచేస్తున్న డాక్టర్ మహేంద్ర రెడ్డి, డెర్మటాలజిస్ట్ అయిన డాక్టర్ కృతిక రెడ్డి భార్యాభర్తలు. వీరికి గత ఏడాది మే 26న వివాహం జరిగింది. అయితే, ఈ ఏడాది ఏప్రిల్ 21న మున్నెకొల్లాల్‌లోని వారి నివాసంలో కృతిక అస్వస్థతకు గురయ్యారని చెబుతూ ఆమె భర్త మహేంద్ర రెడ్డే దగ్గరలోని ఆస్పత్రికి తరలించారు. అప్పటికే ఆమె మృతి చెందినట్లు అక్కడి వైద్యులు ధ్రువీకరించారు. దీంతో మరాఠహళ్లి పోలీసులు తొలుత అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. ఘటనా స్థలంలో క్రైమ్ ఆఫీసర్లు తనిఖీ చేయగా, ఓ కానిలా సెట్, ఇంజెక్షన్ ట్యూబ్ వంటి వైద్య పరికరాలు లభించాయి. వాటిని ఫోరెన్సిక్ విశ్లేషణ కోసం పంపించారు. మృతురాలి అంతర్గత అవయవాల నమూనాలను కూడా ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబొరేటరీకి (ఎఫ్ఎస్ఎల్) పంపగా, అసలు విషయం వెలుగులోకి వచ్చింది. ఎఫ్ఎస్ఎల్ నివేదికలో కృతిక శరీరంలో ప్రోపోఫాల్ అనే శక్తిమంతమైన అనస్థీషియా (మత్తు) మందు ఆనవాళ్లు ఉన్నట్లు తేలింది. దీంతో ఇది హత్యేనని నిర్ధారణ కావడంతో మృతురాలి తండ్రి అక్టోబర్ 13న తన అల్లుడే మత్తుమందు ఇచ్చి కూతురిని చంపాడని ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు ఆధారంగా పోలీసులు వేగంగా స్పందించి, అక్టోబర్ 14న కర్ణాటకలోని మణిపాల్‌లో ఉన్న నిందితుడు మహేంద్ర రెడ్డిని అరెస్ట్ చేశారు. ఈ ఘటనపై బెంగళూరు పోలీస్ కమిషనర్ సీమంత్ కుమార్ సింగ్ మాట్లాడుతూ భార్యను ఆసుపత్రికి తీసుకొచ్చిన భర్త, ఆమెకు మత్తు మందు ఇచ్చిన విషయాన్ని దాచిపెట్టాడు. ఆమె ఆరోగ్యం బాగోలేదని మాత్రమే చెప్పాడు. ఇప్పుడు ఆమె శరీరంలో మత్తుమందు ఆనవాళ్ల బయటపడటంతో, ఇందులో దురుద్దేశం ఉన్నట్లు స్పష్టమైంది. ఈ కోణంలో లోతుగా దర్యాప్తు చేస్తున్నాం అని తెలిపారు. ప్రస్తుతం నిందితుడు పోలీస్ కస్టడీలో ఉన్నాడు. వైద్య పరిజ్ఞానాన్ని ఉపయోగించి హత్యను సహజ మరణంగా చిత్రీకరించేందుకు నిందితుడు ప్రయత్నించాడని పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ ఘటన వైద్య వర్గాల్లో తీవ్ర కలకలం రేపింది.

# చిన్నారుల యాంటిబయాటిక్ సిరప్‌లో పురుగులు



**భోపాల్, అక్టోబరు 17:** ప్రభుత్వ ఆసుపత్రిలో ఇచ్చిన పిల్లల యాంటీబయాటిక్ సిరప్‌లో పురుగులు కనిపించాయి. ఇది చూసి ఒక చిన్నారి తల్లి షాక్ అయ్యింది. ఆ యాంటీబయాటిక్ సిరప్ బాటిల్‌ను ఆసుపత్రికి తీసుకువచ్చి ఫిర్యాదు చేసింది. ఈ నేపథ్యంలో ఆ సిరప్ స్టాక్‌ను సీజ్ చేశారు. మధ్యప్రదేశ్‌లోని గ్వాలియర్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. ఇన్ఫెక్షన్‌తో బాధపడుతున్న ఒక చిన్నారిని మోరార్‌లోని ప్రభుత్వ ఆసుపత్రికి తల్లి తీసుకెళ్లింది. పరీక్షించిన డాక్టర్, అజిత్రోమైసిన్ యాంటీబయాటిక్ సిరప్ సూచించగా ఆసుపత్రి సిబ్బంది ఆ మందు ఇచ్చారు. ఇంటికి చేరుకున్న తర్వాత చిన్నారికి మందు వేసేందుకు అజిత్రోమైసిన్ సిరప్ మూతను ఆ మహిళ తెరిచింది. ఆ యాంటీబయాటిక్ సిరప్‌లో పురుగులు కనిపించడంతో ఆమె షాక్ అయ్యింది. వెంటనే ఆ సిరప్ బాటిల్ తీసుకుని మోరార్‌లోని ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లింది. తెరిచిన అజిత్రోమైసిన్ సిరప్ బాటిల్‌ను ఆసుపత్రికి సిబ్బందికి చూపించింది. ఈ సంఘటన కలకలం రేపింది. మరోవైపు ఈ విషయం తెలిసిన వెంటనే డ్రగ్ ఇన్‌స్పెక్టర్ అనుభూతి శర్మ స్పందించారు. మధ్యప్రదేశ్‌లోని ఒక ఔషధ కంపెనీ ఆ అజిత్రోమైసిన్ సిరప్ తయారు చేసినట్లు తెలిపారు. మోరార్‌లోని ప్రభుత్వ ఆసుపత్రికి సరఫరా చేసిన ఆ యాంటీబయాటిక్ సిరప్ బాటిల్స్‌లో స్టాక్ ఉన్న 306 బాటిళ్లను రీకాల్ చేసినట్లు చెప్పారు. కొన్ని సిరప్ బాటిల్స్ పరిశీలించగా వాటిలో పురుగు అవశేషాలు లేవని డ్రగ్ ఇన్‌స్పెక్టర్ అనుభూతి శర్మ తెలిపారు. అయితే టెస్టింగ్ కోసం కొన్ని మందు సీసాలను భోపాల్‌లోని ల్యాబ్‌కు పంపినట్లు చెప్పారు. ఈ ఔషధం నమూనాలను కోల్‌కతాలోని సెంట్రల్ డ్రగ్ లాబొరేటరీకి కూడా పంపనున్నట్లు ఆమె వెల్లడించారు. మరోవైపు మధ్యప్రదేశ్‌లోని చింద్వారా జిల్లాలో కోల్డ్‌రిఫ్ దగ్గు సిరప్ వల్ల కిడ్నీలు పాడైన కారణంగా 24 మంది పిల్లలు మరణించారు. మరింత మంది అనారోగ్యం పాలయ్యారు. ఈ సంఘటన దేశవ్యాప్తంగా కలకలం రేపింది. ఈ నేపథ్యంలో తాజాగా పిల్లల యాంటీబయాటిక్ సిరప్‌లో పురుగులు కనిపించిన సంఘటన ఆందోళన కలిగిస్తున్నది.

# పాక్ సైనిక దుస్తులను బహిరంగ ప్రదర్శనకు పెట్టిన తాలిబన్లు!




**కాబూల్, అక్టోబరు 17:** పాకిస్థాన్, అఫ్ఘనిస్థాన్ మధ్య ఉద్రిక్తతలు తారస్థాయికి చేరాయి. సరిహద్దుల్లో భీకర ఘర్షణల నేపథ్యంలో, పట్టుబడిన పాకిస్థాన్ సైనికుల ప్యాంట్లు, రైఫిళ్లను ఆఫ్ఘన్ సైనికులు, తాలిబన్ అనుబంధ మిలీషియా సభ్యులు ఆఫ్ఘన్ నగర వీధుల్లో ప్రదర్శిస్తూ అవమానపరిచారు. కార్ల మీద నిలబడి, స్వాధీనం చేసుకున్న వస్తువులను ప్రదర్శిస్తున్న దృశ్యాలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ముఖ్యంగా తూర్పు నంగర్‌హార్ ప్రావిన్స్‌లో ఈ ప్రదర్శన జరిగినట్లు ఆఫ్ఘన్ జర్నలిస్ట్ దావూద్ జునబిష్ 'ఎక్స్' వేదికగా ఒక ఫొటోను పంచుకున్నారు. "డ్యూరాండ్ లైన్ వద్ద పాకిస్థాన్ సైన్యం విడిచిపెట్టిన సైనిక పోస్టుల నుంచి స్వాధీనం చేసుకున్న ఖాళీ ప్యాంట్లను ప్రదర్శించారని ఆయన ఆ ఫొటోకు క్యాప్షన్ జతచేశారు. ఈ వీడియోల ప్రామాణికతను స్వతంత్రంగా ధ్రువీకరించలేనప్పటికీ, ఇవి ఇరు దేశాల మధ్య నెలకొన్న తీవ్రమైన వైషమ్యాలకు అద్దం పడుతున్నాయి. ఆశ్చర్యకరంగా, ఇరు దేశాల మధ్య బుధవారం నుంచి 48 గంటల కాల్పుల విరమణ ఒప్పందం అమల్లోకి వచ్చినప్పటికీ ఈ ప్రదర్శనలు జరగడం గమనార్హం. సరిహద్దుల్లో జరిగిన ఘర్షణల్లో ఇరువైపులా డజన్ల కొద్దీ సైనికులు, పౌరులు మరణించడంతో ఈ ఒప్పందం కుదిరింది. అయితే కాల్పుల విరమణకు ఎవరు ముందు ప్రతిపాదించారనే దానిపై కూడా ఇరు దేశాలు పరస్పరం భిన్నమైన ప్రకటనలు చేశాయి. తహ్రీక్‌ఎతాలిబన్ పాకిస్థాన్ (టీటీపీ) నాయకుడిని లక్ష్యంగా చేసుకుని కాబూల్‌లో పాకిస్థాన్ వైమానిక దాడులు చేయడంతో ఇటీవలి ఘర్షణలు మొదలయ్యాయి. టీటీపీకి అఫ్ఘనిస్థాన్ ఆశ్రయం ఇస్తోందని పాక్ ఆరోపిస్తోంది. దీనికి ప్రతీకారంగా, ఆఫ్ఘన్ దళాలు డ్యూరాండ్ లైన్ వెంబడి పాక్ సరిహద్దు పోస్టులపై దాడులు చేశాయి. మరోవైపు, ఇస్లామిక్ స్టేట్ ఖోరాసన్ గ్రూప్ (ఐఎస్‌కే) దాడులకు పాక్ సైన్యం సహకరిస్తోందని అఫ్ఘనిస్థాన్ ఎదురుదాడి చేస్తోంది. ఈ ఘర్షణల్లో డజన్ల కొద్దీ శత్రు సైనికులను మట్టుబెట్టినట్లు ఇరుపక్షాలు ప్రకటించుకున్నాయి. పాక్ దాడుల్లో ఆఫ్ఘన్ పౌరులు లక్ష్యంగా మారారని తాలిబన్లు ఆరోపించారు. తమ దేశం ఉగ్రవాద బాధితురాలని, దాడుల సమయంలో పౌర నష్టం జరగవచ్చని పాకిస్థాన్ రక్షణ మంత్రి ఖావాజా ఆసిఫ్ గతంలోనే హెచ్చరించారు. 58 మందికి పైగా పాక్ సైనికులు మరణించారని, వందల మందిని బందీలుగా పట్టుకున్నామన్నారు.

# సంక్షిప్తంగా..

## వెనుజులాలో సిఐఏ రహస్య ఆపరేషన్‌కు ట్రంప్ గ్రీన్ సిగ్నల్



**వాషింగ్టన్, అక్టోబరు 17:** అమెరికాలోకి అక్రమంగా మాదకద్రవ్యాలు రావడంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మొదటి నుంచి ఆగ్రహం వ్యక్తం చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే కరేబియన్ సముద్రంలో మాదకద్రవ్యాల అక్రమ రవాణా పడవలపై ఇటీవల అమెరికా సైన్యం పలుమార్లు దాడులు చేసింది. ఈ నేపథ్యంలో ట్రంప్ కీలక విషయం బయటపెట్టారు. వెనుజులాలో రహస్య కార్యకలాపాలు నిర్వహించేందుకు తాను సిఐఏకు అధికారికంగా అనుమతిచ్చినట్లు తెలిపారు. బుధవారం ఓవెల్ కార్యాలయంలో మాట్లాడుతూ ఈ నిర్ణయం ఎందుకు తీసుకున్నారనే దానిపై స్పష్టతనిచ్చారు. వెనుజులా నుంచి పెద్ద మొత్తంలో మాదక ద్రవ్యాలు వస్తున్నా యన్నారు. సముద్రం ద్వారా వస్తున్న వాటిని అడ్డుకోవడంతోపాటు ఆ దేశ ప్రజలు ఇక్కడ నేరాలకు పాల్పడి యు ఎస్ జైళ్లలో ఉంటున్నారన్నారు. ఈ క్రమంలో వారు మరిన్ని దాడులకు ప్రణాళికలు చేస్తున్నట్లు తెలిపారు.

## సిఎం పదవి ఇస్తానన్నా వద్దన్నా: రామ్‌దేవ్‌బాబా



**న్యూఢిల్లీ, అక్టోబరు 17:** యోగా గురు బాబా రాందేవ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. తనకు ముఖ్యమంత్రి పదవిని చేపట్టే అవకాశం వచ్చినా, పదవులపై ఆసక్తి లేకపోవడంతో దానిని సున్నితంగా తిరస్కరించానని వెల్లడించారు. దేశానికి సేవ చేయడమే తన ఏకైక లక్ష్యమని, అధికారం, కీర్తి ప్రతిష్ఠలపై తనకు ఏమాత్రం వ్యామోహం లేదని స్పష్టం చేశారు. రిపబ్లిక్ మీడియా నెట్‌వర్క్ నిర్వహించిన రాష్ట్ర సర్వోపరి సమ్మేళన్ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ నాకు ముఖ్యమంత్రి పదవి ఇస్తామని ఆఫర్ చేశారు. నా వాళ్లను రాజ్యసభకు పంపమని, సొంతంగా పార్టీ పెట్టమని కూడా చాలామంది అడిగారు. కానీ నాకు అధికారంపై ఆశ లేదు. నా జీవితంలో ఒకే ఒక్క లక్ష్యం ఉంది, అది భరతమాతకు సేవ చేయడ మేనని రాందేవ్ తెలిపారు. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీని ఆయన ఉదాహరణగా చూపారు. ఏదో ఒకటి అవ్వాలని కాకుండా, దేశం కోసం ఏదైనా చేయాలని ఆలోచించండి.

## కర్ణాటకలో టెన్త్‌పాస్‌కు 33 మార్కులే!

**బెంగళూరు, అక్టోబరు 17:** పదో తరగతి విద్యార్థులకు కర్ణాటక ప్రభుత్వం వెసులుబాటు కల్పించింది. పబ్లిక్ పరీక్షలో పాస్ మార్కులు తగ్గిస్తున్నట్లు ప్రకటించింది. ఇకపై ప్రతీ సబ్జెక్ట్‌లో 33 మార్కులు తెచ్చుకుంటే పాస్ చేయాలని ఉత్తర్వులు జారీ చేసింది. ఒకటీ అరా మార్కులతో పదో తరగతి ఫెయిల్ అయిన విద్యార్థులు ఉన్నత చదువులకు దూరమవుతున్నారని, దీనిని నివారించేందుకే ఈ నిర్ణయం తీసు కున్నామని కర్ణాటక మంత్రి మధు బంగారప్ప పేర్కొన్నారు. గతేడాది వరకు పదో తరగతిలో పాస్ కావాలంటే ప్రతి సబ్జెక్ట్‌లో తప్పనిసరిగా 35 శాతం మార్కులు తెచ్చు కోవాల్సిందే. ఒకటీ అరా మార్కులతో ఫెయిలైన విద్యార్థి తిరిగి సప్లిమెంటరీ పరీక్షల కోసం వేచి ఉండాలి. ఈ గ్యాప్‌లో విద్యార్థులను వారి తల్లి దండ్రులు పనికి పంపించడం, ఆడపిల్లలైతే పెళ్లి చేసి పంపించడం చేస్తున్నారని ప్రాథమిక విద్యాశాఖ మంత్రి బంగారప్ప చెప్పారు. ఆ తర్వాత పిల్లలు చదువుకు శాశ్వతంగా దూరమవుతున్నారని తెలిపారు. దీనిని తప్పించేందుకు పాస్ మార్కులను 33 కు తగ్గిస్తున్నట్లు పేర్కొన్నారు.

## చైనా కరెన్సీలో భారత్ చెల్లింపులు: రష్యా డిప్యూటీ పిఎం



**మాస్కో, అక్టోబరు 17:** రష్యా చమురు కొనుగోళ్లకు చైనా కరెన్సీ యువాన్‌లో భారత్ చెల్లింపులు చేస్తోంది. ఈ విషయాన్ని రష్యా ఉప ప్రధాని అలెగ్జాండర్ నొవాక్ వెల్లడించారు. అయితే అది స్వల్ప మొత్తంలోనేనని, ఎక్కువ శాతం లావాదేవీలు రూబుల్స్‌లోనే జరుగుతున్నాయని స్థానిక మీడియా సంస్థతో మాట్లాడారు. రష్యా చమురుకు భారత్ రెండో అతిపెద్ద కొనుగోలుదారుగా ఉన్న సంగతి తెలిసిందే. ఉక్రెయిన్‌పై రష్యా సైనిక చర్య ప్రారంభించిన తర్వాత ఈ చమురు కొనుగోళ్లు భారీగా పెరిగాయి. దాంతో రష్యాపై పాశ్చాత్య దేశాలు ఆంక్షలు విధించిన సంగతి తెలిసిందే. అప్ప టి నుంచి వ్యాపారలావా దేవీల కోసం ప్రత్యా మ్నాయ కరెన్సీలు యు వాన్, యుఎఇ, దిరమ్ వాడకం పెరిగింది. ఇదిలా ఉంటే.. సెప్టెం బరులో రష్యా నుంచి చమురు కోసం భారత్ 2.5 బిలియన్ యూరోలను వెచ్చించింది. అంతకుముందు నెలతో పోలిస్తే అది 14 శాతం తక్కువ కావడం గమనార్హం.



# ఇంకా కొలిక్కిరాని 'సర్దుబాట్లు'!

### - లాలూకు రాహుల్ ఫోన్ - 61 సీట్లిచ్చేందుకు ఆర్‌జెడి ఓకే? - మహాకూటమి నేడు ఆధికారిక ప్రకటన

### - 16మందితో కాంగ్రెస్ తొలి జాబితా - బిజెపి - జెడియు అభ్యర్థులు ఫైనల్ - 40మంది బిజెపి స్టార్ క్యాంపెయినర్లు

**పాట్నా, అక్టోబరు 17:** బీహార్ మాజీ ముఖ్యమంత్రి, ఆర్‌జెడి అధినేత లాలూ ప్రసాద్ యాదవ్‌కు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ గురువారం ఉదయం ఫోన్ చేశారు. మహా కూటమిలో సీట్ల సర్దుబాటు అంశంపై ఇరువురు సమాలోచనలు జరిపినట్లు సమాచారం. కాంగ్రెస్ పార్టీ బీహార్ శాఖ కోరినట్లు 70-75 సీట్లు ఇచ్చేందుకు ఆర్‌జెడి సుముఖంగా లేదని, కాదు కూడదంటే 60-16 స్థానాలు కేటా యిస్తామని ఆ పార్టీ అగ్రనేతలు లాలూ, తేజస్వి తేల్చిచెప్పారు. ఈ నేపథ్యంలో లాలూకు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ ఫోన్ చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది. మొత్తమ్మీద సీట్ల సర్దుబాటుకు సంబంధించిన చర్చలు తుదిదశకు చేరుకున్నాయని, శుక్రవారం అధికారికంగా ప్రకటన చేయనున్నట్లు కాంగ్రెస్ పార్టీ వర్గాలు తెలిపాయి. ఇండియా కూటమిలో ఎలాంటి విభేదాలు లేవని కాంగ్రెస్ నేత పవన్ ఖేరా స్పష్టం చేశారు. మరోవైపు కాంగ్రెస్ పార్టీ 16 మంది అభ్యర్థులతో తొలి జాబితాను విడుదల చేసింది. ఇందులో సిట్టింగ్ స్థానాలే అధికంగా ఉన్నాయి. ఇక లాలూ తనయుడు, జన్‌శక్తి జనతా దళ్ అధ్యక్షుడు తేజ్ ప్రతాప్ యాదవ్ మహువ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్నారు. ఈ మేరకు గురువారంనాడు నామినేషన్ దాఖలు చేశారు. తేజ్‌ప్రతాప్‌కు తన సంపూర్ణ మద్దతు ఉంటుందని పేర్కొంటూ సోదరి రోహిణి ఆచార్య సోషల్ మీడియా వేదికగా శుభాకాంక్షలు తెలియజేశారు. అటు ఎన్‌డియేలోని ప్రధాన భాగస్వామ్య పార్టీలు బిజెపి-జెడియు తమకు కేటాయించిన చెరో 101 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించేశాయి. బిజెపి తొలి జాబితాలో 71, రెండో జాబితాలో 12 మంది అభ్యర్థుల పేర్లు ప్రకటించగా, మూడో జాబితాలో మిగిలిన 18 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించింది. అలాగే జెడియు గురువారంనాడు మిగిలిన 44 స్థానాలకు తమ పార్టీ అభ్యర్థుల పేర్లతో జాబితా విడుదల చేసింది. మొత్తమ్మీద జెడియు ఒబిసి-37, ఇబిసి-22, జనరల్-22, ఎస్‌సి-15, ఎస్‌టి-1, ముస్లిం 4 స్థానాలకు కేటాయించింది. సిఎం నితీశ్ కుమార్ ఎన్నికల ప్రచారాన్ని అధికారికంగా ప్రారంభించారు. గురువారంనాడు పలు నియోజకవర్గాలలో ర్యాలీలు, కార్నర్ మీటింగ్‌లు నిర్వహించారు. అలాగే రాష్ట్రీయ లోక్‌మోర్చా తమకు కేటాయించిన ఆరు స్థానాలకు అభ్యర్థులను ప్రకటించింది. బీహార్ అసెంబ్లీ ఎన్నికల ప్రచారానికి సంబంధించి భారతీయ జనతా పార్టీ ప్రధానమంత్రి నరేంద్రమోడీ, ఆ పార్టీ అగ్రనేతలు అమిత్ షా, జెపి నడ్డా సహా 40 మందితో స్టార్ క్యాంపెయినర్ల జాబితాను ఎన్నికల అధికారులకు అందజేసింది. బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో థర్డ్ ఫ్రంట్ ఏర్పాటైంది. ఎంఐఎం అధినేత అసదుద్దీన్ నేతృత్వంలో కొత్త కూటమి ఏర్పాటైంది.

మూడో కూటమిలో ఎంఐ ఎంతో పాటు ఆజాద్ సమాజ్ పార్టీ, రాష్ట్రీయ లోక్ జన్‌శక్తి పార్టీ, తేజ్‌ప్రతాప్ నేతృత్వంలోని జెజెడిలతో కూటమిగా ఏర్పడ్డాయి.

## బ్రహ్మంగారి సన్నిధిలో ఎర్రచందనం టాస్క్ ఫోర్స్ ఎస్పీ శ్రీనివాసులు



**బ్రహ్మంగారిమఠం (జర్నలిస్ట్ ఫైల్):** జగద్గురు శ్రీమద్విరాట్ పోతులూరు శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వాముల వారిని తిరుపతి ఎర్రచందనం టాస్క్ ఫోర్స్ ఎస్పీ శ్రీనివాసులు కుటుంబ సమేతంగా బ్రహ్మంగారిని దర్శించుకున్నారు. వారికి ఆలయ యాజమాన్యం ప్రత్యేక స్వాగతం పలికి బ్రహ్మంగారికి ప్రత్యేక పూజలు చేపట్టారు అనంతరం పూలమాల తో సత్కరించారు బ్రహ్మంగారి కాలజ్ఞానం జీవిత చరిత్ర గురించి ఆలయ అర్చకులు జీవిత చరిత్ర గురించి వివరించారు తీర్థప్రసాదాలు అందజేశారు అదేవిధంగా శ్రీ జగన్మాత ఈశ్వరి దేవి ఆలయాన్ని దర్శించుకున్నారు ఆయనకు ప్రత్యేక స్వాగతం పలికి ఈశ్వరి దేవి ప్రత్యేక పూజలు చేపట్టారు అనంతరం తీర్థ ప్రసాదాలను అందజేశారు వీరి వెంట బిమఠం ఎస్సై శివప్రసాద్ పోలీస్ సిబ్బంది ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

## శ్మశాన వాటికల అభివృద్ధికి ప్రణాళిక



- నగరంలోని శ్మశాన వాటికలను పరిశీలించిన గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్

**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్) :** శ్మశాన వాటికల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రణాళికలు రూపొందిస్తున్నామని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ అన్నారు. శుక్రవారం స్థానిక ఆనంద్ పేట, పాత గుంటూరు, ఎల్ఆర్ కాలనీ శ్మశాన వాటికలు ఎమ్మెల్యే నసీర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో కనీసం శ్మశాన వాటికలను కూడా పట్టించుకోలేదని విమర్శించారు. వర్షాలు కురిస్తే శ్మశాన వాటికల్లోకి అడుగుపెట్టే పరిస్థితులు కూడా ఉండటం లేదన్నారు. ఈ నేపథ్యంలో నియోజకవర్గంలోని శ్మశాన వాటికలలో ఎలాంటి సౌకర్యాలు అవసరం ? ఎంత మేర నిధులు కావాలి ? అనే అంశాలపై ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని తెలిపారు. నియోజకవర్గంలో ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధి పనులు చేపడుతున్నామని చెప్పారు.

సీఎం చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే అన్ని రంగాల్లో అభివృద్ధి, సంక్షేమ పథకాలకు శ్రీకారం చుట్టామని తెలిపారు. అన్ని ప్రాంతాల్లో రోడ్లు, సీసీ డ్రెయిన్ల నిర్మాణాలు చేపట్టామని వెల్లడించారు. భారీ వర్షాల నేపథ్యంలో ఎన్నో ఏళ్లుగా లోతట్టు ప్రాంతాలు జలమయమవుతున్నాయని, సమస్య శాశ్వత పరిష్కారం వైపు అడుగులు వేస్తున్నామని తెలిపారు. మొండిగేటు వద్ద వెంట్ నిర్మాణాన్ని రానున్న వేసవిలో చేపడతామని వెల్లడించారు. దీంతో ముంపు ఉండబోదని స్పష్టం చేశారు. నియోజకవర్గంలో విద్య, వైద్యాన్ని పేదలకు చేరువ చేస్తున్నామని తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో వైద్యం చేయించుకున్న వారికి సీఎంఆర్ఎఫ్ ద్వారా భరోసా కల్పిస్తున్నామని వెల్లడించారు.

## మహిళలు అక్రమార్కుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

- త్రీటౌన్ సి ఐ ఎస్. సాంబశివరావు

**తెనాలి(జర్నలిస్ట్ ఫైల్):** విపణి వీధిలో బంగారు నగల ధరలు ఆకాశాన్ని అంటుతున్న క్రమంలో అక్రమ మార్గంలో ఆదాయం కోసం , బంగారు గొలుసులు తెచ్చుకు వెళ్ళే అక్రమార్కుల పట్ల మహిళలు అప్రమత్తంగా ఉండాలని త్రీ టౌన్ సిఐ ఎస్ సాంబశివరావు పేర్కొన్నారు. స్థానిక త్రీ టౌన్ పోలీస్ స్టేషన్లో శుక్రవారం సి ఐ, ఎస్ సాంబశివరావు మీడియాతొ మాట్లాడుతు పట్టణంలో గురువారం చైన్ స్నాకింగ్ ఉదంతం చోటు చేసుకుందని, అదే విదంగా గుంటూరులొ కుడా ఇదే తరహా చోరీ వెలుగు చూసిందని అన్నారు. బంగారం ధర మార్కెట్ లొ, చుక్కలు చూస్తున్నందున, అక్రమర్కులు అడ్డదారిలొ, ఆదాయం కోసం, బంగారు ఆభరణాలతొ ఉన్న మహిళలను లక్ష్యంగా చేసుకుని, చైన్ స్నాకింగ్ నేరాలకు పాల్పడే అవకాశం ఉన్నందున, ఇంటి నుండి బయటకు వచ్చిన మహిళలు అక్రమార్కుల పట్ల, అప్రమత్తంగా ఉండాలన్నారు. అనుమానిత వ్యక్తులు, తారస పడినప్పుడు వెంటనే, దగ్గరలోనిపోలీస్ స్టేషన్ కు సమాచారం ఇవ్వాలన్నారు.

## సమాజంలో న్యాయవాది పాత్ర కీలకం : ఎమ్మెల్సీ ఆలపాటి

- లీగల్ సెల్ క్రియాశీలక సేవలందించాలి



**తెనాలి(జర్నలిస్ట్ ఫైల్):** సమాజంలో న్యాయవాదుల పాత్ర కీలకమని,నియోజక వర్గ నూతన లీగల్ సెల్ విభాగం సమాజం పట్ల బాధ్యతగా, పార్టీ విధానాలకులోబడి పార్టీకి వన్నెతెచ్చె విధంగా పనిచేయాలని, నూతన కార్యవర్గానికి, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ అభినందనలు తెలిపారు. స్థానిక రాములింగేశ్వరపేటలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో శుక్రవారం, తెనాలి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ లీగర్ సెల్, నూతన కార్యవర్గ అభినందన సభ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ ముఖ్యఅతిథిగా పాల్గొని, నూతన లీగల్ సెల్ విభాగానికి అభినందనలు తెలిపారు. ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ సమాజంలో న్యాయవాదుల పాత్ర కీలకమైనదని అన్నారు. నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ లీగల్ సెల్ విభాగం, సమాజం పట్ల బాధ్యతగా పనిచేస్తూ, పార్టీ ప్రయోజనాలను కాపాడాలన్నారు. నియోజకవర్గ లీగల్ సెల్ అధ్యక్షులుగా ఇందుపల్లి రాజారాం, ఉపాధ్యక్షులుగా నన్నపనేని మాధవరావు, గడ్డిపాటి రాంబాబు, వల్లభనేని లలిత కుమారి, జనరల్ సెక్రెటరీగా తాడిశెట్టి వెంకటేశ్వరరావు, తదితరు కమిటీ సభ్యులు, పార్టీ నాయకులచే అభినందనలు అందుకున్నారు. లీగల్ సెల్ అధ్యక్షులు ఇందుపల్లి రాజారాం మాట్లాడుతూ తమకు లభించిన పదవి ద్వారా సమాజానికి మెరుగైన సేవ చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో తాడిబోయిన శ్రీనివాసరావు, మద్ది మల్లికార్జునరావు, మల్లిపెద్ది రవికుమార్, కంచర్ల విజయ్ కుమార్,చదలవాడ శ్రీనాద్, ఎన్. ఉమామహేశ్వరరావు, పరుచూరి శ్రీహరిప్రసాద్, జి. శ్రీనివాసరావు, కంచర్ల రవికుమార్ తదితర సభ్యులు పాల్గొన్నారు.

## ఈస్ట్ న్యాయవాదుల నూతన కమిటీ ఎన్నిక

- ప్రెసిడెంట్ గా కాలె దేవదాస్
- నూతన కమిటీకి ఎమ్మెల్యే నసీర్ అభినందనలు



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్) :** తెలుగుదేశం పార్టీ నేతలకు ఏ సమస్య వచ్చినా న్యాయపరంగా పోరాడేందుకు ముందుండాలని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ లెజిస్లేటివ్, వెల్ఫేర్ కమిటీ చైర్మన్ నసీర్ అన్నారు. గుంటూరు తూర్పు నియోజకవర్గ న్యాయవాదుల కమిటీని శుక్రవారం స్థానిక తూర్పు శాసనసభ్యుల వారి కార్యాలయంలో ప్రకటించారు. ఈ సందర్భంగా నూతన కమిటీని ఎమ్మెల్యే అభినందించి మాట్లాడారు.

గత జగన్ ప్రభుత్వంలో తెలుగుదేశం పార్టీ కార్యకర్తలను తీవ్రంగా ఇబ్బందులకు గురి చేశారని, అక్రమ కేసులు పెట్టారని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గత ప్రభుత్వంలో అక్రమ కేసులు ఎదుర్కొంటున్న కార్యకర్తలకు అండగా నిలుస్తున్నామని చెప్పారు. పేద, మధ్యతరగతి ప్రజలకు ఎలాంటి న్యాయపరమైన సమస్యలు ఎదుర్కొంటున్నా న్యాయవాదుల కమిటీ భరోసా కల్పించాలని సూచించారు. పోలీసుస్టేషన్లకు వచ్చే కేసుల్లో ఎక్కువ శాతం కుటుంబ వివాదాలు ఉంటుంన్నాయని, వీటిని కౌన్సిలింగ్ ద్వారా పరిష్కరించుకోవచ్చని తెలిపారు. ఇలాంటి వారికి నూతన కమిటీ అండగా ఉండాలన్నారు. కమిటీ ప్రెసిడెంట్ గా కాలె దేవదాస్, వైస్ ప్రెసిడెంట్స్ గా నర్మద, భాస్కర్, ఉమర్ ఆలీ, సిద్ధా సత్యనారాయణ, జనరల్ సెక్రటరీగా విజయభారతి, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా వర్మ, లక్ష్మీదేవి, లక్ష్మి, రమేష్, విజయభాస్కర్, స్వాతి, షేక్ నజీర్, సెక్రటరీలుగా సత్యనారాయణ, శ్రీనివాస్, సుభాకర్, స్పీక్ పర్సన్ గా బాలకృష్ణ, సోషల్ మీడియా శ్రీనివాసరావు ఎన్నికయ్యారు.

## బ్రెస్ట్ క్యాన్సర్‌ని ముందస్తు గుర్తింపుతో నివారించవచ్చు

- నందులపేట పట్టణ ఆరోగ్య కేంద్ర వైద్యాధికారిణి డాక్టర్ వేముల ప్రియాంక




**తెనాలి (జర్నలిస్ట్ ఫైల్) :** ప్రపంచ బ్రెస్ట్ క్యాన్సర్ అవగాహన మాసోత్సవం సందర్భంగా తెనాలి పట్టణ ప్రాథమికఆరోగ్యకేంద్ర వైద్యాధికారిణి డాక్టర్ వేముల ప్రియాంక ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీని ఆరోగ్యసిబ్బంది, విద్యార్థులచే నిర్వహించడం జరిగినది. ప్రపంచ ఆరోగ్యసంస్థ 1985వ సంవత్సరము నుండి ప్రతి సంవత్సరం అక్టోబర్ మాసనందు పింక్ మాసంగా, పింక్ రిబ్బన్ గుర్తు గాని వారణ చర్యలగురించి తెలియ జేయడంజరుగుచున్నది. ఆడవారిలో రొమ్ము క్యాన్సర్ 40–50 సంవత్సరముల మధ్యఎక్కువగా ముందస్తు చిహ్నములను గుర్తించక పోవడం వలన ఎక్కువగా మూడవ దశలోకి వెళ్లడం జరుగుతుందన్నారు. మూడవ దశలోనికి వెళ్ళిన తర్వాత ఆ అవయములను తొలగించడం జరుగుతుందని తద్వారా కుటుంబంలో అపోహల వలన భార్యాభర్తల మధ్య వివాదములతో కుటుంబములు విచ్ఛిన్నమవుతున్నట్లు తెలియుచున్నది. కనుక ప్రతి స్త్రీ బెస్ట్ లో ఏమైనా గడ్డలుకానీ, ఎలర్జీ కానీ ఉన్నట్లయితే వెంటనే వైద్యాధికారులను సంప్రదించి తక్కువ సమయంలో చికిత్స పొందినట్లయితే పూర్తిగా నివారించు కోవచ్చు అన్నారు. బ్రెస్ట్ లకు గడ్డలు కానీ ఏమైనా అనుమానం ఉన్నట్లయితే భర్తకు మరియు కుటుంబసభ్యులకు వైద్యులు కౌన్సిలింగ్ ద్వారా వివరించనున్నట్లు తెలిపారు. ఈ అవగాహనర్యాలీలో ట్రైబల్ గిరిజన సంక్షేమ గురుకుల వసతి గృహ డ్రాయింగ్ టీచర్ ఏ.అరుణకుమారి, జి.అనిల్ కుమార్, ఆరోగ్య విస్తరణాధికారి అందె బాలచంద్రమౌళి, తెనాలి పట్టణసబ్ యూనిట్ అధికారి శ్రీకంఠఉమాకాంత్, ఎస్.హెచ్ఐ జి. రవికుమార్, సూపర్వైజర్స్ బండారుమల్లేశ్వరరావు,తిరువీధుల రామప్రసాద్, ఏఎన్ఎంలు ఆశా కార్యకర్తలు తెనాలి మలేరియా, ఫైలేరియా సిబ్బంది పాల్గొన్నారు. ఈ అవగాహన ర్యాలీని శివాజీచౌక్ వరకు నిర్వహించి మానవహారంగా ఏర్పడి క్యాన్సర్ ని నివారిద్దాం, అవగాహన కల్పిద్దాం, క్యాన్సర్ నుంచి రక్షణ పొందడం వంటి నినాదములతో ప్రజలకు అవగాహన కలిగించడంజరిగినది.

## వాలీబాల్ ఫైనల్ పోటీల్లో విజయవాడ జట్టు విజయం



**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్):** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రత్యేక రక్షణ దళం ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని రాష్ట్రస్థాయి క్రీడా పోటీలను ఆచార్య నాగార్జున యూనివర్సిటీ,లో ఈనెలగ 14. నుంచి కొనసాగుతున్నాయి. ఈ క్రీడా పోటీలలో భాగంగా వాలీ బాల్ ఫైనల్ లో విజయవాడ జోన్ జట్టు విజేతలుగా నిలవగా, రాజమహేంద్రవరం జోన్ జట్టు వారు రన్నరప్ నిలిచారు. ఈ కార్యక్రమానికి SPF విజయవాడ జోన్ కామాండెంట్ ముద్దాడ శంకర్రావు , కమాండెంట్ , భాషా , అసిస్టెంట్ కమాండెంట్లు, ఇన్స్పెక్టర్లు ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## పోలీస్ సిబ్బంది సమస్యల పరిష్కారానికి ప్రతి శుక్రవారం "పోలీస్ స్టాఫ్ గ్రీవెన్స్ డే"



- గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్

**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** పోలీస్ సిబ్బంది సంక్షేమం, వారి వినతుల పరిష్కారం కోసం గుంటూరు జిల్లా పోలీస్ శాఖ ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. ప్రతి శుక్రవారం "పోలీస్ స్టాఫ్ గ్రీవెన్స్ డే " నిర్వహించనున్నట్లు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు.

శుక్రవారం గుంటూరు జిల్లా పోలీస్ కార్యాలయంలో ఈ కార్యక్రమాన్ని ఎస్పీ వకుల్ జిందాల్ స్వయంగా నిర్వహించారు. పోలీస్ సిబ్బంది తమ వ్యక్తిగత, బదిలీ మరియు సర్వీస్ సంబంధిత సమస్యలను నేరుగా ఎస్పీకి సమర్పించారు. మొత్తం 15 మంది సిబ్బంది వినతిపత్రాలను సమర్పించగా, ఎస్పీ వాటిని శ్రద్ధగా పరిశీలించి, తక్షణ పరిష్కారం కోసం సంబంధిత అధికారులను ఆదేశించారు.

ఎస్పీ వకుల్ జిందాల్ ఈ సందర్భంగా మాట్లాడుతూ, "పోలీస్ సిబ్బంది సమస్యల పరిష్కారం పోలీస్ శాఖకు అత్యంత ప్రాధాన్యత. సిబ్బంది ఎటువంటి సంకోచం లేకుండా నేరుగా ఎస్పీ కార్యాలయానికి వచ్చి తమ సమస్యలను తెలియజేయవచ్చు" అని తెలిపారు.

విధి నిర్వహణలో పోలీస్ సిబ్బంది నిబద్ధత, క్రమశిక్షణ, సమయపాలన పాటిస్తూ ప్రజలకు ఉత్తమమైన పోలీస్ సేవలు అందించాలన్నారు. ప్రజల్లో నమ్మకం, భరోసా పెంచే విధంగా కృషి చేయాలని ఎస్పీ ప్రత్యేకంగా సూచించారు. ఈ కార్యక్రమం ద్వారా పోలీస్ సిబ్బంది సమస్యల పరిష్కారం మరింత వేగవంతం అవుతుంది అని అధికారులు తెలిపారు.

## ఘనంగా శ్రీకృష్ణదేవరాయలు వర్ధంతి



**బ్రహ్మంగారిమఠం (జర్నలిస్ట్ ఫైల్):** బ్రహ్మంగారిమఠంలోని శ్రీకృష్ణదేవరాయ బలిజ అన్న సత్రంలో ఘనంగా శ్రీకృష్ణదేవరాయ వర్ధంతి వేడుకలు నిర్వహించారు. తెలుగు భాషకు స్వర్ణ యుగం తెచ్చిన మహానుభావుడు శ్రీకృష్ణదేవరాయలు.శ్రీకృష్ణదేవరాయలు 496 వర్ధంతి సందర్భంగా శ్రీ కృష్ణదేవరాయ బలిజ తెలగ ఒంటరి కాపు సంఘం అధ్యక్షుడు కార్యవర్గ సభ్యులు ఆధ్వర్యంలో స్థానిక బలిజ అన్న సత్రం నందు శ్రీకృష్ణదేవరాయలు చిత్రపటాన్ని పూలమాలవేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా స్థానిక బలిజ సంఘం నాయకులు మాట్లాడుతూ శ్రీకృష్ణదేవరాయల పాలన స్ఫూర్తిదాయకం ఆదర్శనీయమైన పాలకులని వారన్నారు. అలాగే అన్నదాత సుఖీభవ అని కేవలం మాటల్లో కాదు ఆచరణలో చూపించిన రాజు శ్రీకృష్ణదేవరాయలు రాజులలో రాజు కవులలో కవి తెలుగు భాషకు స్వర్ణ యుగం తెచ్చిన మహానుభావుడు శ్రీకృష్ణదేవరాయలు అలాంటి మహా నాయకుడికి నివాళులర్పించడం చాలా సంతోషంగా ఉందని వారున్నారు. ఈ కార్యక్రమంలో ఆకుల కొండయ్య అంబిశెట్టి వెంకట సుబ్బయ్య కొక్కు రవి రాయల్ కోనేటి వీర నాగరాజు రాయల్ దరిమిశెట్టి రమణయ్య ఆరవ శేఖర్ రాయల్, ఆకుల చరణ్ ఆకుల సంతోష్ కుమార్ కటారి శివ ఆకుల వీరయ్య పసుపులేటి వెంకట సుబ్బయ్య యల్లయ్య భూమిరెడ్డి రమణమూర్తి తదితరులు ఉన్నారు.

## బ్రాహ్మణ నిరుద్యోగ యువతకు డిశెంబర్ 13న, మెగాజాబ్ మేళ

**తెనాలి(జర్నలిస్ట్ ఫైల్):** ఏపీ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య ఆధ్వర్యంలొ సంఘీయ నిరుద్యోగ యువతీ యువకులకు ఉద్యోగ అవకాశాలు కల్పన దిశగా, మెగా జాబ్ మేళా కార్యక్రమాన్ని డిశెంబర్ 13న నిర్వహించనున్నట్లు ఏపీ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య అధ్యక్షులు సతీష్ శర్మ పేర్కొన్నారు.

స్థానిక నాజరుపేటలోని వేదిక్ బ్రాహ్మణ సేవాసమాఖ్య కార్యాలయంలొ శుక్రావారం, సంస్థ ప్రధాన కార్యదర్శి తాడేపల్లి సూర్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలొ, ఏపీ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య అద్యక్షులు సతీష్ శర్మ మాట్లాడుతూ డిసెంబర్ 13వ తేదీన, గుంటూరు పట్టణం, అమరావతి రోడ్డులో గల, హిందూ ఫార్మసీ కళాశాల ప్రాంగణంలొ,నిరుద్యోగ బ్రాహ్మణ సంఘీయ యువతీ యువకులు, 80శాతం, ఇతరులు 20శాతం ధామాషలొ, వెయ్యి మందికి ఉద్యోగాలు కల్పించే దిశగా, 65కు పైగా నాన్ ఐటీ కంపెనీల ప్రతినిధులు ఇంటర్వ్యూలు చేపడతారని తెలిపారు. మెగా జాబ్ మేళాలొ, హాజరు కావాలనుకుంటున్న వారు, ప్రచార పోస్టర్ లోని క్యూఆర్ కోడ్ ద్వారా, దరఖాస్తు చేసుకోవాలన్నారు. నవంబర్ 23 దరఖాస్తు చేసుకోవడానికి చివరి తేదీగా తెలిపారు

ఇంటర్వ్యూలకు హాజరయ్యే యువతకు, బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య ఆధ్వర్యంలో, అల్పాహారం,భోజనం ఉచితంగా ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. బ్రాహ్మణ సంఘీయ నిరుద్యోగ యువత అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వేదిక్ సేవ సమాఖ్య ప్రధాన కార్యదర్శి తాడేపల్లి సూర్యనారాయణ మూర్తి మాట్లాడుతూ, బ్రాహ్మణ సంఘీయ నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలన్నారు. అదేవిధంగా సమాఖ్య ఆధ్వర్యంలో కార్తీక మాస వన సమారాధన కార్యక్రమాన్ని,ఈనెల 26వ తేదీ సమాఖ్య కార్యాలయంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా తొలుత, ప్రచార పోస్టర్లను ఆవిష్కరించారు. పీవీఎస్ఎస్ ప్రసాద్, ఎస్ లలిత శాస్త్రి, ఎం వి ఎస్ మురళీకృష్ణ, వేదిక్ సమాఖ్య కార్యవర్గం కుందేటి సుబ్రహ్మణ్యం, సీఎం కే తిరుమల్ రావు, బుర్ర ప్రభాకర్ శాస్త్రి, టి నాగ సుబ్రహ్మణ్యం, తదితర సభ్యులు పాల్గొన్నారు.

# వసతి గృహ భవనాల ముఖ చిత్రం మారాలి

- ఇంజనీరింగ్, సంక్షేమ శాఖతో కలెక్టర్ సమీక్ష
- వసతి గృహాల భవనాలు సుందరంగా ఉండాలి



**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్):** ప్రభుత్వ భవనాలలో నడుస్తున్న సంక్షేమ వసతి గృహాల ముఖ చిత్రాలు మారాలని జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా అన్నారు. వివిధ ఇంజనీరింగ్, సంక్షేమ శాఖలతో శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ సమీక్షించారు. వసతి గృహాల భవనాలు సుందరంగా, ఆహ్లాదకరంగా మారాలని తద్వారా అందులో ఉంటున్న విద్యార్థుల మానసిక స్థితిలో మార్పు వస్తుందని అభిప్రాయం వ్యక్తం చేశారు. పరిసరాల ప్రభావం వారి ఆలోచనలు ఉన్నతంగా మార్చుటకు దోహదం చేస్తుందని అన్నారు. ప్రభుత్వ భవనాల్లో ఉన్న 20 సాంఘిక సంక్షేమ వసతి గృహాలు, 8 బిసి సంక్షేమ వసతి గృహాలు, 3 గిరిజన సంక్షేమ వసతి గృహాలుతో సహా అంగన్వాడీ కేంద్రాలలో అవసరమగు మౌలిక సదుపాయాలు గుర్తించాలని ఇ.డబ్ల్యూ.ఐ.డి.సి, గిరిజన సంక్షేమ శాఖ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ప్రతి అవసరాన్ని గుర్తించి జాబితా తయారు చేయాలని, తగిన అంచనాలు తయారు చేయాలని అన్నారు. ప్రతి వసతి గృహం రూపురేఖలు మారాలని స్పష్టం చేశారు. విద్యార్థులకు పరిశుభ్రమైన పరిసరాలు, రక్షిత తాగునీరు, ఆహ్లాదకర వాతావరణం అందాలని వివరించారు. విద్యార్థుల ఆరోగ్యానికి, వారిలో సృజనాత్మకత పెరుగుటకు ప్రతి అంశం దోహదం కావాలని పేర్కొన్నారు.

రహదారుల నిర్మాణాన్ని వేగవంతం చేయాలని, నాణ్యతలో రాజీ పడరాదని స్పష్టం చేశారు. గృహ నిర్మాణంలో స్లాబ్ వేయుటకు సిద్ధంగా ఉన్నవాటిని పూర్తి చేయుటకు తక్షణ చర్యలు తీసుకోవాలని గృహ నిర్మాణ సంస్థ అధికారులను ఆదేశించారు.

ప్రజా ఆరోగ్య శాఖ పర్యవేక్షక ఇంజనీర్ డి.శ్రీనివాసులు మాట్లాడుతూ అమృత్ పథకం కింద ఏడు ప్రాజెక్ట్ లకు రూ. 331 కోట్లు మంజూరు అయ్యిందన్నారు. తక్కెళ్ళపాడు నుండి బుడంపాడు వరకు పైపు లైన్లు వేసి ఏటుకూరు గ్రామం వద్ద ఐదు లే అవుట్లకు నీరు ఇచ్చుటకు పనులు చేపడుతున్నామని వివరించారు. గోరంట్ల వద్ద రిజర్వాయర్ పూర్తి చేయడం ద్వారా చుట్టు ప్రక్కల గ్రామాలకు కూడా నీరు అందించే అవకాశాలు ఉన్నాయని తెలిపారు.

రహదారులు, భవనాల శాఖ పర్యవేక్షక ఇంజనీర్ శ్రీనివాస మూర్తి మాట్లాడుతూ మంగళగిరి – తాడికొండ రహదారి నిర్మాణంలో నిడమర్రు వద్ద ఆక్రమణలు తొలగించాల్సి ఉందని, దీనిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

జాతీయ రహదారులు సంస్థ అధికారి మాట్లాడుతూ విజయవాడ బై పాస్ రహదారితో పాటు ఇతర ప్రాజెక్టులు చేపడుతున్నామన్నారు. కొండవీటి కోట, చినకాకాని వద్ద పనులు పెండింగ్ లో ఉన్నాయని తెలిపారు. ముఖ్యమంత్రి ఈ పనులకు ప్రాధాన్యత ఇస్తున్నారని చెప్పారు. పనులను 12 ప్యాకేజీల్లో చేపట్టుట జరుగుతుందని, 2029 నాటికి పూర్తి చేయాలని కార్యాచరణ ఉందన్నారు.

టిడ్కో పర్యవేక్షక ఇంజనీర్ ఉమా శంకర శాస్త్రి మాట్లాడుతూ టిడ్కో కాలనీలలో మురుగు నీటి శుద్ధి పనులు పూర్తి అయ్యాయన్నారు. వెంగళరాయ పాలెంలో మౌళిక వసతుల కల్పన జరుగుతోందన్నారు.

గృహ నిర్మాణ సంస్థ జిల్లా అధికారి ప్రసాద్ మాట్లాడుతూ దీపావళి తరువాత గృహ ప్రవేశాలు చేయుటకు చర్యలు చేపట్టామన్నారు. ప్రత్తిపాడు మండలం కొత్తూరు, చేబ్రోలు మండలం సెలపాడు తదితర లే అవుట్లు ఎంపిక చేస్తున్నామని చెప్పారు.

మన బడి – మన భవిష్యత్తు కార్యక్రమంలో 223 పనులు పూర్తి చేశామని, పి.యం. క్రింద 71 పనులు పూర్తి చేశామని, 10 పనులు పూర్తి అయ్యే దశలో ఉన్నాయని సర్వ శిక్షా అభియాన్ కార్యనిర్వహక ఇంజనీర్ రవీంద్ర తెలిపారు. చిన కాకాని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆటిజం కేంద్రాన్ని తయారు చేస్తున్నామని చెప్పారు.

నగర పాలక సంస్థ పర్యవేక్షక ఇంజనీర్ సుందరరామి రెడ్డి, జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి యు. చెన్నయ్య, మహిళ శిశు సంక్షేమ శాఖ అధికారి ప్రసూన, ఎం.ఎస్.ఐ.డి.సి తదితర శాఖల అధికారులు హాజరై తమ శాఖల పరిధిలో చేపడుతున్న పనుల వివరాలను తెలిపారు.

INK OF TRUTH
జర్నలిస్ట్ ఫైల్
తెలుగు దినపత్రిక
జర్నలిస్ట్ ఫైల్ దినపత్రిక చందాదారులుగా చేరాలని అనుకుంటున్నారా?
అయితే ఈ నెంబర్‌కు ఫోన్ చేయండి
సర్క్యులేషన్ మేనేజర్
76 61 80 59 68

## "సేనతో సేనాని - మన నేల కోసం కలిసి నడుద్దాం"

○ రాజకీయ వ్యవస్థలో యువతను భాగస్వామ్యం చేస్తాం : పవన్ కళ్యాణ్



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** రాజకీయ వ్యవస్థలో నవతరం యువతను భాగస్వామ్యం చేస్తామని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత కొణిదెల పవన్ కళ్యాణ్ వ్యాఖ్యానించారు. సమాజంలో మార్పు కాంక్షించే అవకాశం ప్రతీ ఒక్కరికీ వారి వంతు సేవలు మాతృభూమికి అందించే అవకాశం కోసం కృషి చేస్తామని ఆయన పేర్కొన్నారు. ఇందులో భాగంగా "సేనతో సేనాని – మన నేల కోసం కలిసి నడుద్దాం" అంటూ ఒక వినూత్నమైన కార్యక్రమం జనసేన పార్టీ నిర్వహించనుందని చెప్పుకొచ్చారు. ఈ కార్యక్రమం ద్వారా ఔత్సాహిక యువతీ యువకులు తమకు నచ్చిన అంశాలను ఎంచుకుని సేవలు అందించడానికి ఈ వేదిక కల్పించనుందన్నారు. మార్పు కోరుకుంటే రాదని, ప్రయత్నిస్తే మార్పు వస్తుందని పవన్ కళ్యాణ్ ఉద్ఘాటించారు. ఈ ప్రయత్నంలో ప్రతీ ఒక్కరూ భాగస్వామ్యం కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాలుపంచుకునేందుకు QR కోడ్ స్కాన్ చేసి, లేదా ఈ లింక్ మీద క్లిక్ చేసి ఇప్పుడే రిజిస్టర్ చేసుకోవాలని ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ "ఎక్స్" లో శుక్రవారం ట్వీట్ పోస్ట్ చేశారు.

## హైకోర్టు న్యాయమూర్తిగా జస్టిస్ రమేశ్ ప్రమాణ స్వీకారం



**అమరావతి ( జర్నలిస్ట్ ఫైల్ ) :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత న్యాయస్థానంలో న్యాయమూర్తిగా జస్టిస్ దొనాడి రమేశ్ ప్రమాణ స్వీకారం చేశారు. ఈమేరకు శుక్రవారం హైకోర్టు మొదటి కోర్టు హాల్లో జరిగిన కార్యక్రమంలో హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ జస్టిస్ రమేశ్ చే న్యాయమూర్తిగా ప్రమాణం చేయించారు. గతంలో ఏపి హైకోర్టులో న్యాయమూర్తిగా పనిచేస్తూ జస్టిస్ రమేశ్ అలహాబాద్ హైకోర్టుకు బదిలీ అ-య్యారు. మరలా ఏపి హైకోర్టుకు న్యాయమూర్తిగా తిరిగి బదిలీ కావడంతో ఆయనతో చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ న్యాయమూర్తిగా ప్రమాణం చేయించారు. ఈకార్యక్రమంలో పలువురు హైకోర్టు న్యాయమూర్తులు, హైకోర్టు అడ్వకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్, అదనపు సొలిసిటర్ జనరల్ ధనంజయ, అదనపు అడ్వకేట్ జనరల్ ఐ సాంబశివ ప్రతాప్, రిజిస్ట్రార్ జనరల్ వైవిఎస్బిజి పార్థసారధి, హైకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షులు కె.చిదంబరం, ఏపి బార్ కౌన్సిల్ అధ్యక్షులు ఎన్.ద్వారకానాథ్ రెడ్డి, పబ్లిక్ ప్రాసిక్యూటర్, పలువురు రిజిస్ట్రార్లు, బార్ అసోసియేషన్, బార్ కౌన్సిల్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## సీపీఎస్ ఉద్యోగుల ప్రాన్ ఖాతాల్లో మిస్సింగ్ క్రెడిట్స్ సమస్య పరిష్కరించాలి



○ ఏపీ సెక్రటేరియట్ సీపీఎస్ అసోసియేషన్

**అమరావతి ( జర్నలిస్ట్ ఫైల్ ) :** రాష్ట్ర సచివాలయ సీపీఎస్ ఉద్యోగుల ప్రాన్ ఖాతాల్లో మిస్సింగ్ క్రెడిట్స్ సమస్యను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ, ఏపీ సెక్రటేరియట్ సీపీఎస్ అసోసియేషన్ ప్రతినిధులు మంగళవారం నిధి భవన్‌లోని పే అండ్ అకౌంట్స్ అధికారి శ్రీమతి లలితను కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ, గత కొంతకాలంగా సీపీఎస్ ఉద్యోగుల పింఛను చందాలు సరైన విధంగా ప్రాన్ ఖాతాల్లో ప్రతిబింబించకపోవడం వల్ల వారి భవిష్యత్ ప్రయోజనాలు దెబ్బతింటున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ట్రెజరీస్ అండ్ అకౌంట్స్ విభాగ పరిధిలోని ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం ఇప్పటికే పరిష్కరించిన నేపథ్యంలో, పీఏఓ పరిధిలో ఉన్న సచివాలయ మరియు హెచ్‌ఓడీ ఉద్యోగుల సమస్యలను కూడా అదే విధంగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ప్రతిపాదనలు పంపాలని పీఏఓను కోరారు. వినతిపత్రాన్ని పరిశీలించిన పే అండ్ అకౌంట్స్ అధికారి శ్రీమతి లలిత సత్వరమే స్పందించి, తగు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ సెక్రటేరియట్ సీపీఎస్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులతో పాటు పలు హెచ్‌ఓడీ శాఖల ఉద్యోగులు కూడా పాల్గొన్నారు.

## పదోన్నతుల జీఓ విడుదలలో జాప్యం 23 నుంచి ఆర్టీసీ ఉద్యోగుల ఆందోళనలు

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** ఏపీపీటీడి (ఆర్టీసీ) ఉద్యోగుల పదోన్నతులపై రాష్ట్ర ముఖ్యమంత్రి ఆగస్టు 28నే అనుమతి ఇచ్చినప్పటికీ, ప్రభుత్వంలో కొంతమంది ఉన్నతాధికారుల నిర్లక్ష్య వైఖరి కారణంగా జీఓ వెలువడడంలో జాప్యం జరుగుతోందని ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర నాయకత్వం ఆరోపించింది. ఈ నేపథ్యంలో ఈ నెల 23 నుంచి రాష్ట్రవ్యాప్తంగా 129 డిపోలు, నాలుగు వర్క్‌షాపుల వద్ద ఎర్ర బ్యాడ్జీలు ధరించి ధర్నాలు చేపట్టాలని రాష్ట్ర కమిటీ నిర్ణయించింది. యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు పలిశెట్టి దామోదరరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.వి. నరసయ్య సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఆర్టీసీ విలీనం అనంతరం గత ఆరు సంవత్సరాలుగా వివిధ విభాగాల్లో వేలాది మంది ఉద్యోగులు పదోన్నతుల కోసం ఎదురు చూస్తున్నప్పటికీ, ఇప్పటికీ జీఓ వెలువడకపోవడంతో ఇప్పటికే సుమారు 2000 మంది ఉద్యోగులు పదోన్నతి కోసం ఎదురుచూస్తూనే రిటైర్ అయ్యి ఆర్థికంగా నష్టపోయారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్టీసీ సిబ్బందికి విలీనానికి ముందున్న పాత విధానంలోనే పనిష్మెంట్లపై సడలింపులు ఇవ్వాలనే యూనియన్ విజ్ఞప్తి మేరకు గౌరవ ఆర్టీసీ వీసీ & ఎండీ ద్వారక తిరుమలరావు ప్రభుత్వంకు సిఫారసు చేశారని, టీఆర్అండ్‌బీ అధికారులు, రవాణా మంత్రి ఆమోదించి, చివరకు ముఖ్యమంత్రిగారు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినప్పటికీ, జీఏడీలో కొందరు అధికారులు అవలంబిస్తున్న వైఖరి వల్ల అసిస్టెంట్ మెకానిక్ నుండి సూపరింటెండెంట్ కేటగిరీ వరకు అర్హత గల సుమారు 6000 మంది ఉద్యోగుల పదోన్నతులు నిలిచిపోయాయని తెలిపారు.

ఈ అన్యాయంపై నిరసనగా ఈ నెల 23 నుండి దశలవారీగా ఆందోళనా కార్యక్రమాలు ప్రారంభించాల్సి వస్తోందని పలిశెట్టి దామోదరరావు, జి.వి. నరసయ్య స్పష్టం చేశారు.

# బిజెపి ఆలోచనలు ప్రజల్లోకి తీసుకెళ్లాలి

○ స్వదేశీ భావజాలాన్ని విస్తృతంగా ప్రచారం చేయాలి

○ అమరావతిలో బిజెపి అధికార ప్రతినిధులు, మీడియా ప్యానెలిస్టులకు కార్యశాల




**అమరావతి ( జర్నలిస్ట్ ఫైల్ ) :** బిజెపి ఆలోచనలు, సిద్ధాంతాలు, దేశాభివృద్ధి దిశగా తీసుకున్న నిర్ణయాలను ప్రజల్లోకి మరింత విస్తృతంగా తీసుకెళ్లాలంటూ బిజెపి ఏపీ అధ్యక్షుడు పివిఎన్ మాధవ్ పిలుపునిచ్చారు. అమరావతిలో బిజెపి అధికార ప్రతినిధులు, మీడియా ప్యానలిస్టుల కోసం నిర్వహించిన కార్యశాలలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. స్వదేశీ ఉద్యమం బలం దేశాన్ని వికసిత్ భారత్ వైపు నడిపిస్తుందని, పార్టీ శక్తి ప్రజలలో ఆలోచనల రూపంలో ప్రవహించాలని చెప్పారు.

**మీడియా నాలుగో స్తంభం... కనిపించని సింహం**

సబ్జెక్టుపై సంపూర్ణ అవగాహనతో మాట్లాడితేనే చర్చల్లో ఆధిపత్యం సాధ్యమవుతుందని మాధవ్ స్పష్టం చేశారు. చర్చల్లో ఎలా స్పందించాలి, ఏ విషయాన్ని ఎలా ప్రజెంట్ చేయాలనే దానిపై నైపుణ్యం పెంపొందించుకోవాలని సూచించారు. "ప్రజల మనసు గెలవాలంటే మన వాణి బలంగా ఉండాలి. ఆర్ఎస్ఎస్ సేవా తత్వాన్ని ప్రపంచానికి వివరించాలి" అని పిలుపునిచ్చారు.

**వికసిత్ భారత్ - వికసిత్ ఏపీ లక్ష్యం**

మోడీ నేతృత్వంలో భారత్ స్వయం సమృద్ధి సాధించిందని, రక్షణ, టెలికం, పరిశ్రమల రంగాల్లో విప్లవాత్మక మార్పులు వచ్చాయని తెలిపారు. "జీఎస్టీ వల్ల ధరలు తగ్గి ప్రజలకు లాభాలు చేకూరాయి. ఆ విషయాలను కూడా ప్రజలకు వివరించాలి" అన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు పది లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయని, అమరావతి, పోలవరం నిర్మాణానికి కేంద్రం సహకరిస్తోందని స్పష్టం చేశారు.

**డబుల్ ఇంజన్ ప్రభుత్వం ప్రయోజనాలు ప్రజలకు అర్థమవుతున్నాయి**

గ్రీన్ ఎనర్జీ, డేటా సెంటర్లు, గ్లోబల్ హబ్‌గా ఏపిని తీర్చిదిద్దే దిశగా కేంద్రం పనిచేస్తోందని మాధవ్ పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాతే పెట్టుబడులు వెల్లువెత్తాయని, ఉపాధి అవకాశాలు పెరుగుతున్నాయని అన్నారు. "గత ప్రభుత్వం ప్రజలను మోసం చేసింది. ఇప్పటికీ బెదిరింపులే చేస్తున్నారు" అంటూ విమర్శించారు.

**జగన్ పాలనలో అవినీతి... మోడీ పాలనలో అభివృద్ధి : ఆరోగ్య మంత్రి సత్యకుమార్**

పిపిపి మోడల్‌లో మెడికల్ కాలేజీలు నిర్మించడం వల్ల నష్టం లేదని, 33 ఏళ్ల తరువాత వాటి యాజమాన్యం ప్రభుత్వానిదేనని మంత్రి సత్యకుమార్ వివరించారు. "1500 మెడికల్ సీట్లలో 725 ఉచితం. కార్పొరేట్ స్థాయి చికిత్సను యన్టీఆర్ వైద్య సేవల ద్వారా అందిస్తున్నాం" అన్నారు. గత ప్రభుత్వం కాలేజీలను నిలిపివేసిందని, ప్రైవేటు భాగస్వామ్యమంటే తప్పేమీ లేదని తిప్పికొట్టారు. "రాజధాని నిర్మాణం మోడీ పునఃప్రారంభించారు. ప్రజలను తక్కువ అంచనా వేసిన జగన్‌కు వారు తగిన బుద్ధి చెప్పారు" అని మంత్రి వ్యాఖ్యానించారు. "సెల్ఫ్ ఫైనాన్స్ స్కీంను జగనే తెచ్చి... ఇప్పుడు విమర్శలు చేయడం విచిత్రం" అన్నారు.

**పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌తో మార్గదర్శనం**

ఈ సందర్భంగా బిజెపి ఏపీ చీఫ్ పివిఎన్ మాధవ్ అధికార ప్రతినిధులకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. పార్టీ కార్యాలయాలను 'జనతా గ్యారేజ్'లా మార్చాల్సి ఉందని, ప్రతినిధులు స్థానికస్థాయిలో పార్టీ కార్యక్రమాల్లో కీలక పాత్ర పోషించాలని సూచించారు.

**డిబేట్‌లో ఆధిపత్యం సాధించాలి : పాకా సత్యనారాయణ**

రాజ్యసభ సభ్యుడు పాకా వెంకట సత్యనారాయణ మాట్లాడుతూ "దేశవ్యాప్తంగా ఒక వాతావరణం, ఆంధ్రప్రదేశ్‌లో మరో విధానం ఉంటుంది. అలాంటి సమయంలో రాజకీయ చాతుర్యం అవసరం" అని పేర్కొన్నారు. ఎన్నికల్లో సెంటిమెంట్ ప్రధాన పాత్ర పోషిస్తుందని గుర్తు చేశారు.

**మీడియాతో స్నేహపూర్వక సంబంధాలు : దిలీప్**

రాష్ట్ర మీడియా ఇంఛార్జి కిలారు దిలీప్ మాట్లాడుతూ మీడియాతో స్నేహపూర్వక బంధం కొనసాగించాలని, కార్యక్రమాలను సమయానికి తెలియజేయాలని సూచించారు.

**డిజిటల్ మీడియా శక్తి వినియోగించుకోవాలి**

నేషనల్ హబ్ సీఈఓ సాయికృష్ణ మాట్లాడుతూ "గతంతో పోలిస్తే ఇప్పుడు బిజెపికి మీడియాలో ఎక్కువ ప్రాధాన్యం ఉన్నది" అని అన్నారు. దేశవ్యాప్తంగా జరుగుతున్న పరిణామాలను ప్రజలకు చేరవేయాలని సూచించారు.

**లోతుగా అధ్యయనం చేయాలి : దుగ్గరాజు శ్రీనివాస్**

ప్రముఖ రాజకీయ విశ్లేషకులు దుగ్గరాజు శ్రీనివాస్ మాట్లాడుతూ "డిబేట్‌లో నైపుణ్యం పెంచుకుంటే ప్రభావం పెరుగుతుంది. జాతీయవాదం బలపడింది, బిజెపిని ప్రజలు స్వాగతిస్తున్నారు. దక్షిణాదిలో కూడా బిజెపి బలం పెరుగుతుంది" అని వ్యాఖ్యానించారు.

**కార్యక్రమాన్ని పర్యవేక్షించిన వల్లూరు జయప్రకాష్**

కార్యక్రమ నిర్వహణ, పర్యవేక్షణను రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి వల్లూరు జయప్రకాష్ చేపట్టారు. కీలక సమయంలో అధికార ప్రతినిధుల బాధ్యత మరింత పెరిగిందని పేర్కొన్నారు.

## ప్రధాని పర్యటన విజయవంతం - సీఎం అభినందనలు

○ కర్నూలు, నంద్యాల జిల్లాల్లో కార్యక్రమాలు ఘన విజయం

○ సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్ సభకు ప్రజల్లో మంచి స్పందన

○ ప్రధాని సంతోషంగా పర్యటనను ఆస్వాదించారు



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** కేంద్ర ప్రధాని నరేంద్ర మోదీ రాష్ట్ర పర్యటన విజయవంతంగా ముగిసిన సందర్భంగా మంత్రులు, వివిధ శాఖల అధికారులను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అభినందించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత, ఈ పర్యటన ఏపీలో నాలుగోసారి నిర్వహించబడినది. పర్యటనలో కర్నూలు, నంద్యాల జిల్లాల్లో వివిధ కార్యక్రమాల్లో ప్రధాని పాల్గొన్నారు. కర్నూలులో సూపర్ జీఎస్టీ–సూపర్ సేవింగ్స్ బహిరంగ సభ ఘన విజయం సాధించిందని ముఖ్యమంత్రి తెలిపారు. ఈ సభ ప్రజలకు స్పష్టమైన, శక్తివంతమైన మెసేజ్ ఇచ్చిందని, అన్ని శాఖల అధికారులు పూర్తి సమన్వయంతో పనిచేశారని సీఎం అభినందించారు. ప్రధాని మోదీ కూడా పర్యటనను ఎంతో ఆస్వాదించారని, ముఖ్యంగా శ్రీశైలం మల్లన్న ఆలయ దర్శనం సందర్భంగా సంతృప్తి, సంతోషాన్ని వ్యక్తం చేశారని సీఎం తెలిపారు. సూపర్ జీఎస్టీ కార్యక్రమాలను ప్రధాని ప్రత్యేకంగా అభినందించారని సీఎం పేర్కొన్నారు. చంద్రబాబు నాయుడు అధికారులను జీఎస్టీ నెల రోజుల పాటు నిర్వహించిన కార్యక్రమాలపై సమగ్రంగా ఒక పుస్తకం ప్రచురించమని ఆదేశించారు, తద్వారా భవిష్యత్తులో ప్రజలకు, అధికారులు మరియు పరిశీలకులకు ఈ కార్యక్రమాల వివరాలు అందుబాటులో ఉంటాయని సీఎం వివరించారు.

## హాస్టల్ పిల్లలను కంటికి రెప్పలా కాపాడుకుంటాం



○ విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ చేసిన గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్

○ నియోజకవర్గంలో 240 మందికి అందజేత

**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్రంలో హాస్టల్ విద్యార్థులను సొంత బిడ్డల్లా చూసుకుంటున్నామని, సీఎం చంద్రబాబు నాయుడు, విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ ఆధ్వర్యంలో విద్యా వ్యవస్థ బలోపేతానికి చర్యలు తీసుకుంటున్నామని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ అన్నారు. స్థానిక బీసీ వసతి గృహంలోని 240 మంది విద్యార్థులకు శుక్రవారం సాయంత్రం ఎమ్మెల్యే నసీర్ చేతులమీదుగా దుప్పట్ల కిట్ ను అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ చలికాలం వస్తున్న నేపథ్యంలో హాస్టల్ విద్యార్థులకు బ్లాంకెట్ల కిట్ ను అందిస్తున్నామని తెలిపారు.

రాష్ట్ర వ్యాప్తంగా 90 వేల మంది విద్యార్థులకు రూ. 6.12 కోట్లతో దుప్పట్లు పంపిణీ చేస్తున్నట్లు వెల్లడించారు. గుంటూరు జిల్లాలో 2700 మంది పిల్లలు ఉన్నారని, వీరందరికీ అందిస్తున్నామని తెలిపారు. ఒక్కొక్క విద్యార్థికి రూ. 668 వెచ్చిస్తున్నట్లు చెప్పారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సీఎం చంద్రబాబు నాయుడు, విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ ఆధ్వర్యంలో విద్యా ప్రమాణాల పెంపునకు ప్రత్యేక ప్రణాళికతో ముందుకు వెళుతున్నారని చెప్పారు. తల్లికి వందనం ద్వారా ఇంట్లోని ప్రతి విద్యార్థికీ పథకం అమలు చేశామని తెలిపారు. దీంతో పిల్లలందరికీ చదివించుకునే అవకాశం కలుగుతుందని చెప్పారు. పేరెంట్స్, టీచర్స్ మీటింగ్ ద్వారా విద్యార్థుల విద్యా సామర్థ్యాల మదింపు జరిగిందని, దీంతో పదో తరగతి ఫలితాల్లో ఉత్తమ విజయాలు నమోదయ్యాయని వెల్లడించారు.

కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ షైక్ షాజీలా, విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ తిలువరూరి పద్మావతి, కొనాకళ్ళ సత్యం, మొహమ్మద్ హాఫీజ్, షైక్ ముక్కరం, అబ్దుల్ సలీం, అబ్దుల్ హాఫీజ్, విజయ్ గుప్త, సయ్యద్ అన్వర్, కోట పిచ్చిరెడ్డి, వంగర ఏడుకొండలు, జూలూరి హేమంత్ గుప్తా, బ్రహ్మసాని శ్రీనివాస్, సముద్రాల గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి అచ్చెన్నాయుడుకు ప్రత్యేక కృతజ్ఞతలు

○ కృతజ్ఞతలు తెలిపిన రాష్ట్ర వ్యవసాయ అధికారుల సంఘం



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** గత ఎనిమిది సంవత్సరాల నుండి ఎటువంటి పరిష్కారానికి నోచుకోని వ్యవసాయ అధికారుల పదోన్నతుల విషయములో వ్యవసాయ మంత్రి కింజరాపు అచ్చెంనాయుడు చొరవ తీసుకొని జటిలమైన ఈ సమస్యను పరిష్కరించినందుకు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర వ్యవసాయ అధికారుల సంఘం అధ్యక్షులు కె బాలభాస్కర్, కార్యదర్శి డి ప్రవీణ్ మంత్రికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. మంత్రి పదోన్నతి పొందిన అధికారులను ఉద్దేశించి మాట్లాడుతూ రాష్ట్రములోని రైతాంగానికి అన్ని వేళలా అందుబాటులో ఉంటూ దిగుబడులను పెంచి, వ్యవసాయం లాభసాటిగా ఉండేలా నూతన వ్యవసాయ సాంకేతిక విధానాలను రైతులకు అందిస్తూ వారిలో మరింత అవగాహన పెంచేలా కృషి చేయాలని హితవు పలికారు. సంయుక్త సంచాలకులుగా పదోన్నతులు పొందిన 20 మంది అధికారులు ధన్యవాదములు తెలియచేస్తూ, రైతాంగానికి పూర్తి స్థాయిలో సాంకేతిక సలహాలు అందిస్తామని తెలియచేస్తూ ఈ పదోన్నతులు కల్పించటం ద్వారా మంత్రి వ్యవసాయ శాఖ చరిత్రలో శాశ్వతముగా నిలిచిపోతారని ఆనందం వ్యక్తం చేశారు.

# 'ప్రభుత్వ వైద్యం అంటేనే భరోసా'

○ తురకపాలెం కేసు.... గుంటూరు ప్రభుత్వ సమగ్ర వైద్యశాల వైద్యుల సేవలకు నిదర్శనం



తనకు అత్యుత్తమ వైద్యసేవలందించారంటూ... ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతున్న తురకపాలెం వాసి

**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** తురకపాలెం గ్రామానికి చెందిన పి. ఎలీషా (42) తీవ్రమైన జ్వరం, కీళ్ల నొప్పులతో గుంటూరు ప్రభుత్వ సమగ్ర వైద్యశాలలో చేరిన సమయంలో, గ్రామంలో కొత్త వైరస్ వ్యాపిస్తోందన్న పుకార్లు చెలరేగాయి. ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్.ఎస్.వి. రమణ ప్రత్యేక పర్యవేక్షణలో అన్ని పరీక్షలు నిర్వహించారు. కొత్త వైరస్ ఏదీ పరీక్షల్లో నిర్ధారణ అవ్వకపోవడంతో, సూపరింటెండెంట్ డాక్టర్ రమణ సూచనల మేరకు మోకాళ్ల నుంచి ఒక లీటర్ ఫ్లూయిడ్ సేకరించి పరీక్షించగా బర్కోల్డియస్ (మెలియోడియోసిస్) అనే అరుదైన బ్యాక్టీరియా ఇన్ఫెక్షన్ ఉన్నట్లు తేలింది.

తక్షణమే వైద్యులు ప్రత్యేక చికిత్స ప్రారంభించి, రెండు నెలలపాటు యాంటీబయోటిక్స్ కోర్స్ మరియు మోకాళ్లకు సంబంధించి సుదీర్ఘ వైద్య సేవలు అందించారు. నిరంతర పర్యవేక్షణతో చికిత్స చేయడంతో ఎలీషా ఈరోజు పూర్తిగా కోలుకుని సాధారణ స్థితికి చేరుకున్నారు.

**"నన్ను బ్రతికించింది ప్రభుత్వ ఆసుపత్రే" - ఎలీషా**

"ప్రతి గంటకు నా ఆరోగ్యాన్ని పరిశీలిస్తూ ఇంత శ్రద్ధగా వైద్యం అందించినది గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రి మాత్రమే. నేను బాగుపడటానికి కారణం డాక్టర్ల సేవలు, వారి నిబద్ధత" అని ఎలీషా భావోద్వేగంగా తెలిపారు.

**నిరంతరం ఉన్నతస్థాయిలో పర్యవేక్షణ**

రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, కేంద్రమంత్రి పెమసాని చంద్రశేఖర్, ఎమ్మెల్యే నసీర్ తురకపాలెం రోగులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించగా, అవసరమైన సహాయాన్ని అందించామని సూపరింటెండెంట్ తెలిపారు. జిల్లా కలెక్టర్ పలుమార్లు ఆసుపత్రి పర్యటించి రోగి పరిస్థితిని ప్రత్యక్షంగా తెలుసుకోవడం పట్ల ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ డాక్టర్ రఘునందన్ కూడా నిరంతర పర్యవేక్షణ కొనసాగించినట్లు పేర్కొన్నారు.

**"అపోహలు వద్దు.. ఆసుపత్రికి వెంటనే రావాలి" - సూపరింటెండెంట్ డా. రమణ**

"తురకపాలెం ప్రజలు ఆరోగ్య సమస్య ఉన్నప్పుడు ఆలస్యం చేయకుండా ఆసుపత్రికి రావాలి. ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యం అందట్లేదనే అపోహలు నమ్మొద్దు. ఎలీషా నేడు కోలుకోవడం మా సేవలకు ప్రత్యక్ష నిదర్శనం" అని డాక్టర్ రమణ తెలిపారు. తురకపాలెం కేసుల సమయంలో భయపడకుండా బాధ్యతగా పనిచేసిన నర్సింగ్ సిబ్బంది, నాలుగో తరగతి సిబ్బంది, మైక్రోబయాలజీ విభాగానికి ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

**తురకపాలెంలో ప్రత్యేక ఆరోగ్య క్యాంపులు**

డాక్టర్ తబిత మరియు ఆమె బృందం తురకపాలెంలో ప్రత్యేక ఆరోగ్య క్యాంపులు నిర్వహించి ప్రజల ఆరోగ్య పరిస్థితిని పరిశీలించారు. ప్రజలు ఆరోగ్యంగా ఉండాలంటే మంచి అలవాట్లు అలవరుచుకోవాలని సూచించారు.

**"ప్రతి విభాగం సమన్వయంతో సాధ్యమైన విజయం" - డా. ఉషారాణి**

జనరల్ మెడిసిన్ హెచ్‌ఓడీ డాక్టర్ పి. ఉషారాణి మాట్లాడుతూ, ఆర్థోపెడిక్స్ విభాగం డాక్టర్ అనిల్ కుమార్ మరియు వారి బృందం, జనరల్ సర్జరీ విభాగం పూర్తి సహకారం అందించారని తెలిపారు. "ప్రతి ఒక్కరు కూడా ప్రయత్నంలో లోపంలేకుండా కట్టుబాటుతో పనిచేశారు" అంటూ అందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

**చికిత్సలో పాల్గొన్న వైద్య బృందం కీలక పాత్ర**

ఈ కీలక కేసును విజయవంతంగా నిర్వహించడంలో అనుభవం కలిగిన వైద్యులతో పాటు యువ వైద్యులు కూడా సమానంగా సేవలందించారు. ప్రతి విభాగం సమన్వయంతో పనిచేయడం వల్లే రోగికి సమగ్ర చికిత్స అందించగలిగామని వైద్యులు పేర్కొన్నారు. డా. పి. ఉషారాణి – ప్రొఫెసర్ & హెచ్‌ఓడీ, జనరల్ మెడిసిన్, డా. సి. వాసవి – ప్రొఫెసర్, జనరల్ మెడిసిన్, డా. అనిల్ కుమార్ – ప్రొఫెసర్ & హెచ్‌ఓడీ, ఆర్థోపెడిక్స్, డా. జి. ప్రభాకర్ – అసిస్టెంట్ ప్రొఫెసర్, డా. కే. ఆశాజ్యోతి – పోస్ట్ గ్రాడ్యుయేట్, డా. వి. స్వర్ణ – పోస్ట్ గ్రాడ్యుయేట్, మైక్రోబయాలజీ విభాగం, జనరల్ సర్జరీ విభాగం ప్రతి ఒక్కరి నిబద్ధత, నిస్వార్థ సేవల వల్లే ఈ రోగి జీవితం రక్షించబడింది. ఈ కేసు ద్వారా ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రజల్లో ఉన్న నమ్మకం మరింతగా పెరుగుతూ, "ప్రభుత్వ వైద్యం అంటేనే భరోసా" అనే సందేశం స్పష్టంగా బయటపడింది.

Edited, Printed and Published by D.Ajay at Express Printers and Publishers D.No. 3-28-1, Brundavan Gardens, Guntur (A.P)-522006. RNI No. 52813/1993.
Administration Office : 126-352, Between 4th & 5th lanes , Kodandarama Nagar, Gorlavaripalem Donka, Gorantla, Guntur (AP)-522034. Ph 8106539118, 7416812467